
# మూసీ
# MUSI

• Samputi : 27 • Sanchika : 10 • Pages : 64 • Rs. 20
• August 2024


UGC CARE List
Approved Journal

- తెలంగాణలో స్వాతంత్ర్యోద్యమం
- ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల భవనం : కళ మరియు వాస్తు శిల్పం
- తెలంగాణ 33 జిల్లాల పేర్లు - మూలాలు
- మహాభారతం : 'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-8
- ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యము - చమత్కారాలు
- అన్నమాచార్య కీర్తనలు - నవవిధ భక్తి మార్గాలు
- ఈ పాటకు యాభై ఏండ్లు



Scanned with OKEN Scanner








# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 27 సంచిక : 10
ఆగస్టు - 2024
'క్రోధి' శ్రావణం మాసం

ISSN 2457-0796

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక'
(MUSI Telugu Monthly Magazine)
పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com992


## ఈ సంచికలో ...

### వ్యాసాలు


తెలంగాణలో స్వాతంత్ర్యోద్యమం ... డా. వెల్దండి శ్రీధర్ 7
ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల భవనం : కళ మరియు వాస్తు శిల్పం ... డా.శివానంద్ యాలాల 13
ప్రశ్న + ఉద్యమం + వివాదం = ఎస్వీ ... డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి 17
అష్టవిధ శృంగార నాయికలు - కావ్య సమన్వయం ... డా. గరికిపాటి గురజాడ 19
తెలంగాణలోని 33 జిల్లాల పేర్లు - మూలాలు ... డా. కోర్డ్డ సత్యనారాయణ 25
వెలుదండ సాహితీ సౌగంధిక సౌరభం (సృజనానందం) ... డా.మంత్రి శ్రీనివాస్ 31
మహాభారతం:'ధర్మ' ప్రశ్నలు - 'భీష్మ' సమాధానాలు-8 ... డా. అట్టెం దత్తయ్య 37
ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యము - చమత్కారాలు ... డా. డి. ప్రవీణ 41
అన్నమాచార్య కీర్తనలు - నవవిధ భక్తి మార్గాలు ... డా. గిరాజ శేషమాంబ 44
ఈ పాటకు యాబై ఏండ్లు ... ఆవాల హరిబాబు 47
తెలుగు భాషా సాహిత్య విప్లవ యోధుడు - గిడుగు ... డా. కె.వి.ఎన్.డి.వరప్రసాద్ 49
బహుజన మంగళోపనిషత్ ... డా. ఎస్. రఘు 51


### సమీక్షలు


కవిత్వపు కొత్త కొలమానం - 'అనిర్వచనం' కవితా సంపుటి ... డా. పి.విజయ్‌కుమార్ 54
శాసన మరందము ... ధూళిపాళ అరుణ 57
వైభవంగా ఆవిష్కృతమైన 'గురుతరం' ... ప్రవీణ్ కుమార్ బోళ్ళ 59
స్వీకృతి ... 61


### కవితలు


స్నేహమె స్వర్ణతుల్యమగు ... రాయప్రోలు సీతారామ శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; రచనల్లో సినారె ... ఏ. సాకి - 12; ఫాల్సిఫికేషన్ .. డా. తిరునగరి శరత్‌చంద్ర - 24; నవీన లోకపు ఆవిర్భావానికి ... ఆర్. నవజీవన్ రెడ్డి - 30; ఏకీకరణం ... ఆచార్య వెలుదండ నిత్యానందరావు - 50; స్వార్థం ఉంటే బాగుండు ... ధూళిపాళ్ళ మాధవీ కిశోర్ -62.





**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

***Printed, Published and Owned by :***
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2024

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి


స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



# రక్ష

రక్షణ, రక్ష శబ్దాలు మనకు వినబడుతూనే ఉంటాయి. రక్షక భటులు కూడా కనిపిస్తుంటారు. శరీరమే ముఖ్యమని, దానిని రక్షించుకోవడమే ముఖ్యమైన ధర్మమని భావించడం కూడా కనిపిస్తుంది. దేహానికి, వ్యక్తికి, కుటుంబానికి, సమాజానికి, దేశానికి, విశ్వానికి అన్నింటికీ రక్షణ వలయాలు ఉంటూనే ఉంటాయి. శ్రావణమాసంలో రక్ష (రాఖీ) కట్టడం కూడా సంప్రదాయంగానే వస్తుంది. ఒకరికి ఒకరు రక్ష, అందరికీ దైవం రక్ష అనే భావనయే ఈ రక్షాబంధనం.

రక్షణ అనేది అందరికీ అవసరం అయిన విషయం. శరీరంలో రక్షక కణాలు చాలా ఉంటాయి. ఎప్పటికప్పుడే వ్యక్తిని అవి రక్షిస్తుంటాయి. కుటుంబ పెద్ద కుటుంబానికి రక్షగా మిగిలి కావలసిన వ్యవహారాలన్నీ గమనిస్తుంటాయి. సమాజంలో రక్షక భటులు ఉండడం వల్ల వ్యవస్థల్లో కొంత వరకు జాగ్రత్త కనిపిస్తుంది. మార్గంలోని రక్షణ (శిక్షణ) వ్యవస్థ ప్రమాదాలు కాకుండా కాపాడటానికి ప్రయత్నం చేస్తుంది. రాష్ట్రానికి, దేశానికి సరియైన నాయకులు ఉంటే దేశమంతా రక్షింపబడుతుంది. శక్తివంతమవుతుంది. శరీరానికి నియమబద్ధ జీవనమే రక్ష. మనస్సుకు ధైర్యమే రక్ష. భూ గ్రహానికి ఓజోన్ పొర రక్ష. సౌరమండలానికి సూర్యుడు రక్ష. విశ్వానికి మూలశక్తి రక్ష. ఇలా రక్షణ ప్రతి చోటా కనిపిస్తూనే ఉంటుంది.

రక్ష చేసేవానికి అవసరమైతే శిక్షించే అవకాశం, అధికారం కూడా ఉంటాయి. రక్షించని వానికి ఈ అవకాశాలు ఉండవు. రక్షణ వ్యవస్థ మొత్తం ఇవే విషయాలను తెలియజేస్తుంది. అసలు రక్ష అనేది సృష్టిలో అన్ని జీవులకు, దేహాలకు కూడా ఉంది. శరీరంలోని సున్నిత భాగాలన్నీ బలమైన ఎముకల, అస్తికల చేత రక్షించబడి మాత్రమే పుడుతున్నాయి. వేరు వేరు జంతువులు, జీవాలు కూడా వాటివాటి విధానాన్ని అనుసరించి రక్షించబడుతున్నాయి. రక్షణ ఉన్నదన్న భావం ఉంటే మనస్సు వికసిస్తుంది. లేకుంటే అది సంకోచానికి గురి అవుతుంది. సంకోచానికి గురి అయిన మనస్సు వల్ల శరీరంలోని లక్షలాది కణాలు పూర్తిగా మూసుకుపోయి, శక్తిని ఆహ్వానించకుండా దూరంగా ఉంటుంది. రక్షక వ్యవస్థలో ఉన్నటువంటి కణాలకు మూల శక్తి అత్యధికంగా అందడమే కాకుండా అది ఆనందప్రదమవుతుంది కూడా.

రెండు పూటలా స్నానం, ఆరోగ్య నియమాల వల్ల బాహ్య దేహానికి రక్ష. మంచి ఆహారం, యోగ, ప్రాణాయామాదుల వల్ల అంతర దేహానికి రక్ష. నిరంతరం ఆలోచనలను మరో గొప్ప శక్తి చుట్టూ కేంద్రీకరించడం వల్ల మనస్సుకు రక్ష. రక్షణ ఉన్నచోటనే వృద్ధి ఉంటుంది. అసలు రక్షణ ఎక్కడ దొరుకుతుంది. ఎవరి రక్షణ వారే చేసుకోదగిన శక్తి వారికే ఉంటుంది. ఆ మూల శక్తికే చైతన్యం అని పేరు. దానితో మనం ఎంత ఎక్కువ సేపు గడిపితే అంతగా అది మనను రక్షిస్తూ ఉంటుంది. ఒక వెలుగు సమక్షంలో మనం వెలిగి పోయినట్లుగా, ఒక శక్తితో గడపడం మొదలు పెడితే మనం నిరంతరం శక్తివంతులమవుతాం. ఆ శక్తి అపరిమితంగా ఉండడం వల్ల మన చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రభావితం చేసే అవకాశం కలుగుతుంది. శక్తి తగ్గితే రక్షణ మార్గం తగ్గిపోతుంది. మనని ఒకరు రక్షించాలనే భావం కన్నా, మనమే లోకానికి రక్షణ అయ్యేవిధంగా ప్రయత్నం చేస్తూనే ఉండాలి. ఆరోగ్యం, ఆనందం, సంతృప్తి, ప్రశాంతత, ధైర్యం, సంతోషం, సౌఖ్యం మొదలైనవన్నీ రక్షక వ్యవస్థకు మూల కారణాలుగా మారుతాయి. మనసుకు ఇవన్నీ రక్షనిస్తాయి. ఇటువంటి విశ్వరక్షకమైన శక్తిని గుర్తుచేసే విధంగా ఈ రక్షాబంధన భావన ఉండాలని కోరుకుందాం.

# స్నేహమె స్వర్ణతుల్యమగు ...


రాయప్రోలు సీతారామ శర్మ
భీమవరం, ఫోన్ : 9701 764 878


ఏ కాలుష్యపు బాధలేక మది
తామెల్లప్పుడుం దగ్గరై
లోకోత్సాహదమాన్యహాసముల
నాలోకింపగా మెల్గుచున్
చీకున్ చింత విహీన వక్రముల
సచ్ఛ్రేయఃకళన్ బొల్చు స్నే
హొచ్చత్వంబదిమోదదాయకము
నాయుర్వృద్ధి ప్రభాపూతమున్

స్నేహమె స్వర్ణతుల్యమగు
స్నేహమె దగ్గర చుట్టమౌనుగా
స్నేహమె స్వచ్ఛ సంపదగు
స్నేహమె రక్షణ శీలవర్తియౌ
స్నేహమె బాధలన్మరువజేయును
స్నేహమె శీతచంద్రికౌ
స్నేహము పోలు నన్యమగు స్నిగ్ధ
సుగంధములేదు ధాత్రిపై.

భేదములెంచబోవనిది,
ప్రేమము కూర్మిని పంచునట్టిదిన్
ఖేదము మాన్పునౌషధము,
కేళిగ పల్కులనాడు బాటయున్
స్వాదు పరీమళాంచితము
చక్కని చెక్కిన శిల్ప శోభయౌ
గాదె! ధరిత్రి స్నేహమది
కల్గుటలెంతయు పూర్వపుణ్యమే!
(ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా..)








ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 (6) హైదరాబాద్ ఆగస్టు : 2024

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. ఉపోద్ఘాతం : ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. విషయం : పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. ముగింపు : పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
5. ఉపయుక్తగ్రంథసూచి : ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. మూసీ ప్రచురణలు, హైదరాబాద్.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000 : ఆనందవల్లీ గ్రంథమాల, అనంతపురం.

40

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

# తుకారాం అభంగం

కమలనయన నను కరుణించరా
కలతల బడితి దయచూపరా
కమలేశ కరుణాంతరంగ
హరి హరి విఠల నీ నీడనురా

ఆశల వలయమున ఇరికితిని
జగతి త్రోవలబడి నే విసిగితిని
అండ కోరి నిను వేడుచుంటిని
బండ మనసున నిను నిలుపుకుంటిని

మోహ లోభములు చుట్టినవి
నను సుడిగుండములో నెట్టినవి
రాజ భువన శ్రీ పండరినాథ
నీ కరము మోపి గట్టెకించవే

తుకా పిలుపులు వీనుల చేర
పరుగు పరుగున రారా...
రుక్మిణి వల్లభ ఓ భక్త సులభ
పుండరీక వరద పతిత పావన




అనువాదం :
డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10  హైదరాబాద్ ఆగష్టు : 2024

# తెలంగాణలో స్వాతంత్ర్యోద్యమం

**డా. వెల్దండి శ్రీధర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్గొండ.
ఫోన్ : 98669 77741

భారతదేశ స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణేతరులు తెలంగాణ ప్రాంతాన్ని ఒక చీకటి ఖండంగానే చూశారు. బ్రిటిష్ ఇండియాలో వచ్చినంత ఆధునికత తెలంగాణలో రాలేదని, అక్షరాస్యత తక్కువని పైగా ఆంగ్ల భాషా పరిచయం లేకపోవడం వల్ల ఆధునికత భావాలు ఉప్పొంగలేదని, మూఢవిశ్వాసాలు, ముతక జీవితం 'అయ్యా బాంచెన్ నీ కాల్మొక్తా' వైఖరి తెలంగాణ అంతటా పరుచుకుందని భావించారు. నిజాం ప్రభువు క్రూర పాలనలో ప్రజలు ఎలాంటి చైతన్యం లేకుండా చీకట్లోనే ఉండిపోయారని అనుకున్నారు. కాని ఇదంతా తప్పుడు అవగాహన అని చెప్పడానికి తెలంగాణ అంతటా ఎన్నో ఉదంతాలు పొటమరించాయి. ఎన్నో ఉద్యమాలు ఇదంతా అవాస్తవమని చాటాయి.

లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతిని భారతదేశ వ్యాప్తంగా 12-10-1800న మొదట అంగీకరించిన ప్రభువు నిజాం అలీఖాన్. దీనితో బ్రిటిష్ వాళ్ళు తెలంగాణలో కాలనీలు, విద్యాసంస్థల్ని స్థాపించడానికి మార్గం ఏర్పడింది. తద్వారా తెలంగాణలో ఆధునికత లేదా పాశ్చాత్యీకరణ వ్యాపించింది. అదే సమయంలో తెలంగాణలో బ్రిటిష్ వ్యతిరేకత కూడా మొదలైంది. ఈ బ్రిటిష్ వ్యతిరేక భావనలో ఎంతో మంది ముస్లింలు పాలుపంచుకున్నారు. అంటే తెలంగాణలో ఆధునికత, జాతీయోద్యమం రెండూ జమిలీగా సాగాయి. చాలామంది ముస్లిలు హైద్రాబాద్ రాజ్యంలో ఆధునిక విద్యావ్యాప్తి కోసం కృషి చేశారు. దీన్ని కూడా జాతీయోద్యమంలో భాగంగానే చూడాలి. ఆంగ్లేయులు నిజాం ప్రభువుతో పొత్తు పెట్టుకోవడం అటు నిజాం ప్రభువుకు ఇష్టంలేదు. ఇటు ప్రజలకూ ఇష్టం లేదని గమనించాలి.

ఉత్తర భారతదేశంలో ముస్లింలలో సాంఘిక సంస్కరణలను తీసుకురావడానికి, వారి రాజకీయ ప్రయోజనాలను సాధించడానికి వహాబీ ఉద్యమం మొదలైంది. అది క్రమంగా భారతదేశం నుండి ఇంగ్లీష్ పాలన పోవాలనే దిశకు మలుపు తిరిగింది. ఉత్తర భారతదేశంలో వహాబీ ఉద్యమాన్ని ప్రారంభించిన వాడు సయ్యద్ అహ్మద్ బ్రయిల్వీ. 1838 నాటికే ఈ ఉద్యమం దక్కన్‌కు పాకింది. హైదరాబాద్‌లో వహాబీ ఉద్యమానికి కేంద్ర బిందువు ముబారిజ్ ఉద్దౌలా. ఇతడు ఆనాటి నిజాం రాజు నాసిరుద్దౌలా (1829-1857)కు స్వయాన తమ్ముడు. ఇతడ్ని దేశ బహిష్కారం చేస్తే శాంతిభద్రతలకు భంగం కలుగుతుందని భావించిన ఆనాటి బ్రిటిష్ రెసిడెంట్ ఇతడిని అరెస్టు చేయించి కోటలో బంధించాడు. ఇతడే తెలంగాణలో తొలి స్వాతంత్ర్య సమర యోధుడు.




తెలంగాణలో 1800 నుంచే బ్రిటిష్ వ్యతిరేకత రగిలిపోయింది. 1854లో వహాబీ ఉద్యమకారుడు ముబారిజ్ ఉద్దౌలా జైలులోనే చనిపోవడం, 1855లో బొల్లారం కాంటింజెంట్ సైన్యంతో బ్రిగేడియర్ మెకంజా మీద దాడి చేయడం ఇవన్నీ 1857 తొలి భారత స్వాతంత్ర్య సమరానికి నాందీ పలికాయి. బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని నిజాం ప్రభువును డిమాండ్ చేస్తూ మసీదుల గోడల మీద నినాదాలు వెలిశాయి. **"బ్రిటిష్ వాళ్లకు భయపడకు అల్లా నీకు అండగా ఉంటాడు. భయపడితే గాజుల తొడుక్కొని ఇంట్లో కూర్చో"** అని నినదించారు. మక్కామసీదులో సమావేశమైన ప్రజలు నిజాం అక్రమంగా అరెస్టు చేసిన జమేదార్ చీదాఖాన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజాం ససేమిరా అనడంతో 500 మంది రోహిల్లాలు తుర్రేబాజ్‌ఖాన్, మౌల్వీ అల్లావుద్దీన్ నాయకత్వంలో కోఠిలోని బ్రిటిష్ రెసిడెంట్ భవనం మీద 17-07-1857న దాడి చేశారు. బ్రిటిష్ సైన్యం తెల్లవారుజాముదాకా పోరాడినా ఉద్యమకారులు లొంగిపోలేదు. చివరకు అతి కష్టం మీద తుర్రేబాజ్‌ఖాన్‌ను అరెస్టు చేయగలిగారు. అనంతరం జరిగిన విచారణలో దాడికి పూర్తి బాధ్యత తనదేనని తుర్రేబాజ్‌ఖాన్ ఒప్పుకున్నాడు. దీనితో తుర్రేబాజ్‌ఖాన్‌కు జీవిత ఖైదు విధించారు. తరువాత అతడు జైలు నుంచి తప్పించుకున్నాడు. కాని బ్రిటిష్ సైన్యం అతడిని మళ్లీ పట్టుకుంది. తరువాత తుర్రేబాజ్‌ఖాన్‌ను అతి దారుణంగా కాల్చి చంపి శవాన్ని సంకెళ్లతో బహిరంగ ప్రదేశంలో వేలాడదీయడంతో హైద్రాబాద్ ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. మరో వీరుడు అల్లావుద్దీన్ మౌల్వీని కూడా అరెస్టు చేసి అండమాన్ జైలుకు పంపారు. సుమారు 25 ఏళ్లు అతడు దేశ స్వాతంత్ర్యం కోసం జైలులోనే మగ్గిపోయి 1884లో చనిపోయాడు. 1000 మంది ప్రైవేటు సైన్యంతో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడిన

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10

హైదరాబాద్ ఆగస్టు : 2024




మంది స్వాతంత్ర్యాభిలాష సిద్దులుద్దీన్‌లను కూడా అరెస్టు చేసి జీవితఖైదీగా పంపారు. ఆంగ్లేయులకు వత్తాసు పలికిన సాలార్జంగ్‌ను కూడా ప్రజలు చీదరించుకున్నారు. తరువాత కల్నల్ డేవిడ్సన్, సాలార్జంగ్‌ల మీద దాడి కూడా చేశారు. బ్రిటిష్ వారి పట్ల శత్రుత్వం వహించిన అజ్మత్‌జంగ్, మీర్దాచంద్, ఖాజ్‌ఖాన్, మౌల్వీ ఇబ్రహింలను కూడా అరెస్టు చేసి జైలుపాలు చేశారు.

1860లో నిర్మల్ వద్ద రాంజీగోండు నాయకత్వంలో సుమారు 300 మంది గోండులు, 200 మంది రోహిల్లాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. తరువాత సయ్యద్ జమాలుద్దీన్ అఫ్ఘానీ, మౌల్వీ మొహిబ్ హుస్సేన్, అబ్దుల్ ఖయాం, మౌల్వీ అబ్దుల్ ముర్తజా లాంటివారు విద్య, సాంఘిక, పత్రికా రంగాలలో చేసిన కృషి వల్ల జాతీయోద్యమంలో అనేకమంది ముస్లింలు, ముస్లిమేతరులు పాల్గొనడానికి వీలైంది. 1888 అక్టోబర్ 21 సికింద్రాబాద్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ సభకు రెండు వేలమంది హాజరయ్యారు. ఈ సభ నిర్వహణకు అబ్దుల్ ఖయాం కీలకపాత్ర వహించారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం హైదరాబాద్ రాజ్యంలోకి కూడా అడుగుపెట్టింది. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, అబ్దుల్ ఖయాం లాంటివారు విదేశీ వస్తువులను బహిష్కరించుమని పిలుపునిచ్చారు. స్వదేశీ ఉద్యమంలో భాగంగానే ఉస్మానియా యూనివర్సిటీలో పనిచేస్తున్న సోషియాలజీ ప్రొఫెసర్ బద్రుల్ హసన్ బొంబాయి నుండి చరఖాలను తెప్పించాడు. 1918లో హైదరాబాద్ కాంగ్రెస్ కమిటి ఏర్పడింది. 1920లో గాంధీ చేపట్టిన శాసనోల్లంఘన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహాలతో ప్రభావితులై డా॥ జయసూర్య, మీర్ మహ్మద్ హుసేన్, అక్బర్ అలీఖాన్, మహ్మద్ అన్సారీ, మక్బూల్ అలీ మొదలైన వారు అనేక సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలను చైతన్య పరిచారు. ఖిలాఫత్ ఉద్యమంలో కూడా వేలాదిమంది ముస్లింలు పాల్గొన్నారు. 1938లో హైద్రాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఏర్పడింది. నిజాం ప్రభుత్వం వెంటనే దీన్ని నిషేధించింది. దీనికి వ్యతిరేకంగా 1938 అక్టోబర్‌లో రామానందతీర్థ, కాళోజీ, బద్దం ఎల్లారెడ్డి తదితరులు సత్యాగ్రహం చేసి అరెస్టయ్యారు. అనంతరం 1942లో కాంగ్రెస్ పార్టీ క్రిప్స్ ప్రతిపాదనలను తిరస్కరించి క్విట్ ఇండియా ఉద్యమాన్ని మొదలుపెట్టింది.

ఈ సందర్భంలోనే అప్పటిదాకా సాంస్కృతిక సంస్థగా ఉంటూ వచ్చిన 'అంజుమన్ ఇత్తేహాదుల్ ముసల్మాన్' సంస్థ రాజకీయ రూపాన్ని సంతరించుకొని 'రజాకార్'గా మారిపోయి జాతీయోద్యమానికి వ్యతిరేకంగా 'స్వతంత్ర హైద్రాబాద్' నినాదాన్ని లేవనెత్తింది. దీని వల్ల ముస్లింలలో చీలిక వచ్చి కొంతమంది ముస్లింలు రజాకార్ల వైపు వెళ్లగా మరికొంతమంది ముస్లింలు జాతీయోద్యమంలో భాగస్వాములుగా మారారు. అబిద్‌హుస్సేన్, సఫ్రానీలాంటి వారు సుభాష్‌చంద్రబోస్ స్థాపించిన 'ఆజాద్ హింద్ ఫౌజ్'లో చేరడమే దీనికి నిదర్శనం. మఖ్దూం మోహియుద్దీన్, బందగీలాంటి వారు నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. షోయబుల్లాఖాన్ రజాకార్లకు వ్యతిరేకంగా పత్రికలో సంపాదకీయ వ్యాసాలు రాసి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. 1948 సెప్టెంబర్‌లో జరిగిన భారత సైనిక చర్యతో రజాకార్ల పీడ విరగడైంది. తెలంగాణ ప్రజలు స్వతంత్ర భారతంలో విలీనం కావడాన్ని స్వాగతించి భారత సైన్యానికి మంగళహారతులు పట్టి ఆహ్వానించారు. ఉత్సవాలు జరిపారు.

**"ఏ జాతి ప్రజలైనా తమని పాలించే రాజ్యం చేతిలో తాము స్వేచ్ఛాజీవులమై విహరించాలని కోరుకోవడంలో ఎలాంటి సంశయం ఉండనక్కరలేదు. మరి అలాంటి స్వేచ్ఛను కోరుకునే ప్రజలు, ఒక వలస పాలకుల చేతిలో, ప్రజల్ని పీడించే నవాబులగుప్పిట్లో బందీయై బ్రతకాలని ఏ సామాజిక వర్గం కోరుకోదు. అలా కోరుకోని కొన్ని వర్గాలు ఏకమై తమ స్వేచ్ఛను బంధించిన రాజ్యం నుంచి బంధ విముక్తులవ్వాలనే సమైక్య భావనతో పరిష్కార దిశగా కొనసాగించిన పోరాట రూపాన్నే జాతీయోద్యమం అంటారు."** (తెలంగాణ కథ – జాతీయోద్యమం వ్యాసం, ఘనపురం సుదర్శన్) తెలంగాణ ప్రజలు తమ తక్షణ శత్రువైన నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడుతూనే స్వతంత్ర భారత్‌లో విలీనం కావాలని కలగన్నారు. ఈ కళ భారత ప్రభుత్వం 1948లో చేసిన 'ఆపరేషన్ పోలో'తో నెరవేరింది.

అంతకుముందు 1929 ఏప్రిల్‌లో మహాత్మా గాంధీ హైదరాబాద్‌కు వచ్చి కొంతమంది మహిళలతో సమావేశమై జాతీయోద్యమం గురించి, స్వదేశీ వస్త్రధారణ గురించి, ఖాదీ ఉత్పత్తి గురించి మాట్లాడి వారిలో స్వాతంత్ర్యకాంక్షను రగించారు. **"రాట్నం కామధేనువు. మన దేశానికది సకల వరప్రదాయిని. ఖద్దరు ఉత్పత్తికి హైదరాబాద్ రాష్ట్రంలో మంచి వాతావరణం ఉందని నాకు తెలిసింది. భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా సహాయ సహకారాలందించే స్థితిలో మీరున్నారు. ఇక్కడ మంచి నాణ్యత గల ఖాదీ ఉత్పత్తి అవుతుందని సరోజినీ నాయుడు నాకు చెప్పారు. నా మెడలో వేసిన నీలదండ హరిజనులు వడికినదని తెలుసుకొని నేనెంతో సంతోషపడ్డాను."** అని అన్నారు. ఈ ఉపన్యాసం పూర్తికాగానే సమావేశంలో ఉన్న కొంతమంది అప్పటికప్పుడు 12వేల రూపాయలను జమ చేసి గాంధీజీకి సమర్పించారు. తరువాతి కాలంలో కూడా గాంధీజీ తెలంగాణ వ్యాప్తంగా

పలు పట్టణాలను సందర్శించి ఆనాటి స్వాతంత్ర్యోద్యమకారులతో మాట్లాడి వారిలో ఉద్యమాన్ని రగిలించారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా చాలామంది కవులు జాతీయోద్యమ కవిత్వాన్ని, దేశభక్తి కవిత్వాన్ని రచించారు. ఆనాటి గోల్కొండతో పాటు ఇతర పత్రికల్లో జాతీయోద్యమ కవిత్వం ప్రచురింపబడింది. మహాపురుష ప్రశంస, నిజాం రాష్ట్ర ప్రశంస, దేశమాతను కీర్తించడం మొదలైన పద్ధతుల్లో ఈ జాతీయోద్యమ కవిత్వం వెలువడింది. తెలంగాణలో జాతీయోద్యమం లేదన్నట్లుగానే **"నిజాం రాష్ట్రమునందు ఆంధ్రకవులు పూజ్యము"** అని ముడుంబై వేంకట రాఘవాచార్యులులాంటి ఆంధ్ర పండితులు భ్రమపడ్డారు. దానికి సమాధానంగా సురవరం ప్రతాపరెడ్డి తన సంపాదకత్వంలో 354 మంది తెలంగాణ కవి, పండితులచే 'గోల్కొండ కవుల సంచిక' ను 1934లోనే వెలువరించారు. ఈ సంచికలోని పద్యాలను పలు విభాగాలుగా ప్రతాపరెడ్డి విభజించారు. అందులో దేశభక్తి కవిత్వం కూడా ఉండడం గమనార్హం.

**"వ్యాయామ సంఘపు పద్ధతుల్ జనులకు**
**విరివిగా నీవకా కఱపినావు**
**ధైర్యశౌర్యాదిసద్ధనముల నభివృద్ధి**
**నొందుటకీవకా యొజ్జవైతి**
**పరరాజ బలగర్వ భంజన మార్గమ్ము**
**నీవకావ జనులకు నేర్పినావు**
**స్వాతంత్ర్య సాహస సాధన సంపత్తి**
**గాంచుటకీవ కారణంబు**
**అరయనన్నింటి కాదర్శమగుదువీవ**
**నిన్నుబోలిన వ్యక్తులే సున్న సుమ్ము**
**పరమ పావన చారిత్ర! భరత పుత్ర**
**శ్రీశివాజీ మహారాజ సిద్ధతేజ!!"**
**('శివాజీ ప్రశంస', కో.క.అణ్ణన్. సంపత్కుమారాచార్యులు)**

హిందూ దేశాన్ని పరరాజుల చెర నుంచి కాపాడి జాతి వైరములను రూపుమాపిన ధైర్యశాలి శివాజీ. యవనులను అణచివేసిన ధైర్యశాలి. పరస్త్రీలను మాతృసమానంగా చూసిన మానవతావాది. గోవులను ప్రేమగా చూసి గోశాలలు నిర్మించిన జంతు ప్రేమికుడు. దేహదారుఢ్యము మెండుగా ఉంటేనే శత్రురాజులను గెల్వవచ్చని ప్రజలకు వ్యాయామ పద్ధతులు నేర్పినవాడు. ధైర్యశౌర్యాలకు ఆయనే గురువు వంటివాడు. పరరాజులను ఎలా ఓడించి విజయపథాన సాగిపోవాలో నేర్పిన రాజు. స్వాతంత్ర్యాన్ని ఎలా సాధించాలో చూపించిన మార్గదర్శి. ఇలా ఎన్నో గొప్ప విషయాల్లో నీవే ఆదర్శమూర్తివి. నిన్నుబోలిన వ్యక్తులు ఈ భువి మీద లేరు సుమా! ఈ దౌర్భాగ్య భారతదేశంలో కడుపు కూటి కోసం పరుల కాళ్లు ఒత్తి జీవయాత్రను సాగించేవారు ఎందరో ఉన్నారు. భర్త దూరమైన




భార్యలాగా, వెన్నెలలేని రాత్రిలాగా ఈ భారతదేశం ఈ రోజు దుర్భరమైన శోకంలో మునిగిపోయి ఉన్నది. ఓ దేవా! ఈ భారతదేశ దుఃఖమార్పడానికి శివాజీని మహారాజును వేగంగా పంపించుమని వేడుకుంటాడు కవి.

**"రాట్నలక్ష్మి మన రాజ్యలక్ష్మియని**
**రామభక్తి భవతరణశక్తి యని**
**స్వీయానుభవానంతరము జెప్పు**
**శ్రీమహితమూర్తి గాంధికి జోహార్**
**స్వీయ సౌఖ్య సర్వస్వ త్యాగము**
**జేసి మాతృ దేశోద్ధరణార్థము**
**కార్యరంగమున కొదమ సింగముల**
**కరణి దుముకు త్యాగులకిదె జోహార్"**
**('జోహార్' – పుతుంబాక దుర్గాప్రసాదరావు)**

భారత స్వాతంత్ర్య సంగ్రామ ఘట్టంలో గాంధీజీ పాత్ర అమోఘమైనది. శాంతి, అహింసా, సత్యాగ్రహం, నిరాహార దీక్ష, ఇలా గాంధీజీ అనుసరించిన మార్గాలన్నీ ఇప్పటికీ ప్రపంచానికి అనుసరణీయాలు. అందుకే గాంధీజీ వంటి మేటి నాయకునికి కవి 'జోహార్'లు సమర్పిస్తున్నాడు. రాట్నము తిప్పి స్వదేశీ వస్త్రాలు ధరించుమని, అస్పృశ్యతను నివారించుమని, పాశ్చాత్య నాగరికతా మోజు నుంచి దేశాన్ని కాపాడుమని దేశ ప్రజలకు తాను అనుసరించి చెప్పాడు గాంధీజీ అందుకే కవి మహాత్మాగాంధీకి జోహారులంటున్నాడు. గాంధీజీ ఒక్కడే కాదు ఆనాడు గాంధీ మార్గంలో పయనించి స్వీయ సౌఖ్యాలను త్యాగం చేసి, దేశమాత దాస్య శృంఖలాలను విడిపించడానికి స్వాతంత్ర్యోద్యమంలో కొదమ సింహాల్లాగా దూకిన త్యాగధనులందరికీ కవి జోహారులర్పిస్తున్నాడు.






**"ప్రజల దుష్టుల నుండి రక్షించు వీరులు**
**వారిని బీడించు వారలైరి**
**అరిరాజ బృంద సంహరణాభిలాషులు**
**పందలై మూలల బడిరి నేడు**
**రాజ్య నిర్మాణ దోర్బల మండితాగ్రణుల్**
**పరుల యేల్బడికి లోబడిరి నేడు**
**నిరత స్వరాజ్య సంస్కరణాభిలాషులు**
**దాసులై బ్రదికిరి దర్పముడిగి**
**దిక్తట వ్యాప్త పౌరుషాధిక్యులిపుడు**
**సహజ భీరుత్వ బోధనాచార్యులైరి**
**ఆత్మబలిదానమునకు ముందంజవేయు**
**వారు ప్రాణభీతిని తలల్ వంచినారు"**
**('నేటి ద్విజులు' – వైద్యవర వేంకట రాజన్న అవధాని)**

ఎంతో నిష్ఠాగరిష్ఠులైన బ్రాహ్మణోత్తములు నేడు ఎంత అధమ స్థితిలో ఉన్నారో చెప్తాదు కవి ఈ కవితలో. అంతేకాదు దుష్టుల నుండి ప్రజలను కాపాడే బ్రాహ్మణులు నేడు వారే ప్రజలను పీడిస్తున్నారు. శత్రురాజుల సంహరణలో ముందుండేవారు నేడు పిరికిపందలుగా మూలన పడ్డారు. రాజ్య నిర్మాణంలో అగ్రగణ్యులుగా ఉండే బ్రాహ్మణజాతి నేడు పరుల ఏలుబడిలో పడి కొట్టుమిట్టాడు తున్నారు. స్వరాజ్య సంస్కరణాభిలాషులై ఉండే భూలోక సురలు నేడు దర్పముడిగిపోయి బానిసలుగా బ్రతుకుచున్నారు. పౌరుషంలో దిగంతములను తాకే బ్రాహ్మణులు నేడు పిరికితనానికే ఆచార్యులుగా ఉన్నారు. ఆత్మబలిదానాల్లో ఎప్పుడూ ముందంజ వేసే బ్రాహ్మణులు నేడు ప్రాణభీతితో తలలు వంచేసినారు అని కవి ఆవేదన చెందుతాడు.

**"ఆయురారోగ్య సంపదలతిశయిల్లు**
**నైహికాముష్మికంబుల కాటపట్టు**
**పరమ కల్యాణ గుణపూత భరతమాత**
**మమ్ము బునరుద్ధరింపగా నమ్మి కొలుతు**
**వీరధర్మంబు దివికేగి విశ్రమించె**
**బ్రహ్మతేజంబు దస్సి విశ్రాంతిగనియె**
**భారతీయులు దౌర్భాగ్య పరతగనిరి**
**తిరిగి మమ్ముద్ధరింపుమో దేశమాత"**
**('దేశమాత' – శ్రీమతి వి. లక్ష్మీదేవమ్మ)**

ఒకప్పుడు ఆయురారోగ్యాలు, సంపదలతో విలసిల్లి, ఐహిక ఆముష్మికాలకు ఆటపట్టుగా నిలిచిన పరమ కల్యాణ గుణపూత అయిన ఓ భరతమాతా! నిన్నే నమ్మి కొలుస్తున్నాము మమ్ములను పునరుద్ధరించు అని వేడుకుంటుంది కవయిత్రి. అంతేకాదు వీరధర్మాన్ని చూపే ప్రజలు దివికేగారు. బ్రహ్మతేజస్సుతో వెలగాల్సిన వారు అలసిపోయి విశ్రాంతి తీసుకుంటున్నారు. దౌర్భాగ్యస్థితిలో ఉన్న భారతీయులను తిరిగి ఉద్ధరించు ఓ భరతమాతా! అని ప్రాధేయపడుతుంది.

**"ధర స్వాతంత్ర్యమె స్వర్గతుల్యమను తత్త్వజ్ఞాన లేశంబు లో**
**నరయన్ జాలని మందబుద్ధులిటు లాహా! మాదృశుల్ విత్త లో**
**భరతిన్ తుచ్ఛ సుఖానురక్తి నిజయావచ్ఛక్తులున్ రిత్తవో**
**బరతంత్రంబున బద్ధులౌదురిది యే ప్రారబ్ధ కర్మంబొకో"**
**('పారతంత్ర్యము' – గవ్వా జానకి రామరెడ్డి)**

స్వేచ్ఛావాయువులు పీల్చే స్వాతంత్ర్యమే స్వర్గముతో సమానమనే తత్త్వజ్ఞానం కొంచెం కూడా లేకుండా నాలాంటి మందబుద్ధులు తుచ్ఛమైన, నీచమైన సుఖాల కోసం వెంపర్లాడుతూ యావచ్ఛక్తిని కోల్పోయి పరపాలనకు బద్ధులై నిల్చుండిపోయారు. ఇది ఏనాటి ప్రారబ్ధ కర్మమో కదా! అని కవి వాపోతున్నాడు.

**"స్వీయదేశమునందుండి చిద్విలాస**
**మొసగు వస్త్రమున్ వీడి వేర్వసనమునకు**
**జీతులన్ జాచు టెంతయు సిగ్గటంచు**
**నరయలేకున్న బ్రతుకేల? ఆంధ్రపుత్ర!**
**తనువునన్ వికలాంగు దుద్భవము నొందె**
**నేని, నీ ప్రేమ నిలువదా వానిపైన**
**నటుల నీ దేశవస్త్రము నాదరించి**
**ముతకదైనను దాల్చుటే ముఖ్యమంచు**
**నరయలేకున్న బ్రతుకేల? ఆంధ్రపుత్ర!"**
**('ఆంధ్రపుత్ర' – వడగం రాజేశ్వరరావు)**

స్వదేశములో నివసిస్తూ చిద్విలాసమైన విదేశీ వస్త్రమును ధరించాలని చూడడం ఎంత సిగ్గుచేటో తెలుసుకోకపోతే ఆ బ్రతుకెందుకు? మనకు వికలాంగుడైన కొడుకు పుట్టినంత మాత్రాన అతని మీద ప్రేమ చావదు కదా!

అలాగే నాజూకుతనం లేకున్నా, ముతకదైనా స్వదేశీ వస్త్రాన్నే ధరించడం ముఖ్యమని తెలుసుకోని బ్రతుకెందుకు ఆంధ్రపుత్రకా? అని ప్రశ్నించి స్వదేశీ వస్త్ర ధారణను ప్రచారం చేస్తాడు ఈ కవితలో కవి.

**"లాఠిదెబ్బల లక్ష్యమేమీ / కఠిన శిక్షయె కాదు కాదు**
**మాతృదేశము మాతృదేశమే / ...............................**
**స్వర్గమే అపవర్గమేయని / చాటి చెప్పెదు జన్మభూమియె**
**పరులవశమున నరక కూపము /కన్న హేయము కఠినతరము"**
**('మాతృదేశము'- కాళోజీ, నాగొడవ)**

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా దేశభక్తి ప్రబోధాత్మకమైన గేయాలను ప్రచురించాలనే ఉద్దేశంతో సర్ వాల్టర్ స్కాట్ రాసిన 'Lay of the last minstrel' అనే గేయంలోని


"Breathes there a man, with soul so dead
Who has not said unto himself, this is my own native land" అనే చరణాలకు అదే భావంతో రాసిన గేయమిది.

ఏ వ్యక్తికైనా మాతృదేశాన్ని మించిన పవిత్రమైన ప్రదేశ మేముంటుంది? మాతృదేశము అనే మాటే ఎంతో వైబ్రేషన్‌కు గురిచేస్తుంది. అది నీరులేని ఎడారైనా, వాన వరదల వసతియైనా, అగ్గికొండల అవనియైనా మాతృదేశము మాతృదేశమే అంటాడు కవి. ఎన్ని దేశాలు తిరిగి చూసినా మాతృదేశాన్ని మించిన స్వర్గసీమ కనిపించదంటాడు.

**"నలుబది కోట్ల భారత జనమ్ముల వందల యేండ్ల బంధన మ్ముల్ సడలించినావు, జయముల్ గొనినావు త్రివర్ణకాంతులన్ తళతళలాడు భారత పతాకము నాకము తాకునంత యె త్తుల కెగయించినావు, పగతుర్ కొనియాడగ పెంచినాడవున్"**
**('క్షమామూర్తి'- దాశరథి, ప్రజాకవి దాశరథి సాహిత్యం -1)**

1948 జనవరి 30న మహాత్మాగాంధీ గాడ్సే తూటాలకు బలైపోయినపుడు నిజామాబాద్ జైల్లో శిక్షననుభవిస్తూ దాశరథి రాసిన పద్యమిది. దేశాన్ని బంధవిముక్తం చేయడానికి, యుగయుగాల చీకట్లను తొలగించడానికి గుండెలో నుండి నెత్తురులను పిండి పోసినావు. మతచిచ్చును రూపుమాపడానికి, ప్రజా సమైక్యతకు ప్రాణమొడ్డిన మహాత్ముడవు. నీవు భూమిపై కాలిడగానే కాలమనే సావిత్రి వందల యుగాల నుండి భీషణ గర్భవేదన సుఖప్రసవాన్ని పొందింది అని కవి గాంధీజీ త్యాగశీలతను, ఆయన గొప్పతనాన్ని కొనియాడారు.

ఇలా తెలంగాణ వ్యాప్తంగా చాలామంది ఆనాటి కవులు జాతీయోద్యమ, దేశభక్తి కవిత్వాన్ని వినిపించారు. ప్రధానంగా మద్దోజు సత్యనారాయణ, ధవళా శ్రీనివాసరావు, వేముగంటి నర్సింహా చార్యులు, కోగంటి దుర్గా మల్లిఖార్జునరావు, దేవులపల్లి రామానుజా రావు, బిరుదురాజు రామరాజు, బెల్లంకొండ చంద్రమౌళి, అద్దూరి

అయోధ్యరామకవి, కాంచనపల్లి చినవెంకటరామారావు మొదలైనవారు జాతీయోద్యమంలోని వివిధ కోణాలను పద్యాలుగా, వచన కవిత్వంగా, పాటలుగా రాసి వినిపించారు.

**"కదనాన శత్రువుల కుత్తుకల నవలీల**
**నుత్తరించిన బలోన్మత్తులేలిన భూమి**
**ధీరులకు మొగసాలరా!**
**తెలగాణ వీరులకు కాణాచిరా!!" -రావెల వెంకటరామారావు**

ఈ పాట ఆనాడు తెలంగాణ ఔన్నత్యాన్ని, సాంస్కృతిక వారసత్వాన్ని, తెలంగాణ పోరాటశీలాన్ని చాటి ఉద్యమ వీరుల గుండెల్లో సమరశంఖాన్ని పూరించింది. గడియారం వెంకటశేషశాస్త్రి రాసిన శివభారతము, బాపూజీ ఆత్మకథ, రాణాప్రతాపసింహచరిత్ర వంటివి ఎంతో ప్రసిద్ధిగాంచినవి.

**ఆధార గ్రంథాలు**


1. తెలంగాణ చరిత్ర – డా॥ సుంకిరెడ్డి నారాయణరెడ్డి
2. ఉద్యమదర్శనము – డా॥ ముదిగొండ శివప్రసాద్
3. గోలకొండ కవుల సంచిక – సం. సురవరం ప్రతాపరెడ్డి
4. ప్రజాకవి దాశరథి సాహిత్యం – 1 – దాశరథి
5. నా గొడవ – కాళోజీ నారాయణరావు
6. తెలంగాణ సాహిత్యం – సమాలోచన
– సం. ఆచార్య సూర్యాధనంజయ్





ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 12 హైదరాబాద్ ఆగస్టు : 2024

# రచనల్లో సినారె ...

ఏ. సాకి, ఫోన్ : 994 939 4688







'కాలం అంచుమీద' నిలబడి
'కవిత నా చిరునామా' అని
"ప్రపంచ పదుల" ను సృష్టించిన
'జాతిరత్నం' సినారె..
'ఆరోహణ' 'దృక్పథం'తో కవితలల్లి
భూగోళమంత మనిషి బొమ్మనీ చేసి
జ్ఞానపీఠం పై "విశ్వంభరను"నిలిపిన
"గాంధీయ" వాది సినారె...
'వాక్కుకు వయసు లేదు'అంటూ
'క్షేత్రబంధం'తో 'అలలెత్తే అడుగులు'వేసి
రణం మరణం పైనే! చేసిన
"జలపాతం" మన సినారె.....
'గదిలో సముద్రమని తెలుగు గజళ్ల'
'శిఖరాలు లోయలు' చూసి
'దూరాలను దూసుకొచ్చి'
'పాశ్చాత్య దేశాల్లో యాభై రోజులు'న్నా
ఓ యాత్రా చరిత్రగ రాసిన
"వ్యక్తిత్వం" మన సినారె
మట్టి మనిషినీ ఆకాశం వైపుకి
రెక్కల సంతకాలు తొడిగించి
'సమదర్శన'మై 'జాతికి ఊపిరి స్వాతంత్ర్యం '
అన్న "విశ్వగీతి" మన సినారె
కొనగోటి మీద జీవితం కాదు ఇది
మనిషిగా ప్రవహించాలని జ్వాలగా జీవించాలని
నా చూపు రేపటి వైపని
మనిషిని మేల్కొల్పెను మన సినారె...
ఏవీ ఆ జీవనిధులు? అని ప్రశ్నించి
కలిసి నడిచే కాలం సమూహం వైపుకి కదిలించి
'కలం సాక్షిగా' తేనె పాటల అందించిన
'మందార మకరందం' మన సినారె..
'మధ్యతరగతి మందహాసం'లో
'మరో హరివిల్లు' విరియించి
'ముఖాముఖి'గా 'మనిషి-చిలక' ను
పలికించిన మన సినారె 'కలం అలిగింది'
మట్టి మనిషి ఆకాశమై......
విశ్వ(నాథ)నాయకుడు గా నిలిచాడు......
మన విశ్వంభరుడు..
(29 జులై... సినారె జయంతి)

# ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల భవనం : కళ మరియు వాస్తుశిల్పం

**డా. శివానంద్ యాలాల,** అధ్యాపకులు, ఆర్కియాలజీ విభాగం, ఓయూ. ఫోన్ : 96188 36268

**ఉపోద్ఘాతం**

భారతదేశంలో ప్రాచీనకాలం నుండి సాంప్రదాయక విద్య, ప్రామాణిక విద్యా విధానాలు సర్వసాధారణం. మొదటి వేయి సంవత్సరాల కాలంలో, నలంద, తక్షశిల, ఉజ్జయిని, విక్రమశిల విశ్వవిద్యాలయాలు ఎంతో ప్రాశస్త్యం పొందాయి. ఒక్కొక్క విశ్వవిద్యాలయం ఒక్కో విషయంలో ప్రాముఖ్యమైన విద్యనందించేది. నలంద, తక్షశిల, ఉజ్జయిని, విక్రమశిల విశ్వవిద్యాలయాలలో 17వ శతాబ్దం వరకూ విద్యావిధానాలు సార్వజనీకంగానూ, సకలశాస్త్రాలలో విశాలంగానూ సాగాయి. ఈ విశ్వవిద్యాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా, భారతదేశ సాంస్కృతిక వారసత్వ కేంద్రాలుగా వర్థిల్లాయి.

మన భాగ్యనగరంలో 20వ శతాబ్దంలో ఏర్పడిన ఉస్మానియా విశ్వవిద్యాలయం కూడా విశ్వవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించింది. శతవసంతాలు నిండి ఎంతో ఘనకీర్తి కలిగిన ఈ సరస్వతి ఆలయాన్ని గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం.

**చారిత్రిక నేపథ్యం**

20 వ శతాబ్దపు తొలి రోజులలో సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యంలో భాగంగా ఆధునిక విద్యను ప్రోత్సహించడానికి పలువురు ప్రముఖులు ముందు వరుసలో నిలబడారు. వారిలో ప్రముఖులు రవీంద్రనాథ్ ఠాగూర్, మైసూర్ మహారాజు కృష్ణరాజ ఒడయార్ లాంటివారు ఉన్నారు. వీరిలో రవీంద్రనాథ్ ఠాగూర్ పాత్ర చాలా ప్రముఖయింది. రవీంద్రనాథ్ ఠాగూర్ మైసూర్ పర్యటనతో నిజాం మరియు ఇతర ప్రాంతాల పాలకులపై గట్టి ప్రభావం పడింది. 1914లో రవీంద్రనాథ్ ఠాగూర్ కృష్ణరాజ ఒడయార్‌ను కలిసిన తర్వాత అక్కడ విద్యను ప్రోత్సహించడంలో విపరీతమైన ప్రభావం కనబరచారు. మహారాజు జోక్యంతో హైదరాబాద్‌లో మహిళా కళాశాల ఏర్పాటు చేయబడింది.

1917, ఏప్రిల్ 26 వ తేదీన 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఓ చారిత్రక నిర్ణయం తీసుకుని, తెలంగాణ ప్రాంతంలో విద్యను అభివృద్ధి చేసేందుకు ఓ ఫర్మానాను విడుదల చేసారు. దాంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం ఏర్పడింది. మొదట్లో గన్‌ఫౌండ్రి, అబీడ్స్‌లోని ఎనిమిది అద్దె భవనాల్లో తరగతులను నిర్వహించారు. సర్ రాస్ మసూద్ మొదటి ప్రిన్సిపాల్‌గా బాధ్యత వహించారు.

1918వ సంవత్సరంలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కీర్తిస్తూ ఉత్తరం రాసారు. యూనివర్సిటీ ఫర్మానాను 1918 సెప్టెంబరులో అమలు పరిచారు.



1919లో ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ప్రారంభమైంది.
1921లో మొదటి ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించారు.
1923లో బి.ఏ పరీక్షలు నిర్వహించారు.
1923లో థియాలజీ, ఆర్ట్స్, సైన్స్, లాకోర్సులు ప్రారంభమయ్యాయి.
1925లో ఎం.ఏ, ఎల్.ఎల్.బి. పరీక్షలు నిర్వహించారు.
1927లో ఎం.బి.బి.ఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి.
1929లో టీచర్స్ ట్రైనింగ్ క్లాసులు ప్రారంభమైనాయి
1929లో ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభమైంది.

అయితే విశ్వవిద్యాలయానికి ఒక ప్రత్యేకమైన భవనం మరియు ప్రదేశం ఉండాలని మీర్ ఉస్మాన్ అలీఖాన్ నిర్ణయించారు. మా లకాబాయ్ చందా జాగీరు 1400 ఎకరాలతో పాటు మరో 900 ఎకరాలను కలిపి మొత్తం 2300 ఎకరాల స్థలాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయానికి కేటాయించారు.

మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆదేశంతో సయ్యద్ అలీ రజా మరియు నవాబ్‌యార్ జంగ్‌లు ప్రపంచ పర్యటనకు 24 సెప్టెంబర్, 1930న బయలుదేరారు.

మద్రాస్ నుండి కొలంబో మీదుగా జపాన్ బయలుదేరారు. జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీలో రెండు నెలలు గడిపారు. అక్కడి నుండి యు.ఎస్.ఎలోని శాన్‌ఫ్రాన్సిస్‌కో వెళ్లారు. అమెరికాలో మూడు నెలలు గడిపారు.

యేలె, హార్వర్డ్ యూనివర్సిటీలను నిశితంగా గమనించారు. కాలిఫోర్నియా, స్టాన్‌ఫర్డ్, విస్‌కాన్సిన్, ఇల్లినోయిస్, చికాగో, న్యూయార్క్ మరియు కొలంబియా యూనివర్సిటీలను సందర్శించారు. ఇక అమెరికా నుండి ఇంగ్లాండుకు బయలు దేరారు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, ఇడెన్‌బర్గ్, మాంచెస్టర్ యూనివర్సిటీలను సందర్శించారు. నిర్మాణంలో ఉన్న కింగ్‌స్టన్, బర్గింగ్‌హమ్, లీడ్స్‌లను పరిశీలించారు.



అటునుండి ఫ్రాన్స్, సోర్‌బొన్నె, లైడెన్, హైడెల్‌బర్గ్, మ్యూనిచ్ మరియు జర్మనీలోని బెర్లిన్, ఆస్ట్రియా, వియన్నా, యూనివర్సిటీ ఆఫ్ హంగేరీ లను సందర్శించారు.

యూరప్‌టూర్ నుండి ఈజిప్టు, టర్కీలను సందర్శించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈజిప్టులో బెల్జియం ఆర్కిటెక్ట్ మాన్‌సెయూర్ ఇ. జస్పర్‌ను కలిశారు. అతడి అర్చిటెక్చరల్ స్టైల్‌కు ముచ్చటపడిన సయ్యద్ అలీ రజా, నవాబ్ జైన్ యార్‌జంగ్‌లు జస్పర్‌ను ఉస్మానియా యూనివర్సిటీ బిల్డింగ్ ప్రాజెక్టుకు కన్సల్‌టంట్ ఆర్కిటెక్ట్‌గా ఎంపిక చేసారు.

**అద్భుత కట్టడం ఆర్ట్స్ కళాశాల భవనం**

ఆర్ట్స్ కాలేజ్, కైరోలోని సుల్తాన్ హసన్ కాలేజ్‌ను పోలి ఉంటుంది. ఆర్ట్స్ కళాశాల భవనం ఒక వినూత్నమైన కట్టడం. అద్భుత కట్టడంగా నిలిచిన ఈ గ్రానైట్ భవనం ఉస్మాన్ షాహీ తదనంతర వాస్తు శిల్పం యొక్క మచ్చుతునుక. ఈ కట్టడం హిందూ దేవాలయ శైలిని అనుసరిస్తూ, ఇండో సార్సనిక్ శైలిలో నిర్మితమైంది.

ఈ సాటిలేని శైలిలో మధ్యయుగం నాటి ముస్లిం, అరబ్బు, మూరిష్ మరియు గోతిక్ శైలిల వాస్తు శిల్పం కలిసి ఉంది. తన గొప్పతనాన్ని చాటుతూ వందేళ్ల ఉస్మానియా యూనివర్సిటీకి కేంద్రంగా ఉంది. ఈ కళాశాల, ఉస్మానియా యూనివర్సిటీగా ప్రారంభమై తన ఆధ్యాత్మిక ప్రస్థానాన్ని కళ మరియు సౌందర్య శాస్త్రం కలిసి గ్రానైట్ తో చెక్కబడి ఉంది.



ఆర్ట్స్ కాలేజ్ రెండంతస్తుల భవనం. దీని వైశాల్యం 2.5 లక్షల చదరపు అడుగులు. బేస్మెంట్ యొక్క ఉపరితలం చెక్కబడిన గ్రానైటుతో ఉంది. లోపలి భాగాలు సున్నం చేత కప్పబడి పైకప్పు జాక్ ఆర్చ్ వలె ఉంది. ప్రాజెక్ట్ ఏరియా దగ్గరలోని రాతిగనులనుండి తేబడిన గులాబీ రంగు ఛాయతో కూడిన గ్రానైట్ తో చెక్కబడి, నిర్మితమైంది.

ఆర్ట్స్ కళాశాలకు సమాంతరంగా ఏ నిర్మాణము లేదు. గట్టివైన పింక్ గ్రానైట్ ను తొలిచి, వాటిని అందముగా రూపుదిద్దడములో పాలుపంచుకున్న శిల్పులను తంజావూరు, తురుకపాలెం, కంజీవరం మొదలగు ప్రాంతాల నుండి రప్పించారు.

ఈ భవనం యొక్క అతిపెద్ద ద్వారం చెక్కబడిన గ్రానైటుతో ఉంది. చూడటానికి ఈ ద్వారం రెండు గుండ్రటి నునుపు చేయబడిన గ్రానైట్ స్తంభాలను కలిగి ఉంది. ప్రధాన వారం నిలువుగా ముందుకు చొచ్చుకుని ఉంది. అది పక్క గోడల కంటే ముందుకొచ్చి ఎత్తైన ప్రదేశంగా ఉంది. ఈ తోరణంలో అర్ధ చంద్రాకార Stalactite Vault ఉంది. ఫలితంగా ఇది అద్భుత నిర్మాణంగా, ఒక అర్ధ చంద్రాకార గుమ్మటంతో సున్నపురాయితో కూడిన అలంకారము మిహ్రాబ్ ఆకారాన్ని ప్రతిబింబిస్తుంది.

ఈ కళాశాల యొక్క బాహ్య రూపం ప్రధానంగా పెర్షియన్ పిస్తాఖ్ శైలిలో ఉంది. కాలేజీ లోపల పరచిన నేల, మెట్ల వరస మరియు రైలింగ్స్ రెండువైపులా ఆధారపడే విధంగా పింక్ టెర్రస్ ఉంది.

మొదటి మరియు రెండవ అంతస్తులు షాబాద్ రాయితో పరచబడి ఉన్నాయి. పై అంతస్థు హాల్ దారిలో అద్భుతమైన గోపురం కనబడుతుంది. అవి శాండిలియర్ ద్వయంతో ఉన్నాయ్. గోపురం రెండస్థుల నిర్మాణంగా ఉంది. మొదటి అంతస్తులో 16 దిశలను కల్గిన కిటికీ అద్దాలతో ఉంది. డోమ్ లో 32 తిరగబడిన “A’ అక్షరం కలిగి ఉంది. ఎత్తైన నునుపు మరియు గుండ్రంగా ఉన్న గ్రానైట్ స్తంభాలు ద్వారానికి ఇరువైపులా ఉన్నాయి. అవి ముఖద్వారం యొక్క ఎత్తును పెంచుతున్నట్టుగా కనిపిస్తాయి. ఈ అత్యద్భుత తోరణం సిబ్బందినీ, విద్యార్థులను మరియు సందర్శకులను ఆశ్చర్యపరిచే అంతర్భాగానికి ఆహ్వానిస్తుంది.

భవనం యొక్క లోపలి భాగం అలంకరణ, పక్క గోడల అలంకరణ, బహిర్గతమైన వరండా కృత్రిమ గ్రానైట్ తో నిర్మించబడింది. ప్రణాళిక అంతా సంపూర్ణముగా రేఖాగణితం ప్రకారం ఉంది. మూడు భాగాలుగా ఉన్న ఈ భవనంలో ఒకే విధమైన రేఖాగణిత ఆధారాలు కనిపించడం ఎంతో సంతోషకరం.

ముస్లిం వాస్తు శైలిలో ఉన్న ఈ భాగాలు డెక్కన్ శైలిలోని శిలలను చెక్కడం, వాస్తు శిల్పం కలగలిసి ఉన్నాయి. ఉదాహరణకు ఎల్లోరాలో

గల టిన్‌తాల్ నిజాం రాజ్యంలో భాగంగా ఉంది. షణ్ముఖ పిట్టగోడలు బౌద్ధ గుహల వాస్తు శిల్పం మరియు డెక్కన్ శైలిలను పోలి ఉంది. ప్రధాన ద్వారము, హాలు క్రింది అంతస్తులో ఉంది.

ఆర్ట్స్ కళాశాల గోపురం కలిగి ఉండి, కిరీటం ధరించినట్టుగా ఉంది. మొదటి అంతస్థులో నేలంతా మెరుస్తున్న గులాబీ టెర్రాజో తో మరియు సౌందర్యం కొరకు ఏర్పరచబడిన 24 స్థంభములతో కూడి ఉంది. ఈ స్థంభాలు హిందూ వాస్తు శిల్పానికి మారుపేరుగా ఉన్నాయి. ఉపరితల భాగాలు ఉసిరికాయ వంటి ఆకృతిని కలిగి ఉంటాయి.

ప్రభుత్వ భవనాల నిర్మాణ చరిత్రలో ఈ కళాశాల భవనం ఒక మార్గదర్శిగా ఉంటూ, పెద్ద ఎత్తున ఆర్ సి సి ని వాడారు. బహిర్గతమైన విశాల ప్రాంతం చుట్టూ ఆర్కెడ్స్ కలిగి ఉన్నాయి. ఇది మధ్యయుగ ఇస్లామిక్ వాస్తుశిల్పం యొక్క ఒక ప్రధాన శైలి. లింటేల్ శైలి కలిగిన అజంతా, ఎల్లోరాలను పోలి ఉంది ఆర్ట్స్ కళాశాల భవన స్తంభాల యొక్క కలయిక, తోరణాలు ఢిల్లీ, ఆగ్రా, చార్మినార్, మక్కా మదీన హైదరాబాద్ మాదిరిగా ఉన్నాయి. ఈ తోరణాలను ఇండో సార్సనిక్ గా పిలుస్తారు.

తోరణాలు మరియు సున్నితమైన స్తంభాలు అరేబియన్ తరహాలో నిర్మించబడ్డాయి. షణ్ముఖ స్తంభాల వాస్తుశైలి మనకు ప్రధానంగా ఎల్లోరాలో కనిపిస్తుంది. వాస్తుశిల్ప ప్రధానమైన అలంకరణలో ముకరానస్, సున్నపురాయి, మెహ్రాబ్స్ రేఖాగణిత ఆకారాలు, దీర్ఘ చతురస్రాకారాలు మరియు వివిధ రకాల వజ్రాల శైలులను కలిగి ఉంది. మొత్తం కళాశాల అలంకరణ ప్రశాంతతను కలుగజేస్తూ, కన్నులకు ఇంపుగా ఉండే విధంగా తీర్చిదిద్దబడింది.

**ముగింపు**

మొదట్లో ఆర్ట్స్ కాలేజ్ భవనంలోనే వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, యూనివర్సిటీ గ్రంథాలయం, లా కాలేజ్ మరియు కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంటు ఆఫీసులు కూడా ఉండేవి. కాలక్రమేణా ఈ కార్యాలయాలు ప్రత్యేక భవనాలకు తరలించబడ్డాయి. ఆ తర్వాత కళాశాల పేరును యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్‌గా మార్చబడింది. వంద సంవత్సరాల ఉస్మానియా యూనివర్సిటీ ప్రయాణంలో ఎందరో మహానుభావులను తీర్చిదిద్ది, వారివారి రంగాలలో చెరగని ముద్రవేసి, రాబోయే తరాలకు మార్గదర్శకులయ్యారు.

చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్న చదువుల తల్లి మన ఉస్మానియా యూనివర్సిటీ. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది మేధావులను తయారు చేసిన ఘనత మన ఉస్మానియాకు దక్కుతుంది. సివిల్ సర్వీసెస్ అధికారులుగా, రాజకీయ నాయకులుగా, శాస్త్రవేత్తలుగా, ఇండస్ట్రియలిస్టులుగా, సమాజ సేవకులుగా, మారుమూల గ్రామం నుండి ప్రపంచం ముందు తలెత్తుకొనే లాగా ఎంతో



మందిని ఈ ప్రపంచానికి అందించిన ఘనత మన ఉస్మానియాది. విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపి, ఆత్మాభిమానంతో భారతదేశ చరిత్ర, సంస్కృతిని కాపాడి, ఇంకా ఎంతో మంది మేధోవికాసానికి, దేశ అభివృద్ధిలో తన వంతు కృషి చేస్తూనే ఉంటుంది మన శత వసంతాలు నిండిన సరస్వతి నిలయం, మన ఉస్మానియా. చారిత్రిక ఘట్టాలకు ప్రత్యక్ష సాక్షి గా నిలిచింది ఆర్ట్స్ కళాశాల భవనం.

**ఆధార గ్రంథాలు**

1. ఆచార్య రాధాకృష్ణ శర్మ, మరియు ఆచార్య ఎస్. ధారేశ్వరి, ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ : ఏ స్టడీ ఇన్ ఎడ్యుకేషనల్ ఆర్కిటెక్చర్, డిపార్ట్మెంట్ ఆఫ్ యెన్సిఏంటు ఇండియన్ హిస్టరీ, కల్చర్ అండ్ ఆర్కియాలజీ, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్, 2006.

2. హైదరాబాద్ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ, కన్సర్వేషన్ ఆఫ్ హెరిటేజ్ బిల్డింగ్స్ అండ్ హెరిటేజ్ ప్రెసింక్ట్స్ (రాక్స్) ఇన్ హైదరాబాద్ సిటీ, రేగులేషన్స్ అండ్ లిస్ట్, ఫిబ్రవరి, 1997. 5, 6, 11.

3. హెరిటేజ్, టూరిజం అండ్ సొసైటీ, ఎడిటెడ్ బై డేవిడ్, టి. హెర్బర్ట్, 1995,32.

4 ఘోష్, సురేష్ చంద్ర (ఎడ్.) డెవలప్మెంట్ ఆఫ్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ 1916–1920, న్యూ ఢిల్లీ, 1977, 1–2.

5. ఏ స్లైస్ ఆఫ్ ఈజిప్టు ఇన్ హైదరాబాద్, ది హిందూ, చెన్నై, ఇండియా, 14, ఫిబ్రవరి, 2011.

6. ఆర్ట్స్ కాలేజ్: ఏ హిస్టారిక్ మాస్టర్ పీస్, ది హిందూ, 8, అక్టోబర్, 2012.

7. జెనెసిస్, ఉస్మానియా కొరియర్, పబ్లిష్డ్ బై ఉస్మానియా యూనివర్సిటీ, 28, ఏప్రిల్, 2017.

❖ ❖ ❖ ❖ ❖

## ఆదిత్య హృదయ మహిమ

**"రశ్మిమన్తం సముద్యన్తం దేవాసుర నమస్కృతమ్
పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్"**

ఒక చిన్నసంవాదం గుర్తుకు వస్తుంది. నాకు నమకచమకాలు, శ్రీసూక్త పురుషసూక్తాలు ఉపదేశించిన ఒక మహానుభావుడు ఒకనాడు శర్మగారూ! జపము, తపము, ఉపాసనము మొదలైనవన్నీ చేస్తున్నాం. చివరకు 'ఓం తత్సద్బ్రహ్మార్పణమస్తు" అంటున్నాం. అయితే మనకు మిగిలిందేమిటండీ! అని పెద్దగా నవ్వుతూ అడిగారు. వెంటనే నా నోటినుండి ఆ బ్రహ్మమే మనకు దక్కుతుంది కదండీ అనే సమాధానం వచ్చింది.


దానిని అలా ఉంచుదాం. ప్రకృతానికి వస్తే పై మూడు ప్రశ్నలకూ "కర్మణ్యేవాధికారస్తే, మాఫలేషు కదాచన" – 'కర్మము చేయటం వరకే నీపనిలో ఫలం మీద నీకు అధికారం లేదు' అన్న గీతావాక్యం ఒక్కటే సమాధానం. కాబట్టి ఏ సమారాధన అయినా నిష్కామ భావన తోనే చేయాలి అనే తాత్పర్యంతో అగస్త్యుల వారు ఈ పదాన్ని నిబంధించారు. ఇలా అన్నంత మాత్రాన 'ఫలం ఉండదు' అని భావం కాదు. ఫలం గూర్చి నీవు ఎదురుచూడటం కానీ, ఫలం కోసమే నేను ఈ పని చేస్తున్నాను అనుకోవటం కానీ సరియైనది కాదు అని మాత్రమే ఇక్కడ సంభావితార్థం. ఆదిత్యుడు దైవ, మానుష, దానవ గుణాలతో ప్రవర్తించే అందరికీ, అన్ని కాలాలలో నమస్కరింపదగిన వాడు – అని తాత్పర్యం.

వివస్వంతుడు : ఇది సూర్యునికి ఒక పర్యాయపదం. భగవత్పర మైన నామాలన్నీ కేవలం వ్యవహారానికి సంబంధించినవి కావు. అవి గౌణాలు. అంటే గుణసంబంధం చేత ఏర్పడినవి. "వివస్తే ప్రభయా ఆచ్ఛాదయతీతి వివస్వాన్" అని గురుబాల ప్రబోధిక వివరించింది. తన కాంతితో అందరినీ, అన్నింటినీ కప్పి సంరక్షించే వాడు అని అర్థం. సూర్యకాంతిని ఒక ప్రత్యేక విధానంతో దేహానికి తాకేవిధంగా ఏర్పాటు చేసుకొంటే సర్వరోగాలూ తొలగిపోతాయి. 'ఆతపస్నానం' అని ఒక ప్రక్రియ ఉన్నది. ప్రకృతి చికిత్సలో అదొక భాగం. కనుక ఆదిత్యుడు అమ్మలాగా అన్ని జీవరాశులకూ కావలసిన కాంతిని నిర్వ్యాజ వాత్సల్యంతో అందిస్తున్న పరమదైవం అని వివస్వంతుడు అనేదానికి అర్థం. (సశేషం)

(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

❖ ❖ ❖ ❖ ❖

## సత్సంగం




### మనో నిగ్రహము

**మన ఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః – (అమృతబిందూపనిషత్)**

**శిష్యుడు :** నాకు మనోనిగ్రహం అలవడలేదు. అందుచేత వుత్తర భారతదేశానికి వెళ్ళి, ఏకాంతవాసం చేద్దామనుకుంటున్నాను. నాకు భగవాన్ అనుగ్రహం కావాలి.

**భగవాన్ :** నీవు ఇప్పుడు అంతదూరం నుండి వచ్చి, రమణ భగవాన్ సన్నిధిలో ఏకాంతవాసం చేస్తూనే ఉన్నావు. కానీ, నీకు సంపూర్ణమైన మనశ్శాంతి లభించినట్లు లేదు. ఇప్పుడు ఇంకొకచోటుకు వెళ్ళాలను కుంటున్నావు. ఈ విధంగా నీ యాత్రలకు అంతు ఉండదు.

నీ మనస్సే నిన్ను ఇలా తరుముతున్నదని నీకర్థం కావటం లేదు. ముందు దానిని నిగ్రహించుకో. అప్పుడు నీవు ఎక్కడ ఉన్నా ఆనందంగా ఉండగలుగుతావు. నీవు వివేకానందులవారి ఉపన్యాసం చదివేవో లేదో? అందులో ఒక కథ ఉన్నది; అందులో ఒకడు తన నీడను గొయ్యి త్రవ్వి పాతిపెట్టాలని చూస్తాడు. గోతిలో నీడను పెట్టి గోతిని పూడ్చడం ప్రారంభిస్తాడు. గోతిని పూడ్చడానికి వేసే ప్రతి పార మట్టితోను నీడ పైపైకి వస్తూ ఉన్నది. అందుచేత నీడను పాతి పెట్టడం సాధ్యం కాలేదు.



మనస్సును పాతిపెట్టాలని చూసే ప్రతివాడికీ, ఇదే పరిస్థితి ఎదురవుతుంది. అందుచేత ఆలోచనలు ఎక్కడ పుడుతున్నాయో, ఆ మూలానికి వెళ్ళి ఆలోచనలను, మనస్సును, కోరికలను అన్నింటినీ కలిపి సమూలంగా పెకలించాలి.

**శిష్యుడు :** ఆ కొండమీద ఒకటి, రెండు గంటలు గడపినప్పుడు, ఇక్కడికన్న ఎంతో ప్రశాంతంగా ఉన్నది. అందుచేత ఏకాంత ప్రదేశం, మనోనిగ్రహానికి ఎక్కువ అనుకూలంగా ఉంటుంది అనిపిస్తుంది.

**భగవాన్ :** నిజమే. కానీ, నీవు అక్కడే ఇంకొక గంటసేపుంటే, నీకు అక్కడ కూడా నీవు అనుకుంటున్న శాంతి లభించేది కాదు. మనస్సును నిగ్రహించుకో. అప్పుడు నీకు నరకం కూడా స్వర్గం అవుతుంది. ఏకాంతవాసం, అరణ్యవాసం మొదలైనవి వట్టి ప్రభావములు మాత్రమే.

# ప్రశ్న + ఉద్యమం + వివాదం = ఎస్వీ

**డా. సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి**, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం. ఫోన్ : 98497 14261



ఎమ్మే తెలుగు విద్యార్థిగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరిన తరువాతే నాకు ఎస్వీ సత్యనారాయణ గారి పేరుతో, ముఖంతో గట్టి పరిచయం ఏర్పడ్డది. అంతకుముందు ఆయన పేరు విన్నా కూడా నా మీద ముద్ర వేసినట్లు అంతగా గుర్తులేదు. ఎమ్మే తెలుగు మొదటి సంవత్సరంలో ఆధునిక మహాకవులు అందించిన వారసత్వం సదస్సు ఆచార్య ఎన్. గోపి గారి ఆధ్వర్యంలో జరిగింది. అందులో సుద్దాల హనుమంతు గురించి ఎస్వీ సర్ మాట్లాడారు. బాగా మాట్లాడారా లేదా చెప్పేంత సబ్జెక్టు అప్పుడు నాకేమీ లేదు కానీ ఆకర్షణీయంగా విషయం హత్తుకునేట్టు చెప్పారని మాత్రం అనిపించింది. అదే తొలిసారి ఎస్వీ గారి ప్రసంగం వినటం. అదే సదస్సులో జీవీయస్ గారు మరికొందరు పెద్దలు మాట్లాడారు. కొందరు వక్తలను ఎస్వీ గారు ప్రశ్నలు అడిగి చర్చలోకి లాగేవారు. ప్రశ్న అడుగుతున్నప్పుడు ఆయన వీలైనంత పెద్ద గొంతునే ఉపయోగిస్తారు. జవాబు ఇచ్చే వక్త ఎలా చెప్పినా సరే ఎస్వీ గారి గొంతు మాత్రం పెద్దగానే ఉండేది. ఎందుకు ఈయన ఇంత పెద్ద గొంతు పెట్టుకొని హడావిడి చేస్తారు అని ఒకటి రెండు సందర్భాలలో నేను అనుకున్న రోజులు ఉన్నాయి. కానీ అలా అడగడం వలన తప్పక జవాబు చెప్పవలసిన పరిస్థితి వస్తుందని కొంతకాలం తరువాత కానీ నాకు బోధ పడలేదు.

ఈ చర్చోపచర్చల్లో, వాద వివాదాల్లో అన్ని సందర్భాలలో ఎస్వీ గారి వాదనే నెగ్గిందా అంటే కాకపోవచ్చు కానీ ఆయన ప్రశ్నించటం మాత్రం ఆపలేదు. సాహిత్య సభ స్థాయి విద్యాత్మకంగా ఉండడానికి ఆయన ప్రశ్నను అప్పుడు ఇప్పుడు బహుశా ఎప్పుడూ అడుగుతూనే ఉంటారు. దానిని ఆలోచనలకు వాహికగా ఆయన నమ్ముతూనే ఉంటారు. ప్రశ్న ఆలోచనలకు మూలం. మనిషి కార్యశీలి కావడానికి, చింతనాశీలిగా మారడానికి ప్రశ్నే కీలకం. ఈ ప్రశ్న వల్లే వాదస్ఫూర్తి పెరుగుతుంది.

వాదానికి తాత్త్విక స్ఫూర్తి కార్యాచరణ తోడైతే అది ఉద్యమంగా మారుతుంది. ఎస్వీ గారి మాటలలోనే చెప్పాలంటే ఉద్యమాలు వ్యక్తి ప్రాతిపదికపై నిర్మితం కావు సిద్ధాంత ప్రాతిపదికపై నిర్మితమవుతాయి. ఆయన ఉద్యమ గీతాలపై పరిశోధన చేయటానికి ఈ ప్రశ్నించే స్వభావమే కారణమయ్యింది. ప్రశ్న ఉత్త ప్రశ్నగా మిగలకుండా సాహిత్య ఉద్యమాన్ని తాత్త్విక పునాదుల మీద ఆలోచించడానికి ప్రేరణగా నిలిచింది. సమకాలీన సాహిత్య వాతావరణం ఈ పరిశోధనాంశం ఆయన ఎన్నుకోడానికి కారణంగా కనిపిస్తుంది.

తొలినాళ్ళలో ఆర్యసమాజ కార్యకర్తగా తరువాతి కాలంలో కమ్యూనిస్టు భావజాలాన్ని అనుసరించే వ్యక్తిగా ఎస్వీ ఉన్నారు. ఉద్యమ స్వభావాన్ని అర్థం చేసుకునేందుకు భౌతిక మూలమైన మార్క్సిజాన్ని ఆయన విశ్వసించారు. దాని తాత్త్వికతను అర్థం చేసుకున్నారు దాన్ని సాహిత్యానికి అన్వయించి పరిశీలించడానికి పూనుకున్నారు. వీటన్నిటి వెనకా ప్రశ్న ఉన్నది. అదే సందర్భంలో ఆయనలోని ఉద్యమ స్ఫూర్తి ఉన్నది.

ఆధునిక తెలుగు సాహిత్య విమర్శకులలో సంఘసంస్కరణ నుంచి ప్రపంచీకరణ, ప్రాంతీయ వాదాల దాకా తమ ఆలోచనలను పంచుకున్న సాహితీవేత్తలు అరుదుగా కనిపిస్తారు. ఎస్వీ అభ్యుదయ సాహిత్య దృక్పథంతో ఈ మొత్తం ఆధునిక కాలాన్ని, ఉద్యమాలు, ధోరణులను అంచనా వేశారు. కథానిక, నవల, నాటకం వంటి ప్రక్రియలపై తన ఆలోచనలను, విశ్లేషణలను, వివేచనను సాహిత్య సమాజానికి పంచినా ప్రధానంగా ఎస్వీ కవితా విమర్శకుడు. వస్తువుకు ప్రాధాన్యం ఇచ్చినా, రచనలో రూపస్పృహ, శిల్ప వైవిధ్యం పట్ల అవగాహన ఉన్న సాహితీ విమర్శకుడిగా కనిపిస్తారు.

తెలుగులో ఉద్యమ గీతాలు సిద్ధాంత గ్రంథం, తెలంగాణ సాయుధ పోరాట సాహిత్యం, తెలంగాణ విమోచనోద్యమ సాహిత్యం, అభ్యుదయ సాహిత్యానంతర ధోరణులు, సత్యానుశీలన, ఆలోచన వంటి వ్యాస సంపుటులు, మఖ్దూం, తమ్మరెడ్డి సత్యనారాయణ, ధర్మభిక్షం, యార్లగడ్డ భాగ్యవతి వంటి జీవిత చరిత్రలు అన్నిటిలోనూ ఉద్యమ సాహిత్యంతో, సామాజిక ఉద్యమాలతో సంబంధం ఉన్న అంశాలు కనిపిస్తాయి. ఉద్యమంతో సంబంధం ఉన్నవి ఆయన సాహిత్య



రచనలు. సాహిత్య విమర్శకుడుగా తాను తర్వాతి కాలంలో చేసిన ఆలోచనలకు పునాదులు సిద్ధాంత గ్రంథంలో ఉన్నాయి. తన తర్వాతి కాలపు రచనలు స్థూలంగా తన సిద్ధాంత గ్రంథంతో సంబంధం ఉన్న అంశాలుగా కనిపించినా, అవి తరువాతి కాలంలో కొంత విస్తృతిని పొందాయి. వివరణకు నోచుకున్నాయి. సాహిత్య సమాజానికి మరింత స్పష్టతను ఇచ్చాయి.

స్త్రీవాద వివాదాలు, దళితబాధ వివాదాలు అన్న సాహిత్య వ్యాస సంకలనాలు సాహిత్య చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. విమర్శకు ఒక కూర్పుగా చెప్పవచ్చు. ప్రతి సాహిత్య ధోరణిని, ఉద్యమాన్ని తీసుకొని జరిగిన చర్చలను, వాద వివాదాలను పుస్తకంగా తీసుకు రావడం సాహిత్య విమర్శకు ఎంత ఉపయోగకరమో ఈ సంకలనాలు నిరూపించాయి. స్త్రీవాద కవిత్వంపై ఎస్వీ చేసిన వ్యాఖ్యలు అనేక చర్చలకు వాదోపవాదాలకు దారితీసాయి. అదే సందర్భంలో కొంత స్పష్టతను పాఠకులకు అందించాయి.

చిలకమర్తి భరతఖండంబు చక్కని పాడియావు గురించి, ఏది ఉద్యమము ఏది ధోరణి అనే అంశంపై చేసిన చర్చలు ఆయన వాద వివాదాలలో ఉన్నాయి. దినపత్రికలలో వివిధ సాహిత్య అంశాలపై ద్వానాశాస్త్రి, కాత్యాయనీ విద్మహే, ముక్తేవి భారతి వంటి వారితో చేసిన వివాదాలు ఒక విషయాన్ని తాను మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడ్డాయని ఎస్వీ భావిస్తారు.



2008లో ఒక తెలుగు పునశ్చరణ తరగతులలో ఎస్వీగారు ఉద్యమ సాహిత్య స్వరూప స్వభావాలను గురించి ఒక పాఠం చెప్పారు. ఆయన చేసిన సంవాదంలో వివాదం (అది కావాలనే చేశారని తర్వాత అర్థం అయింది) ఆ అంశం పట్ల తాను మరింత ముందుకు వెళ్లి ఆలోచించడానికి తోడ్పడాలని తాను అలా వాదాన్ని శ్రోతల ముందు పెట్టాననీ, దానివలన విన్నవారి అభిప్రాయాలు, ఆలోచనలు వివాదం రూపంలో తన ముందుకు రావటం వలన తాను తన ఆలోచనలతో మరింత సమన్వయించుకోవటానికి ఉపయోగ పడతాయని ఎస్వీ భావిస్తారు.

ప్రశ్నతో ప్రారంభమైన ఆలోచన ఉద్యమ దర్శనానికి తోడ్పడితే ఆ దర్శనం స్పష్టరీతిలో అవగాహనలోకి రావడానికి ఆయనకు వివాదం తోడ్పడింది. ఇవి మనిషి నిరంతరం చైతన్య శీలంగా ఉండటానికి తోడ్పడుతాయని చెప్పనవసరంలేదు. ఇది అందరికీ అనుభవంలోకి వచ్చే విషయమే.

ఎస్వీ సాహిత్య విమర్శ జీవితంలో ప్రశ్న ఉద్యమం వివాదం ఒకదానితో ఒకటి ముడిపడినట్టుగానే కవిత్వంలో జీవితం, సంఘర్షణ, ఉద్యమం అన్నది ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. ఉద్యమం (ఉద్యమగీతాలు) జీవజ్వాల, యుద్ధం జరుగుతూనే ఉంది. జీవితం ఒక ఉద్యమం, ఉద్యమం ఉద్యమమే వంటి కవితా సంపుటులలోని వస్తువు అభ్యుదయ భావాలు మొదలు ప్రపంచీకరణ ప్రాంతీయతల వరకు ప్రయాణించింది. జీవితం ఎస్వీ కవిత్వానికి భూమిక. సంఘర్షణ పోరాటం దాని ప్రతిఫలనం. ఉద్యమం దాని కార్యాచరణ. అందువల్ల కవిత్వంలో శిల్ప వైవిధ్యం కంటే అధిక్షేపం, సమాజాన్ని వాస్తవికంగా చిత్రిక పట్టే సెటైర్ ఆయన కవిత్వానికి ప్రాణ ధాతువులుగా కనిపిస్తాయి.

**కట్టు బొట్టు అలవాట్లు అభిరుచులు**
**ఆట మాట పాటల కేంద్రబిందువైన**
**శ్రమ సంస్కృతి సంతకాన్ని నేను**
**ప్రజా సంప్రదాయాల సంకేతాన్ని నేను**

అని తన వ్యక్తిత్వాన్ని ప్రకటించుకున్న కవి ఎస్వీ. ప్రజా సాహిత్యాలు, ప్రజా ఉద్యమాలు, ప్రజా ప్రశ్నలు తన వాదంగా వివాదంగా మలచుకున్న సాహిత్య జీవి ఎస్వీ.

(ఆచార్య ఎస్వీ సత్యనారాయణ గారి సప్తతి మహోత్సవం సందర్భంగా...)

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2024

# అష్టవిధ శృంగార నాయికలు : కావ్య సమన్వయం

**డా. గరికిపాటి గురజాడ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, అనంతపూర్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
ఫోన్ : 9010176407

**ఉపోద్ఘాతం**


భారతీయ కుటుంబ జీవనంలో స్త్రీకి ఎనలేని ప్రాధాన్యం ఉంది. వ్యక్తి వికాసానికి, సమాజ వికాసానికి, స్త్రీయే కేంద్ర బిందువని భారతీయ సంస్కృతి గుర్తించింది. కాబట్టే బాల్యంలో, కౌమారంలో, యౌవనంలో, ప్రౌఢ వయస్సులో, వార్ధక్యంలో స్త్రీ శారీరక, మానసిక పరిణతి ఎలా ఉంటుందో రక రకాల కావ్యాలలోని స్త్రీ పాత్రల ద్వారా మహాకవులు మహత్తరమైన విశ్లేషణని చేసి చూపించారు. మరీ ముఖ్యంగా కొత్త పెళ్లికూతురుగా, భార్యగా భర్తని రంజింప జేయడంలోనూ, తద్వారా కుటుంబంలో సామరస్యాన్ని కాపాడడం లోనూ, మొత్తం కుటుంబానికి, రసమయమైన జీవితాన్ని అందించడం లోనూ, రసజ్ఞతా శక్తిని పెంపొందించడంలోనూ స్త్రీ పాత్రను విశేషంగా చిత్రీకరించారు.


అందుకే కావ్య నిర్మాణ శాస్త్రాలలో స్త్రీని శృంగార నాయికగా వైవిధ్యభరితంగా నిరూపించే ప్రయత్నం చేశారు. ఆ ప్రయత్న ఫలమే **"అష్టవిధ శృంగార నాయికల"** ఆవిర్భావం.

కావ్య నిర్మాణ శాస్త్రాలలో సుప్రసిద్ధమైన 'కావ్యాలంకార సంగ్రహం' (నరసభూపాలీయం)లో అష్టవిధ శృంగార నాయికల లక్షణాలు విస్తృతంగానూ, విశేషంగానూ, వైవిధ్యభరితంగానూ వర్ణించడం జరిగింది. ఆ గ్రంథంలో ఏ విధంగా భట్టుమూర్తి పేర్కొన్నాడో, అదేవిధమైన నాయికలను ఆయనకు ముందు కాలం లోనూ, ఆయనకు తర్వాత కాలంలోనూ ఉన్న ప్రబంధ కవులందరూ తమ తమ కావ్యాలలో ప్రధాన పాత్రలుగా చిత్రించారని సోదాహరణంగా ఋజువు చేయవచ్చు. రామరాజభూషణుడికి ముందున్న కావ్యాలలోని నాయికలు, ఆయన కావ్యాలంకార సంగ్రహంలోని లక్షణాలకి ఆధారమైతే, ఆ లక్షణాలు, అనంతర కవుల కావ్యాలలో నాయికా పాత్ర చిత్రణకు ఆధారమయ్యాయి. 8 మంది నాయికలలో ప్రతి ఒక్కరిని శాస్త్ర, కావ్యపరమైన ఉదాహరణలతో మనం నిరూపించవచ్చు.

ఈ క్రింది పద్యంలో అష్టవిధ నాయికల గురించి రామరాజ భూషణుడు ఈ విధంగా పేర్కొన్నాడు.

**"వరుఁడు కైవసమైన వనిత స్వాధీనభ**
**ర్తృక ప్రియాగమవేళ గృహముఁ దనువు**
**సవరించునింతి వాసక సజ్జ; పతిరాక**
**తడవుడ నుత్కంఠఁ దాల్చు నింతి**






**విరహోత్కఁ సంకేత మరసి నాథుఁడు లేమి**
**వెస నార్తయౌకాంత విప్రలబ్ధ,**
**విభుఁ డన్యసతిఁ బొంది వేఁకువ రాఁ గుంది**
**నబల ఖండిత యల్కనధిపుఁ దెగడి**
**అనుశయముఁ జెందు సతి కలహాంతరిత, ని**
**జేశుఁడు విదేశగతుఁ డైనఁ గృశతఁ దాల్చు**
**నతివ ప్రోషితపతిక, కాంతాభిసరణ**
**శీల యభిసారికాఖ్య యై చెలువు మెఱయు (కావ్యా. 2: 40)**

భర్త తన అధీనుడై ఉన్న యువతి స్వాధీన భర్తృక (లేదా) స్వాధీన పతిక.

పర స్త్రీలను కాంక్షింపక తనయందే అనురక్తుడైన భర్త కలది, భర్త వచ్చే సమయానికి తనని, గృహాన్ని అలంకరించుకొని సిద్ధముగా ఉండేది వాసకసజ్జ (లేదా) వాసక సజ్జిక.

భర్త, చెప్పిన వేళకు రాకుండా ఆలస్యం చేయగా, మిక్కిలి తహతహపాటుకు లోనయ్యేది విరహోత్కంఠిత.

సంకేత స్థలానికి తన ప్రియుడు రాకపోవడం చూసి స్మరార్తి వహించేది విప్రలబ్ధ.

ప్రియుడు పరకాంతతో రేయి గడిపి సంభోగ చిహ్నాలతో ఉదయం ఇంటికి రాగా కుంగునది ఖండిత.

కోపగించి భర్తను దూషించి వెడలగొట్టి, అతడు వెళ్ళిన తర్వాత పశ్చాత్తాప పడేది కలహాంతరిత.

తన ప్రియుడు పరదేశ గతుడైనప్పుడు కృశించేది ప్రోషిత భర్తృక.

ప్రియుని వద్దకు తానే స్వయంగా పోయేది, ప్రియుని తన వద్దకు తెప్పించుకునేది అభిసారిక.

**కావ్య సమన్వయం**

**1. స్వాధీనపతిక**

భర్తను తన కధీనుడిగా చేసుకొన్న నాయికని స్వాధీనపతిక అంటారు. కృతిభర్తయైన నరసభూపాలుడితో స్వాధీనపతికయైన నాయిక ఎలా వ్యవహరిస్తోందో రామరాజభూషణుడు ఈ క్రింది పద్యం ద్వారా పేర్కొన్నాడు.

**శ్రీనిధి యౌబళభూవరు నృసింహుఁడు గైవసమై చెలంగఁగా**
**భూనుత వైభవ స్ఫురణఁ బొల్చు యశోజలజాక్షి నిత్య స**
**మ్మానిత శీలయై ధవుని మన్నన నౌదల యెక్కిసట్టి, వై**
**మానిక వాహిని నగు నమంద నిజాతిశయంబు పేర్మినిన్**
**(కావ్యా. 2: 42)**

నరసభూపాలుని వరించిన కీర్తికన్య భర్తని సంపూర్ణంగా తనకధీనుడిగా చేసుకుంది. భర్త అందించిన గౌరవాన్ని అందుకుంది కాబట్టే మహావైభవంతో ప్రకాశిస్తోంది. ఆయన కీర్తి ఆకాశం వరకు వ్యాపించడం వల్ల ఆకాశగంగ (మందాకిని) ఆయన శిరస్సు మీద ఎక్కినట్లుగా అనిపిస్తోంది.

కానీ, తాను వరించిన నరసభూపాలుని నెత్తిమీద మరో స్త్రీ (గంగానది) ఎక్కి కూర్చోవడం స్వాధీనపతికయైన భార్యకు అవమానం కాబట్టి, ఈ కీర్తికాంత మా భార్యాభర్తల అనురాగం ముందు నువ్వెంత అన్నట్టుగా ఆకాశగంగను చూసి నవ్వుతోంది. అంటే ఆయన కీర్తి ఆకాశగంగ కంటే స్వచ్ఛంగా, తెల్లగా ఉందన్నమాట. ఇదీ కావ్యాలంకార సంగ్రహంలో వర్ణన.

ఇంతటి స్వాధీనపతికగా మనకు భాగవతంలో రుక్మిణీదేవి కనిపిస్తుంది. రుక్మిణీ శ్రీకృష్ణుల మధ్యలో కూడా అప్పుడప్పుడూ చిటపటలు లేకపోలేదు. అయినా భార్య ముందు సత్యం మాట్లాడడం కంటే సరసంగా మాట్లాడడం ముఖ్యమని తెలిసిన శ్రీకృష్ణుడు ఆమెను ఎప్పటికప్పుడు అనునయిస్తూ దారికి తెచ్చుకున్నాడు. రుక్మిణి కూడా తన గుణాలతో, రూపంతో ఆకర్షించింది. అందుకే వారి ఉద్యానవన విహారాలు కోరికలు చిగురించేలా క్రొత్త క్రొత్తగా ఉన్నాయని బమ్మెర పోతన భాగవతం దశమస్కంధంలో వర్ణించారు.

**ఎలమి ఘటింపఁగా గలసి యాడెల నీడెల మల్లికాలతా**
**వలిఁ గరవీర జాతి విరవాదుల వీథులఁ గమ్మ దెమ్మెరల్**
**పొలయు నవీనవాసములఁ బొన్నలఁ దిన్నెలఁ బచ్చరచ్చలన్**
**గొలఁకుల లేఁ గెలంకులను గోరిక లీరిక లొత్తఁ గ్రొత్తలై**
(పో.భా.దశ.ఉ: 273)


రుక్మిణీ శ్రీకృష్ణులిరువురూ మల్లెపొదల మధ్య నడుస్తూ విరజాజుల సుగంధాన్ని ఆస్వాదిస్తూ, చల్లని పిల్ల వాయువులలో సేద తీరుతూ, కొత్తకొత్త ఇళ్లల్లో, కొత్తకొత్త ఊహలతో, కొత్తకొత్త శృంగార అనుభవాలతో హాయిగా విహరించారట. భర్తని మనసా, వాచా, కర్మణా తన మనిషిగా చేసుకున్న భార్యకి తప్ప ఇంతటి మనోహరస్థితి పట్టదు. కావున, స్వాధీనపతికగా రుక్మిణీదేవిని ఉదహరించవచ్చు.

**2. వాసక సజ్జిక**

**యవన చమూసమూహముల నాజి జయించి యుదగ్రదిగ్జ యో**
**త్సవ విభవాభిరాముఁడయి సారెకు నోబయ నారసింహ భూ**
**ధవు దరుదెంచు లగ్నమునఁ దత్పురలక్ష్మి విభూషితోల్లస**
**ద్భవన విశేషయై మృగమద ద్రవవాసనఁ దాల్చు నిచ్చలున్**
**(కావ్యా. 2: 43)**

నరసభూపాలుడు యవనసేనను జయించి విజయగర్వంతో ఇంటికి వచ్చాడట. నగర లక్ష్మి తనను తాను అలంకరించుకొని, కస్తూరి వాసనలు వెదజల్లుతూ ఆయనకు స్వాగతం చెప్పింది.

శిలాక్షరం
(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-



సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

అనుకూలుడైన భర్త కోసం మనస్సు ఎలాగూ సిద్ధమై ఉంటుంది కాబట్టి, శరీరాన్నీ, శయన మందిరాన్నీ సిద్ధం చేసుకొని ఉండడం వాసకసజ్జిక లక్షణం.

ఈ లక్షణాన్ని రామరాజభూషణుని కంటే ముందువారు, తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి జంట కవులు అనదగిన నంది మల్లయ్య - ఘంట సింగయ్య తాము రచించిన "వరాహపురాణం"లో మనోహరమైన ఊహలతో జోడించి వర్ణించారు.

**కదునధిక ప్రతాపనిధి కాలవశంబున నస్తమింప న**
**ల్లదందలలెత్తు హీనుల ప్రకారమునన్ రవి గ్రుంక తారకల్**
**వొడయె, నిశావిలాసిని విభున్ గవయన్ గయిసేయుబోనెఱుల్**
**గడగి విదల్ప వారి కణికల్ గగన స్థలి నిండెనోయనన్**
**(వరాహపురాణం)**



మహా పౌరుషవంతుడూ, పరాక్రమవంతుడూ అయిన పరిపాలకుడు, ప్రజల దురదృష్టం కొద్దీ అర్థాంతరంగా మరణించాడట. దాంతో ఇంక మనల్ని అడ్డుకునే వారెవరూ లేరని రాజ్యంలో అక్కడక్కడా తలెత్తిన హీనులలాగా, సూర్యుడస్తమించగానే అక్కడక్కడా చుక్కలు పొడచూపాయట.

ఇంతవరకు వీరరసం. ఉన్నట్టుండి ఒక్కసారిగా కవి శృంగార రసంలోకి దూకాడు. కారణమేమిటంటే, సంధ్యాసమయంలో, ఆకాశంలో ముందు అక్కడక్కడా చుక్కలు కనిపించినా, కాసేపటికి ఆకాశమంతా చుక్కలమయమై పోతుంది. అదే విషయాన్ని కవి, పద్యం ఉత్తరార్థంలో శృంగార రసభరితంగా వర్ణిస్తున్నాడు. రాత్రి అనే స్త్రీ తన నాథుడైన చంద్రుడితో ఆనందంగా ఆ రాత్రి గడపాలనుకుందట. అందుకని తాను ముందుగా అభ్యంగన స్నానం చేసి, ఆకాశమనే డాబా మీదికెక్కి రెండు చేతులతో కురులు విదలించిందట. అప్పుడు వేలవేలుగా వెదజల్లబడిన నీటి చుక్కలే ఆకాశంలో నక్షత్రాలై మెరుస్తున్నాయట. చంద్రుని కోసం అలంకరించుకొని సిద్ధంగా ఉన్న రాత్రి అనే కన్యను వర్ణించిన ఈ పద్యం వాసకసజ్జికకు ఇంచుమించు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

### 3. విరహోత్కంఠిత

**నెచ్చెలు లీ నృసింహధరణీవరుఁ దెచ్చదమంచుఁ బోయి రా**
**రిచ్చటి, కీవునుం గరుణయించుక లే కలరంప గుంపులం**
**గ్రుచ్చెద వేల? మత్ప్రియునిఁ గూర్పుము మన్మథ! నీకు యద్విభుం**
**దెచ్చుటకై యొసంగెద మదీయకటాక్షములన్ జయాస్త్రముల్**
**(కావ్యా. 2 : 44)**

దూరంగా ఉన్న నరసభూపాలుణ్ణి తీసుకువస్తామని చెలికత్తెలు వెళ్లారట. ఆ ఆలస్యం భరించలేక నాయిక బాధపడుతోంది. ఈలోగా ఆమెని మన్మథుడు తన పుష్పబాణాలతో మరింతగా బాధిస్తున్నాడు.


అందుకని నాయిక తన చూపులనే బాణాలు మన్మథునికిస్తానని, వాటితో నాయకుని జయించి తీసుకొని రమ్మని ప్రాధేయపడుతోంది.

రామరాజభూషణుడే రచించిన "వసుచరిత్ర"లో వసురాజు విరహంతో బాధపడిన గిరిక వృత్తాంతం ఇక్కడ ఉదహరింపదగినదే.

**అఱిమి రమాకుమారుఁడవు దగ్గతలంబున వచ్చి నిల్చిన**
**ట్లతిమతిఁ దోఁచినఁ, గువలయాక్షి వడంకి, కడంకఁ దూలి,మై**
**మఱచి సుగంధగంధగిరి మారుత పాతిత వల్లి కాభయై**
**యొఱఁగిన సంభ్రమించి చెలు లుద్గత బాష్పతరంగితాక్షులై**
**(వసు. 3: 179)**

విరహవేదన నెపంతో తనను బాధపెడుతున్న మన్మథుడు, గిరికాదేవి ఎదురుగా వచ్చి నిలబడినట్లు అనిపించిందట. ఆ భావన మనస్సులోకి రాగానే ఆమె వణికిపోయిందట. అంతే, మలయపర్వతం మీద గాలికి తూలిపోయిన తీగలా ఒరిగిపోయిందట. దాంతో చెలికత్తెలు కూడా చూడలేక కన్నీరు పెట్టారట.


ఈ పద్యంలో శబ్ద బ్రహ్మ అయిన భట్టుమూర్తి మన్మథుడు అని చెప్పడానికి రమా కుమారుడనే పదం వాడాడు. రమాకుమారుడు అంటే మన్మథుడు, మా కుమారుడన్నా మన్మథుడే, కుమారుడు అన్నా మన్మథుడే, మారుడు అన్నా మన్మథుడే, చివరి అక్షరమైన 'ర'కారానికి కూడా అర్థం మన్మథుడే కావడం విశేషం.

అంటే గిరికాదేవి మన్మథుని బారినుంచి తప్పించుకోడానికి ఒక్కో అడుగూ వెనక్కి వేస్తున్నప్పటికీ మన్మథుడు ఆమెని బాధిస్తూనే ఉన్నాడని భావం. అక్షరాలు తగ్గించినా శిక్ష తగ్గించలేదని ఇందులో చమత్కారం. అందువల్ల విరహంలో ఉన్న నాయికకు ఈ పద్యం ఉదాహరణగా పేర్కొనవచ్చు.

### 4. విప్రలబ్ధ

**ఎనయఁగ నీ నివాసమున కే నరుదెంచెద నంచు నాపయిం**
**గనుఁగొన నిక్కపుంబ్రియము గల్గినవాఁడను బోలెఁ బల్కి యీ**





**మనికికి రాక తక్కినను మానెడుగాక, మదీయదృష్టికిం**
**బనుపడి మ్రోల నున్నగతి మాయలుసేయఁగ నేల భర్తకున్**
**(కావ్యా. 2: 45)**

నరసభూపాలుడు తన ప్రియురాలితో నీ నివాసానికి నేనే వస్తానని చెప్పాడట. కానీ రాలేదు. నాయిక వెదికి వెదికి, వేసారి, 'నాయకుడు రాకపోతే రాకపోయాడు కానీ, కంటికి కనిపిస్తున్నట్లుగా దోబూచులాడడం దేనికి'? అని వాపోతోందిట. ఇదీ కావ్యాలంకార సంగ్రహంలో చెప్పిన లక్షణం.

"వాణి నా రాణి" అని ధైర్యంగా పేర్కొన్న పిల్లలమర్రి పినవీరభద్రుడు రాత్రికి రాత్రే రచించిన "శృంగార శాకుంతలము"లో శకుంతల విరహ తాపాన్ని పాఠకుల హృదయం కరిగిపోయే విధంగా వర్ణిస్తాడు.

**ఆ చంద్రాన్వయ రాజ చంద్రముని పొందాసించి, చన్నుం గవం**
**జూచుం, గన్నుల నీరు నించుఁ దల యూచున్, మేను శయ్యాస్థలిన్,**
**వైచున్, లేచును, నవ్వు, నుస్సురను, బోవం గంటగించున్, ధృతిన్**
**గాచున్, బ్రొద్దు గనుంగొనున్, వెతఁబడున్ గామాంధ కారార్తయై**
**(శృం. 2: 194)**

ఆ శకుంతల దుష్యంతుని పొందుగోరి, తపించిపోతోందట. ఉప్పొంగుతున్న వక్షస్థలాన్ని మాటిమాటికీ చూసుకుంటోందట. కళ్లల్లో నీళ్లు నిండుతుంటే తల పంకిస్తూ, తట్టుకోలేక మేను శయ్య మీదకి చేరుస్తూ, పడుకోలేక, మళ్లీ లేస్తూ, నవ్వుతూ, నిట్టూరుస్తూ దూరంగా నడుస్తూ, ధైర్యంతో గుండెని చిక్కబట్టుకుంటూ, బయటకు వచ్చి పొద్దుకేసి చూస్తూ నానా అవస్థలు పడుతోందట. ఇవన్నీ విప్రలబ్ధ లక్షణాలే కదా.

### 5. ఖండిత

నాయకుడు ఇతర స్త్రీతో గడిపి వచ్చాడని తెలిసి, బాధ వలన వచ్చిన కోపంతో అతనిని వ్యంగ్యంగా దెప్పి పొడుస్తూ మాట్లాడడం ఖండిత లక్షణం. ఈ లక్షణం గురించి భట్టుమూర్తి ఈ క్రింది విధంగా వర్ణించాడు.

**నృపులకు నెల్లవారల భరించుట యోగ్యమున నేటి రే**
**యపరిమితోత్సవంబునఁ బ్రియాసదనంబుల కేఁగి యేఁగి యా**
**నెపమున మద్యహంబునకు నీ వరుదేరఁ బ్రభాతమయ్యెఁగా,**
**కిపుడు నృసింహ! నీ పయి నొకించుక వంచన లే దెఱుంగుదున్**
**(కావ్యా. 2: 46)**

పూర్వకాలంలో రాజులు చాలామందిని పెళ్లి చేసుకునేవారు. అందరినీ సమానంగా చూసే నాయకులను దక్షిణ నాయకులు అనేవారు. నరసభూపాలుడు కూడా అటువంటివాడే. అందుకే మరో ప్రియురాలితో గడిపి ఆలస్యంగా వచ్చిన అతనితో **"అంత మంది ఇళ్లు తిరిగి వచ్చాక ఆలస్యం కాదా మరి!! మీ తప్పేముందిలే!?"** అని నాయిక దెప్పి పొడుస్తూ మాట్లాడుతోంది.

ఇటువంటి ఖండిత నాయిక లక్షణాలు "పారిజాతాపహరణం" కావ్యంలో సత్యభామ పాత్రలో శృంగార క్రోధ రసభరితంగా చిత్రించబడ్డాయి. నంది తిమ్మనగారు ఈ ఘట్టంలో చక్కని పద్యం రాశారు. ఈ పద్యంలోని గుణాలు (నాయిక గుణాలు) ఖండితకి సరిగ్గా సరిపోతాయి.

**ఇంకిటు నిన్ను నమ్మ,నను నేమిటికిం గెరలించె దెంతయుం**
**బొంకముగాని యీ వలనిబొంకులు మాచవి గావు రుక్మిణీ**
**పంకజపత్ర నేత్రకును బ్రాణపదంబులు గాని, వల్లవీ**
**కింకర! చాలుఁ జాలు నుడికింపకు, నింపకు లేని కూరుముల్**
**(పారి. 2: 42)**

నారదుడిచ్చిన పారిజాత పుష్పాన్ని రుక్మిణీదేవికి ఇవ్వడమే కాకుండా అక్కడ చాలాసేపు గడిపి ఆ పుష్పం ధరించిన రుక్మిణి అందంగా ఉందని శ్రీకృష్ణుడు ఆమెని కీర్తించినట్లుగా చెలికత్తెల వలన విని సత్యభామ దెబ్బతిన్న ఆడ త్రాచుపాములా బుస కొట్టింది. జడిలా పడిన నీటిధారతో ప్రజ్వలించిన అగ్నికీలలా పూరించింది. అదే నిజమైన ఖండిత లక్షణం.

అందుకే శ్రీకృష్ణుని తాను నమ్మలేనని, అనవసరంగా రెచ్చగొట్ట వద్దని, ఆయన చెప్పే అతుకూ బొతుకూ లేని మాటలు రుక్మిణీదేవి వంటివారికి నచ్చవచ్చును గాని, తనకి నచ్చవని ఖండితంగా చెప్పింది. అంతే కాదు, గొల్లభామలతో కులుకుతూ, వారికి సేవలు చేసేవాడని శ్రీకృష్ణుని ఆక్షేపించింది. 'ఖండిత'కి ఇది చక్కని ఉదాహరణ.

### 6. కలహాంతరిత

**అనఁగ రాని కోపమున నప్పుడు కాంతుని ధిక్కరించుచో**
**మానదురాగ్రహము మానుపలేకపుడెందుఁ బోయెనో**
**యా ననవింటిదంట యిపు దేఁపఁదొడంగెబీ భవిష్యదర్థముల్**
**గానని నా మనంబునకుఁ గావలె నిట్టి విషాదవేదనల్**
**(కావ్యా. 2: 47)**

పట్టరాని కోపంతో ప్రియుని ధిక్కరిస్తున్నప్పుడు, మన్మథుడు గుర్తుకు రాలేదని క్రోధ రసం ముగిశాక, ఇప్పుడు శృంగార రసం రాజ్యమేలుతోందని, అయినా చేయగలిగిందేముందని, ప్రియుని ధిక్కరించినందుకు, తనకిటువంటి శిక్ష పడవలసిందేనని, నాయిక బాధపడుతోంది. ఈ రకమైన నాయికా లక్షణాన్ని "రాధికా సాంత్వనము" అనే కావ్యంలో "ముద్దు పళని" అనే కవయిత్రి సరళ మనోహరంగా వర్ణించింది.

**ఎంత విలాస? మెంత సొగ? సెంత వదాన్యత? యెంత రాజసం?**
**బెంత యొయార? మెంత కళ? యెంత గభీరత? యెంత యారజం?**
**బెంత వినోద? మెంత దయ? యెంత మనోజ్ఞత? యెంత ఠీవి?నా**
**యంతటి మందభాగ్యకిఁక నంతటి చక్కని దేవుఁ డబ్బునే!**

**(రాధికా. 2: 112)**

శ్రీకృష్ణుని విలాసం, సొగసు, ఔదార్యం, రాజసం, వయ్యారం, శృంగార కళలు, గాంభీర్యం, ఇంపు, వినోదం, నయగారం, మనోజ్ఞత, ఠీవి ఇకమీద తనకు దక్కవేమో అని తానెంతో మందభాగ్యురాలనని రాధిక బాధపడుతోంది. ఈ రకంగా రాధికని 'కలహాంతరిత' లక్షణాలతో సమన్వయించవచ్చు.

**7. ప్రోషిత భర్తృక**

**చిరయశ! ఓ బభూవరు నృసింహ! భవద్రిపుభామ కాననాం**
**తరమున కేఁగి యందు నిజనాథునిఁ గానక మన్మథార్తయై**
**వరుని సరోజపత్త్రమున వ్రాయు నెడం గరముల్ చెమర్చఁగా**
**నరయ నిజాంగకంబెపగయయ్యె నటంచుఁ దలంచు దైవమున్**

**(కావ్యా. 2: 48)**


నరసభూపాలుని శత్రువు భార్య, భర్తతో కలిసి అడవికి వెళ్లిందట. ఆ భర్త అటునుంచి అటే మాయమైనాడట. ఆ భార్య విరహవేదనకు తట్టుకోలేక తామరపువ్వు రేకుమీద అతని బొమ్మ గీస్తుంటే, చేతుల చెమట కారణంగా మాటిమాటికీ చెరిగిపోతోందట. తన అవయవాలే తనకి శత్రువులయ్యాయని నాయిక బాధపడుతోందట.


ఇదే నాయికా లక్షణాన్ని, పంచ కావ్యాలలో ఒకటైనటువంటి, "ఆముక్త మాల్యద" కావ్యంలో గోదాదేవి విరహవేదన రూపంలో "శ్రీకృష్ణదేవరాయలు" అనితర సాధ్యంగా వర్ణించారు.

**ఎఱుగరుగా యొకద్భుతము, నీ చెలి దీర్ఘిక దీర్ఘమాడ నా**
**యఱుత దగిల్చి పోవు దనహారము, వోయిన నేను బోవుదున్,**
**మఱుపక వెంట బోప జలమగ్నత నౌనది సున్నమైన దా**
**గఱకతి బెట్టి సొమ్మడుగు గాని నిజార్తి యెఱుంగ దేమియున్**

**(ఆముక్త.5: 61)**

గోదాదేవి విరహవేదనకు తట్టుకోలేక, తన చెలికత్తెలతో సహా ఒక దిగుడుబావిలో స్నానానికి దిగింది. దిగుతూ తన మెడలోని ముత్యాల హారాన్ని చెలికత్తె మెడలో వేసింది. గోదాదేవిని ఎప్పుడూ




అంటిపెట్టుకుని ఉండడం ఆ చెలికత్తె బాధ్యత కాబట్టి, కాసేపటి తర్వాత, ఆ చెలికత్తె కూడా నీటిలో దిగింది. అప్పటికే గోదావిరహంతో వేడెక్కిన నీటిలో చెలికత్తె మెడలోని ముత్యాలహారం సదలి, భస్మమై, కరిగి నీరైపోయిందట. ఇదంతా తెలుసుకోకుండా గోదాదేవి తన హారం తనకిమ్మని చెలికత్తెను ఒత్తిడి చేస్తోందట. గాఢమైన విరహవేదన అపార్థాలకు దారితీసి అయినవారిని కూడా కానివారిని చేస్తుందట.

**8. అభిసారిక**

**నాతి! మదిం బ్రియాభిసరణం బొనరింప దలంచెదీవు, చం**
**ద్రాతపసాంద్రదీధితు లజాండకటాహము నిండ బర్వగా**
**నీ తలపెట్లు గూడు రమణీ! వలతే నొకవన్నె కాగము**
**క్రాతతులుం బ్రసూనములు దాల్చు,మలందుముగంధ సారమున్!!**

**(కావ్యా. 2: 49)**

నరసభూపాలుడిపై మరలుగొన్న నాయిక, తట్టుకోలేక, వెన్నెల రాత్రులలో తన ప్రియుని దగ్గరకు బయలుదేరిందట. అప్పుడామె చెలికత్తెలు, ఆమెనెవరైనా గుర్తుపడతారనే భయంతో, మల్లెపూలు తలలో పెట్టుకుని ముత్యాలహారాలు ధరించి, మంచి గంధం పూసుకుని వెళ్లమని సలహా ఇచ్చారు. మల్లెపూలు, ముత్యాలు, మంచి గంధం, తెల్లగా ఉండడం వల్ల వెన్నెలలో ఆమె ఆకారం కలిసి పోతుందని, అందువల్ల ఎవరూ గుర్తుపట్టలేరని ఇందులో చమత్కారం. ఇటువంటి అభిసారికా లక్షణాన్ని "శశాంక విజయం" అనే కావ్యంలో శేషము వేంకటపతిగారు అద్భుతంగా వర్ణించారు.

**విప్పు కప్పగు గొప్ప కొప్పున విరినల్ల**
**కలుపల దండలు చెలువుమీఱ,**
**సిబ్బెంపు గబ్బి బల్గుబ్బ చన్గవను మీ**
**సరము లౌ నీలంపు సరములమర,**
**కళుకు హొందళుకులఁ గులుకుమై మృగనాభి**
**పంకంబు నెఱపూత పొంక మలర,**
**మేలు డాల్మీల నేర్లాలు కన్నుల పోగ**
**కాటుక రేఖలు నీటు మెఱయఁ**

**బొసఁగ రే వన్నె సాలుపు ముసుఁగు పెట్టి**
**చాల సొమ్ములు పూలు బాగాలుఁ గొనుచు**
**గురుని బాగాలు, తమ తోఁట గోడదాఁటి**
**శశిఁ గదియ వచ్చె, సతులెంత జంతులౌర! (శశాం. 4: 119)**

ఈ కావ్యంలో తార చంద్రుడి కోసం రాత్రివేళలో బయలుదేరింది. అందువల్ల ఈమెను శాస్త్రలక్షణం ప్రకారం "తమోపిసారిక" అంటారు. కొప్పులో నల్ల కలువలు ధరించిందట. సుగంధంగా కస్తూరినే ఒంటికి పులుముకుందట. ఇంద్రనీలమణులతో కూర్చిన హారం ధరించిందట. చీకటి రేఖల వంటి కాటుక రేఖలతో కళ్లను తీర్చిదిద్దిందట. నల్లని ముసుగు కప్పుకొని, పోకచక్కలు చేతపట్టుకొని, గోడ దాటిందట. కొప్పులో నల్ల కలువలు, ఇంద్రనీలమణుల హారం, కస్తూరి, కాటుక, నల్లని ముసుగు, అన్నీ నల్లవే కాబట్టి ఆమె ఆకారం రాత్రిలో కలిసిపోతుందని వాటిని ధరించింది. ఈ అలంకరణలో రాత్రిపూట ఎవ్వరూ గుర్తుపట్టలేరు కదా! ఇదంతా జారిణీ వ్యవహారమే అయినా, సాధారణంగా ఈ ప్రవృత్తి గలవారికే "అభిసారిక" వేషం వేసే అవసరం వస్తుంది.

**ముగింపు**

ఈ విధంగా అష్టవిధ శృంగార నాయికల లక్షణాలు పూర్వకవుల రచనలాధారంగా రామరాజభూషణుడు నిర్ధారిస్తే, అనంతర కవులు ఆయన చెప్పిన లక్షణాలాధారంగా తమ కావ్యాలలో నిరూపించారు. అష్టవిధ శృంగార నాయికలకు మరెన్నో కావ్యాలలో చక్కటి ఉదాహరణలు చూపించవచ్చు.

**ఆధార గ్రంథాలు**

1. తిమ్మన, నంది. 2012. పారిజాతాపహరణము. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.
2. పినవీరభద్రకవి, పిల్లలమర్రి. 2013. శృంగార శాకుంతలము. విజయవాడ: ఎమెస్కో బుక్స్.
3. పోతన, బమ్మెర. 2015. పోతన భాగవతము. తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
4. ముద్దు పళని. 2015. రాధికాసాంత్వనము. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.
5. రామరాజ భూషణుడు. 2013. కావ్యాలంకార సంగ్రహం. విజయవాడ: ఎమెస్కో బుక్స్.
6. రామరాజ భూషణుడు. 2013. వసుచరిత్ర. విజయవాడ: ఎమెస్కో బుక్స్.
7. వేంకటపతి, శేషము. 2009. శశాంక విజయము. విజయవాడ: ఎమెస్కో బుక్స్.
8. శ్రీకృష్ణదేవరాయలు. 2012. ఆముక్తమాల్యద. హైదరాబాద్: వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.

❖ ❖ ❖ ❖ ❖

# Falsification

**డా. తిరునగరి శరత్‌చంద్ర,** ఫోన్ : 6309873682

కలం చుట్టూ ముసురుకున్న వాక్యాలు
కదిలినట్టే కదిలి మాయమైతే
మనసును తడుముతున్న ఆలోచనలు
మెరిసినట్టే మెరిసి వెలిసిపోతే
ఆ వాక్యాలు, ఈ ఆలోచనలు
రెండూ.. Falsification...

రోజులుగా, గంటలుగా
కనిపిస్తున్న కాలం
నీ కటారి చూపుల గాలానికి
గుచ్చుకుని ఆగిపోతే,
సందిగ్ధానికి, సంతోషానికి మధ్య
సతమతమవుతున్న హృదయం
పగిలి
పది అద్దాల ముక్కలుగా విడిపోతే
ఆ కాలమూ, ఈ హృదయమూ
రెండూ.. Falsification..

రెప్పల్లో వెచ్చగా విరిసిన కలలు
చప్పున చప్పగా చల్లారిపోయి
రాలిపోతే,
బాధకు దగ్గరై , నిద్రకు దూరమై
కనులు
నిప్పుల కొలిమిలా మండిపోతే
ఆ కలలూ, ఈ కనులూ
రెండూ Falsification..

కనబడాల్సిన దృశ్యంగా
నువ్వు కనబడనప్పుడు
వినబడాల్సిన శబ్దంగా
నేను వినబడనప్పుడు..
నువ్వూ..నేనూ
ఇద్దరమూ.. Falsification..

# తెలంగాణలోని 33 జిల్లాల పేర్లు – మూలాలు

డా. కోర్గ సత్యనారాయణ, హన్మకొండ, ఫోన్ : 9177664447

**1. నాగర్‌కర్నూల్ :** ఈ జిల్లా పేరు రెండు గ్రామాల సమాహారం. నాగన్, కందన్ అనే సోదరులు మొదట ఇక్కడ కోటలుకట్టి తమ పేరు మీద నాగనూలు, కందనూలు అనే గ్రామాలను స్థాపించారు. నాగన పెద్దవాడు వ్యవహారమంతా అతని చేతిమీదనే నడిచేది. కాబట్టి కందనవోలును నాగనవోలు, కందనవోలు అని పిలిచేవారు. అది క్రమంగా జిల్లా స్థాయికి ఎదిగి నాగనవోలు కాస్త నాగర్ కర్నూల్‌గా మారింది. ఇక్కడ 'వోలు' అనగా గ్రామము అని అర్థం. ఆ కాలంలో దీనికే 'చిన్న కందనూలు' అని మరొక పేరు ఉండేది.

**2. మహబూబ్‌నగర్:** ఈ జిల్లాను పూర్వం పాలమూరు అని పిలిచేవారు. ఇక్కడ పాలు ఎక్కువగా దొరుకుతాయి. కాబట్టి పాలమూరు అని పేరు. శ్రీ పల్లెర్ల జానకి రామ శర్మ గారు పూర్వమిక్కడ 'పాలగోడి' చెట్లు ఎక్కువగా ఉండేనని, వాటిని గొట్టించి ఊరు కట్టించారని ఈ ఊరికి పాలమూరు అని పేరు వచ్చిందని తెలిపారు. కాచిరాజు శేషగిరిరావు దీన్ని 'ప్రాల+మూరు' అని మరియొక విధముగా విడదీసి ప్రాలు అనగా బియ్యము, మూరు అనగా ఎక్కువ అని, బియ్యపు వ్యాపారం ఎక్కువగా జరిగే చోటుగా అదే పాలమూరుగా మారిందని చెప్పారు. నారాయణపేట నివాసి శ్రీ గణాంజనేయ శర్మగారు పాలమూరు కాదు 'పాలమట్టి అని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌నే 'రుక్మముపేట'గా కూడా పిలుస్తారు. తిమ్మాజిపేట సంస్థానానికి చెందిన శ్యామరావు గారికి రుక్మమ్మ, కావేరమ్మ అని ఇద్దరు భార్యలుండేవారు. వారికి సంతానం లేదు. వారు సప్తసంతాన ప్రియులై తమ పేర గ్రామాలను స్థాపించారు. రుక్మమ్మ పేర రుక్మమ్మ పేట ఏర్పడి అది పాలమూరులో కలిసి పోయింది. ఈ జిల్లాకే 'చోళవాడి' అనే పేరు కూడా ఉంది. పూర్వం ఈ ప్రాంతాన్ని చోళులు పాలించారు. కాబట్టి చోళవాడ అని పేరు. ఆరవ నిజాం మహబూబ్ అలిఖాన్ (క్రీ॥శ॥ 1869-1911) పాలనాకాలంలో క్రీ॥శ॥ 1904లో ఈ ప్రాంతానికి రైల్వేలైను కొరకు సర్వే జరిగింది. అపుడు అవుట్‌ఏజెన్సీ విధానముండేది కనుక ఆనాడు రైల్వేస్టేషన్ స్థలమునకు నిజాం పేరు మీదగా మహబూబ్‌నగర్ అని పేరు పెట్టిరి. ఆనాటి నుండి ఈ పేరు ప్రాచుర్యంలోనికి వచ్చినది.

**3. వనపర్తి :** ఈ ప్రాంతం పండితారాధ్యుడు, పాల్కూరికి సోమనల కాలం నాటికి అరణ్యప్రాంతమే. ఆనాడు దైవ పూజకోసం ఈ వనానికి పత్రికో, పూలకో, ప్రజలు వస్తుండేవారని, అపుడు దాన్ని వనం, పత్రవనం, పత్రి అనే వారని, ఆ వనం పత్రియె క్రమంగా నేటి 'వనపర్తి' అయిందని ఆ ప్రాంత ప్రజల నానుడి.




**4. జోగులాంబ గద్వాల :** సంస్థానాల యుగానికి వస్తే మొదటిది గద్వాల నల్ల సోమనాద్రిగా, శోభానాద్రిగా పేరు పొందిన పెదసోమ భూపాలుడు ఒక సారి వేటకు వెళ్లి గద్దగూడెం పల్లి గాతు సమీపంలో కుందేలు పౌరుషాన్ని చూసి అక్కడ కోట నిర్మించాలని భావిస్తాడు. ఆ అరణ్య ప్రాంతం తుంగభద్రా నది వైపు ఏటవాలుగా ఉన్న గడ్డ. దానికి గడ్డవాలు అని పేరు. ఆ ప్రాంతం సయ్యదువియా నవాబు జాగీరులో ఉండేది. అతడి అనుమతి పొంది ఆ ప్రాంతంలో 1704లో కోట నిర్మించాడు. సోమనాద్రి కోట సిద్ధమై రాజధానిని అక్కడికి మార్చినాడు. పండితులు పై గడ్డవాలుకు గడ్డవాలు అని, గదవాలు అని పేరు పెట్టారు. కాల క్రమేణా గద్వాల పేరు పొందింది. బాదామి చాళుక్య రెండవ పులకేశిచే తుంగభద్రా నది తీరంలో దక్షిణ కాశీగా పేరు పొందిన అష్టాదశ శక్తి పీఠాలలో ఐదవ శక్తి పీఠమైన జోగుళాంబ అమ్మవారి దేవాలయం నిర్మించబడి ఉన్నందున నూతనంగా ఏర్పడిన ఈ జిల్లాను జోగుళాంబ గద్వాల జిల్లాగా పిలుస్తారు.

**5. మెదక్ :** దీనికి పూర్వం 'పులాక రాష్ట్ర' మని పేరు. ఇక్కడ సన్నని వరిధాన్యాన్ని పెద్ద ఎత్తున పండించడం వలన దీనికి ఉన్న 'అన్న' సమృద్ధిని బట్టి 'మెతుకుసీమ' అని పిలిచేవారు. మెతుకులోని 'త' కారం ఉచ్చారణలో సారళ్యాన్ని పొంది మొదట 'మెదుకు' మెదక్‌గా మారింది. బహమనీ రాజుల పాలనకు ముందు ఈ ప్రాంతం 'సదాపూర్ మెదక్'గా పిలువబడింది. గోల్కొండ రాజుల కాలంలో 'గుల్షానాబాద్'గా పిలువబడింది. నిజాంలు దీన్ని 'మెతుకు దుర్గంగా' పిలుచుకున్నారు. తర్వాతి కాలంలో హైదరాబాద్ రాజ్యంలో హిందూ సంస్కృతికి సమాధి కట్టే ప్రయత్నం జరిగింది. ఆ ప్రయత్నంలో



భాగంగా 1905 సంవత్సరంలో 'మెతుకు' జిల్లా పేరును 'మెదక్'గా మార్చింది. ఆనాటి హైదరాబాద్ ప్రభుత్వం.

**6. సంగారెడ్డి :** ఆందోల్ సంస్థానాన్ని పాలించిన రాణి శంకరమ్మ తండ్రి సంగారెడ్డి. పూర్వం ఈ ప్రాంతాన్ని సంగారెడ్డి పేట అని పిలిచేవారు. పేటలు వ్యాపార కేంద్రాలుగా ఉండేవి. తర్వాతి కాలంలో పేట లోపించి సంగారెడ్డి గానే పిలువబడుతుంది. 'రాయబాగిన్'గా పిలువబడే రాణి శంకరాంబ తన తండ్రి పేరుతో ఒక గ్రామాన్ని నిర్మించింది. ఆ గ్రామంలో చుట్టూ కోట గోడలు, కందకము, పెద్దచెరువు నిర్మించింది. ఈ గ్రామం హైదరాబాద్ పట్టణానికి సమీపంలో ఉన్నందున త్వరగా అభివృద్ధి చెందడం వలన నేడు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సంగారెడ్డి జిల్లాను ఏర్పరించింది.

**7. సిద్ధిపేట :** మెదక్ రాజవంశానికి చెందిన రామిరెడ్డి కుమారుడు సదాశివ రెడ్డి. ఇతనికి పురుష సంతానం లేనందున కూతురు లింగమ్మకు సింగూరుకు చెందిన నర్సింహారెడ్డిని ఇల్లరికం తెచ్చుకున్నాడు. ఇతడు ధర్మప్రభువు ఔరంగజేబుకు విశ్వాసపాత్రుడు. ఇతని కాలంలోనే విశాలరాజ్యం చేకూరింది. మెదక్ కేంద్రమైంది. ఇతడు నమ్మినబంటు అయిన సిద్దిబిలాలున్ని చేరదీసి, సైన్యాధిపతి పదవి ఇచ్చాడు. ఈ సిద్ది బిలాలుడే తన పేరు మీద 'సిద్ధిపేట' అనే గ్రామాన్ని నిర్మించాడు. ఈ గ్రామాన్ని ఒక సిద్ధుడు నిర్మించినట్లు అతడే భోగేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు కూడా ప్రచారంలో ఉంది.

**8. కామారెడ్డి :** ఈ జిల్లా పేరు దోమకొండ సంస్థానాధీశుల మూలపురుషుడు కామినేడు లేదా కామారెడ్డి పేరుతో వెలసింది. ఇప్పటికే పాతతరం వారు 'కామారెడ్డి పేట'గా పిలుస్తుంటారు. కామారెడ్డి గారి గోల్కొండ సుల్తానుల నుండి మెదకు సీమలోని 'బిక్కవోలు' ప్రాంతాన్ని పొందారు. దాన్ని నేడు బిక్నూరుగా పిలుస్తున్నారు. వీరి తొలి రాజధాని బిక్కవోలుగా, తర్వాత కామారెడ్డిగా ఆ తర్వాత దోమకొండకు రాజధాని మారింది. క్రమంగా కామారెడ్డి పట్టణ స్థాయి పొంది నేడు జిల్లాగా ఏర్పడింది.

**9. భద్రాద్రి కొత్తగూడెం :** పూర్వం అటవీ ప్రాంతాలలోని జనులు తమ ఆవాసాలను, ఆకారంలో గుండ్రంగా ఆకు, ఆలములతో నిర్మించుకునేవారు. ఆవాసాలను గూడెంగా పిలిచేవారు. అలా చుట్టు ప్రక్కల ప్రాంతాల నుండి ఒక కొత్త ప్రాంతానికి చేరి గుడిసెలను నిర్మించేవారు. అలా ఏర్పడిందే కొత్తగూడెం. కాలక్రమేణా గ్రామం విస్తరించి నేటి పట్టణస్థాయిని పొందింది. రైల్వేలైను కారణంగా ఈ ప్రాంతం ఒక కూడలిగా విస్తరించింది. కుతుబ్‌షాహిల పరిపాలన కాలంలో అబుల్ హసన్ తానీషా పాలనాకాలంలో పాల్వంచ పరిగణాకు తహశీల్దార్‌గా పనిచేసి, భద్రాచల రామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న అక్కన్న మాదన్నల మేనల్లుడే. ప్రభుత్వ ఖజానాతో భద్రాచల రామాలయాన్ని కట్టించాడు. ఈ ప్రసిద్ధ ఆలయం ఈ ప్రాంతంలో ఉన్నందున తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాను 'భద్రాద్రి కొత్తగూడెం'గా పేరును మార్చారు.

**10. హనుమకొండ :** కాకతీయుల మొదటి రాజధాని అనుమకొండ నేడు 'హన్మకొండ'గా పిలుస్తున్నారు. బయ్యారం శాసనంలోని కథనం ప్రకారం చాలా కాలం క్రితం శ్రీశైల ప్రాంతవాసి యైన ఎఱుకదేవరాజు అనే ఒక రాజు ఈ ప్రాంతానికి వచ్చాడట. అనుమకొండలోని పద్మాక్షి సిద్దేశ్వరులు ఉన్న ప్రదేశానికి చేరిన అతనికి, ఇది సిద్ధులు సంచరించే పవిత్ర ప్రదేశమని తెలిసి, ఇక్కడే స్థిర నివాసము ఏర్పరుచుకొని ఈ ప్రాంతంలో పాలించసాగాడు. అతనికి అనుమడు, కొండడు, గర్గశేయుడనే కుమారులు కలిగారు. ఎఱుకదేవరాజు తర్వాత అతని కొడుకులు, అనుమడు, కొండడు ఈ ప్రాంతాన్ని పాలించారు. తర్వాతి కాలంలో కాకతీయ గరుడాంక బేత నృపతి అనుమడు, కొండడిని చంపి వారి ప్రాంతాలను రాజధానిగా చేసుకొని పాలించాడు. అప్పటినుండి ఈ ప్రాంతాన్ని 'అనుమకొండ'గా పిలువబడింది. ప్రతాప చరిత్రలో అనుమకొండ అనే కనిపిస్తుంది. సిద్దేశ్వర చరిత్రలో 'సిద్ధేశునగరి, పద్మాక్షినగరి' అనే పేర్లు కన్పిస్తాయి. శాసనాలలో కానీ, సమకాలిన సాహిత్యంలో కానీ ఎక్కడ చూసిన 'అనుమకొండ' పేరే కన్పిస్తుంది. అదే కాలక్రమేణా హన్మకొండగా పేరు మారింది. జైనారామం గల కొండ యగుటచే ఈ నగరాన్ని ఆరామకొండ లేక అర్మకొండ అని పిలిచే వారు. తర్వాత కాలంలో అమ్మకొండ, అన్మకొండ, అనుమకొండగా కుతుబ్ షాహీల కాలంలో హనుమకొండగా మారి ఉంటుంది.

**11. వరంగల్ :** చారిత్రాత్మక నేపథ్యం గల ఈ జిల్లా కాకతీయుల కాలంలో వెలసింది. 'కాకతి' జైనదేవతని కొలిచినందున వీరి వంశానికి కాకతీయులని పేరు. విద్యానాథుని ప్రతాపరుద్రీయం అనే గ్రంథంలో ఓరుగల్లును ఏకశిలానగరంగా పేర్కొన్నారు. ప్రస్తుతం వరంగల్ కోటలో ఉన్న గుండు చెరువు వద్ద ఉన్న పెద్దకొండను

'ఒంటి కొండ'గా (ఏకశిల) చెబుతున్నారు. ఏకశిలానగర శంకుస్థాపన ఆ కొండమీద జరిగిందని చరిత్రకారులు ఊహిస్తున్నారు. 'ఓరుగల్లు' అంటే పెద్ద కొండరాయి. ఓరు అంటే ఒక అని, 'కళ్' అంటే శిల అని, ఇవి తమిళ పదాలు. ఓరుకళ్ – ఓరుగల్లుగా 'ఏకశిలానగరంగా పిలుస్తుంటారు. ఓరుగల్లుకు **'శంభులింగంబునగరు'** అని రుద్రేశ్వరం అని, క్రీడాభిరామం **'ఆంధ్రనగరి'** అని ప్రస్తావించింది. కాకతీయ సామ్రాజ్య పతనాంతరం 150 సంవత్సరాల తర్వాత రాయబడిన కాసెసర్వప్ప 'సిద్ధేశ్వర చరిత్రలో' ఒక కథనాంశం రాయబడింది. రెండవ ప్రోలరాజు కాలంలో ప్రస్తుత స్వయంభూదేవాలయ ప్రదేశంలో 'ఒరగల్లు' అనే స్వర్శవేదిని లింగరూపశిల బయటపడిందని, ఆ ఒరగల్లు పడిన ప్రదేశాన్ని కేంద్ర బిందువుగా చేసుకొని 8 మైళ్ల వ్యాసంతో ఒక కొత్త నగరాన్ని (కోట)ను నిర్మించాడు. ఆ విధంగా 'ఒరగల్లు' పడినచోటు కాబట్టి ఆ ప్రదేశానికి 'ఓరుగల్లు' అని నామకరణం చేశారట అని సిద్ధేశ్వర చరిత్ర చెబుతుంది. తర్వాతి కాలంలో ఓరుగల్లును జయించిన ఉలుఘ్ఖాన్ 'సుల్తాన్‌పూర్' అని పేరు పెట్టినాడు. ప్రస్తుతం వరంగల్‌గా పిలుస్తున్నారు.

**12. జనగాం :** వరంగల్ జిల్లా నుండి వేరుచేసి నూతనంగా ఏర్పడిన జిల్లా, పూర్వం ఈ ప్రాంతాన్ని 'జైన్‌గావ్' అని పిలిచేవారు. దీని అర్థం జైనుల గ్రామం. ఈ ప్రాంతం నుండి జైనులు సిద్దంకి గుట్టల మీదుగా ఆలేరు సమీపంలోని కొలనుపాకకు కాలినడకన వెళ్లేవారని మన పూర్వీకులు చెబుతుంటారు. జైనులు నివాసం ఉన్న చోటు కాబట్టి ఈ ప్రాంతానికి 'జనగామ' అని పేరు వచ్చింది.

**13. ములుగు :** పూర్వ వరంగల్ జిల్లా నుండి వేరుచేసి తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసింది. పూర్వం ఈ ప్రాంతంలో 'ఎక్కువగా 'మునగ' చెట్లు ఉన్నందున 'మునగ – ములగ – ములుగుగా కాల క్రమేణా పేరు మారింది. ప్రస్తుతం ములుగుగా పేరు స్థిరపడింది.

**14. మహబూబాబాద్ :** పూర్వ వరంగల్ జిల్లా నుండి నూతనంగా ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. పూర్వం ఈ ప్రాంతాన్ని మ్రానుకోటగా తర్వాతి కాలంలో మానుకోటగా పిలిచేవారు. ఇది ఒక వనదుర్గంగా ఉండేది. పెద్దపెద్ద వృక్షాలు కలిగిన కోట ఉన్నందున మ్రానుకోట అని పేరు. 6వ నిజాం మహబూబ్ అలిఖాన్ వేట పట్ల ఆసక్తి గలవాడు. మానుకోట ప్రాంతం దట్టమైన అడువులతో ఉండేది కాబట్టి అప్పుడప్పుడు ఈ ప్రాంతానికి వేటకు వచ్చేవాడు. ఆ ప్రాంతంలో నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. 1911 సంIIలో తీవ్ర అనారోగ్యానికి గురై మరణించినాడు. మహబూబ్ అలీఖాన్ నివాసం ఉన్న చోటు కారణంగా మహబూబ్ ఆబాద్ అనే పేరు పెట్టింది (ఆబాద్ అనగా = నివాసం) నిజాం ప్రభుత్వం.

**15. రంగారెడ్డి :** ఈ జిల్లా నిజాం కాలంలో 'అత్రాఫ్–ఏ–బల్దా' జిల్లాలో భాగంగా గుల్షనాబాదు సుబాలో ఉండేది. 1948లో నిజాం



నిరంకుశ పాలన అంతం తర్వాత హైదరాబాద్ జిల్లాలో భాగంగా ఉంది. 1978వ సంవత్సరం వరకు హైదరాబాద్ జిల్లాలోనే కొనసాగింది. 'తెలంగాణ పితామహుడి'గా పేరుగాంచి, ఉపముఖ్యమంత్రిగా పనిచేసిన కొండా వెంకట రంగారెడ్డి పేరు మీదుగా 1978లో హైదరాబాద్ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలను వేరుచేసి ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత జిల్లా పేరులోంచి 'కె.వి' పదాలను తొలగించారు. 'రంగారెడ్డి' జిల్లాగా పిలుస్తున్నారు.

**16 కరీంనగర్ :** ఈ జిల్లాను పూర్వం 'ఎలగందుల' అని పిలిచేవారు. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతం 'సబ్బినాడు'లో భాగంగా ఉండేది. నిజాం ప్రభుత్వం 1905లో 'సయ్యద్ కరీముద్దిన్ ఖిలాదారు' పేరుమీదుగా కరీంనగర్‌గా పేరు మార్చింది. స్థానిక ప్రజలలో మరో వాదన ప్రచారంలో ఉంది. దీన్ని 'కరి నగరం అని పిలిచేవారని, కరి అనగా ఏనుగు, ఏనుగులు తిరిగే నగరం కాబట్టి కరి నగరం అనే పేరు వచ్చిందని, కాలక్రమేణా కరీంనగర్‌గా పేరు మారిందని చెబుతుంటారు.

కాకతీయసామంతులు రుద్రయాదవుడు ఎలగందుల కోటను మానేరు నది ఒడ్డున నిర్మించాడు.

ఎలిగందుల సన్యాసి ముత్యాల కథ ఆధారంగా వెలిగందుల (తెల్లకందులు) ఎలగందులగా మారిందని స్థానికులు చెబుతుంటారు. కరీంముద్దిన్–నిజాం దగ్గర శిస్తు వసూలు చేయు ఖిలాదారుడుగా ఉంటూ తన పేరు పెట్టుకున్నాడు.

**17. వికారాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం 2016వ సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా నుండి కొన్ని ప్రాంతాలను వేరు చేసి నూతన జిల్లాగా ఏర్పరించింది. ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలిఖాన్ కాలంలో ఆయన దగ్గర ప్రధానమంత్రిగా పనిచేసిన నవాబు వికారుల్ ఉమ్రా




తన స్వంత జాగీరు అయినందున ఈ ప్రాంతానికి వికారాబాద్ అనే పేరు వచ్చింది.

**18. ఆదిలాబాద్ :** ఈ జిల్లా పేరు బీజాపూర్ సుల్తాన్ 'మహమ్మద్ ఆదిల్ షా' పేరు మీదుగా ఏర్పడింది. దానికి పూర్వం 'ఏదులాపురం' ఎడ్లవాడ అని పిలిచేవారు. పూర్వం ఈ ప్రాంతంలో 'ఎద్దుల సంత' జరిగేదని ఆ కారణంగా ఎదులాపురంగా పిలువబడేదని స్థానికులు చెబుతుంటారు. ఆదిల్ షా దగ్గర ఆర్థిక మంత్రిగా పనిచేసిన వారికి జాగీరుగా ఈ ప్రాంతాన్ని బహూకరించాడట, అందుకు కృతజ్ఞతగా ఒక గ్రామాన్ని నిర్మించి దానికి ఆదిల్ షా పేరు మీదుగా ఆదిల్ షాబాద్ గా నామకరణం చేశాడట కాల క్రమేణా 'ఆదిలాబాద్'గా పిలువబడుతుంది.

**19. హైదరాబాద్ :** 400 సంవత్సరాలకు పైగా సుదీర్ఘ చరిత్ర కలిగిన హైదరాబాద్‌ను మూసీనది ఒడ్డున క్రీ॥శ॥ 1590 దశకంలో కుతుబ్‌షాహీ వంశస్థుడైన, మహమ్మద్ కులి కుతుబ్ షా నిర్మించాడు. గోల్కొండలోని నీటి సమస్యకు సమాధానంగా పరిపాలనను ఇక్కడి నుండే చేశారని, మొదట 'చంచలం' పేరుతో చిన్న గ్రామంగా ఉ ండేది. కలరా వ్యాధి తీవ్రంగా ఉన్నందున నవాబు కూలికుతుబ్ షా చించలం గ్రామానికి వచ్చి తాత్కాలికంగా బస చేసినాడు. వ్యాధి తగ్గిన తర్వాత గోల్కొండకు వెళ్తూ తమ బసకు గుర్తుగా 1591లో చార్మినార్‌ను నిర్మించినాడు. ఆ తర్వాత 1594లో 4వ ఖలీఫా 'హజరత్ హైదర్ అలీ' పేరిట నగరం నిర్మించినాడు. థేవ్‌నట్ అభిప్రాయం ప్రకారం హైదరాబాద్ నగరం చుట్టు పండ్లతోటలు, ఉద్యానవనాలు అధికంగా ఉండేవి. ఉద్యనవనాలను బాగ్‌లు అనేవారు. 'బాగ్'లు ఉన్నందునే 'భాగ్యనగరం' అనే పేరుగా పేర్కొన్నారు. మహమ్మద్ కూలికుతుబ్ షా తన ప్రియురాలైన భాగవతి అనే హిందూ నాట్య కత్తె పేరు మీదుగా భాగ్యనగరాన్ని నిర్మించినాడని సాంప్రదాయంగా వస్తున్న కథనం. తర్వాత భాగమతి ఇస్లాం స్వీకరించి హైదర్‌మహల్‌గా పేరు మార్చుకుందట. అదే హైదరాబాద్‌గా రూపాంతరం చెందిందని కథనం. ఉర్దూ భాషయుక్తంగా చూస్తే పేరు వెనక మరొక అర్థం ఉ ంది. హైదర్ (రాజు) ఎక్కడైతే ఆబాద్ (ప్రఖ్యాతి) అయ్యాడో ఆ నగరమే హైదరాబాద్ అని పేరు. ఇలా హైదరాబాద్ పేరు మీద అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి.

**20. నిర్మల్ :** గోదావరికి ఉత్తరాన నాలుగు వందల సం॥రాల చరిత్ర కల్గిన ఇక్కడ కోటను నిర్మించిన వారు నిమ్మరాయుడుగా స్థానికులు చెబుతుంటారు. నిర్మల్ పట్టణం చుట్టు చెరువులు కందకాలు నిర్మించినాడు. నిమ్మల – నిర్మల – నిర్మల్ ఆ కాలక్రమేణా పేరు మారిందని పరిశోదకులు చెబుతుంటారు.

**21. జగిత్యాల :** కరీంనగర్ జిల్లా జగిత్యాల తాలుకాలోనే నేటి 'పొలాస' ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని పాలించిన వంశం వెన్గొండ వంశీయులు. వీరు రాజధాని పొలాస అయినందున పొలవాస పాలకులుగా పిలువబడ్డారు. ఈ వంశానికి ఆద్యుడు దుర్జయుడు. వీరి తర్వాత పాలకులు మాధవవర్మ, దుర్గరాజు, మొదటి మేడరాజు, మేడరాజు కొడుకు మొదటి జగ్గరాజు (1110–1116) లేదా జగ్గిదేవుడు ఈయన జగిత్యాల పట్టణమును నిర్మించినాడు. జగ్గరాజు నిర్మించినందున జగిత్యాలగా పేరు వచ్చింది. ఆల అనగా గ్రామం. జగ్గరాజు తన విజయాలకు గుర్తుగా పొలాసకు 8 కి.మీ దూరంలో జగద్దేవాలయం నిర్మించాడని, ఆ ఆలయ పరిసరాలే నేటి జగిత్యాల అని మరో కథనం.

**22 సూర్యాపేట :** పాత నల్గొండ జిల్లా నుండి 2016 అక్టోబర్ 11న వేరు చేసి నూతన జిల్లాగా ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. పూర్వం ఈ పట్టణాన్ని 'భానుపురి' అని పిలిచేవారు. తెలంగాణ భూభాగంలో మొదటగా సూర్యకిరణాలు పడే ప్రాంతం కాబట్టి దీనికి సూర్యాపేటగా పేరు వచ్చి ఉండవచ్చు అనేది చరిత్రకారుల అభిప్రాయం. 'పేట'లు పూర్వం వ్యాపార కేంద్రాలుగా ఉండేవి. 'గేట్ వే ఆఫ్ తెలంగాణ'గా పేరు పొందిన పట్టణం సూర్యాపేట.

**23. యాదాద్రి-భువనగిరి జిల్లా :** కళ్యాణి చాళుక్యరాజు 6వ విక్రమాదిత్యుడు ఏకశిలపై కోటను నిర్మించినాడు. ఈయన బిరుదు 'త్రిభువనమల్ల'. గిరి అనగా కొండ. ఏకశిలపై గల కోటకి విక్రమాదిత్య బిరుద నామంతో 'త్రిభువనగిరి'గా పేరు వచ్చింది. కాలక్రమేణా భువనగిరిగా మార్పు చెందింది. గొప్ప గిరి దుర్గం. 1905 నిజాం ప్రభుత్వం భువనగిరి అనే పేరును 'భోంగీర్'గా మార్చింది. ఋష్యశృంగుని కొడుకైన యాదర్షి హనుమంతుని ఆశీస్సులతో గుట్టపై తపస్సు చేశాడని, తపస్సుకు మెచ్చిన నరసింహస్వామి ప్రత్యక్షమై 'భక్తా' ఏమికావలెనో కోరుకో' అని అడిగాడట అప్పుడు మహర్షి మీరు ఈ గుట్టపైననే వెలసి, మా వంటి ఎందరో భక్తులకు నిత్యం దర్శనమివ్వాలి. అని అడిగాడట. ఆయన కోరిక ప్రకారం నరసింహస్వామి గుట్టపై వెలిశాడట. అప్పటి నుండి ఆ గుట్టకి యాదగిరి గుట్ట అనే పేరు వచ్చిందని పురాణగాథ.

**24. నల్లగొండ :** ఈ జిల్లా యొక్క పూర్వనామం నీలగిరి. రెండు గిరుల మధ్య ఉన్న ప్రాంతం అవి లతీఫ్ సాహెబ్ గుట్ట, కాపురాల

గుట్ట. ఈ రెండు గుట్టల మధ్య వెలసిన గ్రామాన్ని నల్లగొండగా పిలిచేవారు. (నీలం అనగా నల్లని) నీలగిరి పేరు 1905లో నల్లగొండగా మార్చబడింది.

**25. మంచిర్యాల :** మానవులకు ఉపయోగకరమైన 'ర్యాల' వృక్షాలు అధికంగా ఉన్న చోటున వెలసిన గ్రామం అయినందున మంచిర్యాల పేరు వచ్చి ఉండవచ్చు. లేదా 'ర్యాల' పదం యొక్క పూర్వ రూపం 'రేవుల' 'రేవు'లు జలాశయం దగ్గరో, ప్రవాహం చెంతనో, వాగు దాటుటకు అనువైన చోటో అయి ఉండవచ్చు. ఇలాంటి ప్రదేశాలలో వెలసిన గ్రామానికి 'మంచిర్యాల' పేరు వచ్చి ఉండవచ్చు అంతే తప్పా 'మంచి రాళ్లు' ఉన్నందుకే మంచిర్యాల అనే పేరు వచ్చిందనే అభిప్రాయం స్థానికులలో ప్రచారంలో ఉంది. ఇది సరైనది కాకపోవచ్చును.

**26. మేడ్చల్-మల్కాజ్‌గిరి :** పూర్వం మేడి చెట్లు అధికంగా ఉన్న ఈ ప్రాంతానికి ఒక సాధువు వచ్చాడని, దాహంతో తను స్వయంగా 'చెలిమె' తోడి దాహాన్ని తీర్చుకున్నాడని, అప్పటినుంచి ఈ ప్రాంతంలో వెలసిన ఆవాసాలకు 'మేడి చెలిమె' అని పిలిచేవారని, అదే కాలక్రమేణా, 'మేడ్చల్'గా పేరు స్థిరపడిందని స్థానిక ఐతిహ్యం. స్థానికులలో మరో వాదం ప్రచారంలో ఉంది. పూర్వం ఈ ప్రాంతం దట్టమైన అరణ్యం. చెర్ల అనగా చెరువు. మేడి చెట్లు అధికంగా చెరువు సమీపంలో ఉన్నందున ఆ ప్రాంతంలో వెలసిన గ్రామాన్ని మేడిచర్లగా పిలిచినారు. అదే కాలక్రమేణా మేడ్చల్‌గా మారిందని చెబుతారు.

**27. జయశంకర్ భూపాలపల్లి :** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కొన్ని ప్రాంతాలను వేరు చేసి నూతనంగా ఏర్పడిన జిల్లా జయశంకర్ భూపాలపల్లి. పూర్వం ఈ జిల్లాలో కే.వి. భూపాలరావు ఒక సామాజిక వేత్త. రెవెన్యూ అధికారిగా ఉండేవారు. వీరు ప్రజలకు సేవ చేయాలనే తపనతో వెనుకబడి ఉన్న తమ ప్రాంతాన్ని అభివద్ధి చేయాలనే సంకల్పంతో అనేక మౌలిక సదుపాయాలను కల్పించడం కొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేవారు. తర్వాతి కాలంలో ఆయన సేవకు గుర్తుగా ఆ ప్రాంతానికి అక్కడి ప్రజలు భూపాలపల్లి అని పేరు పెట్టుకున్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపెల్లి జయశంకర్ పేరును భూపాలపల్లికి ముందు చేర్చి జయశంకర్ భూపాలపల్లిగా పేరును మార్చుతూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

**28. పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా పూర్వ కరీంనగర్ జిల్లాలో భాగంగా ఉండేది. 'పల్లి' అనగా సంస్కృతమున జనపదము అని అర్థము. పూర్వం బౌద్ధుల ఆవాసాలను 'పల్లెలుగా' పిలిచేవారు. నిజాంల కాలంలో పెద్దపల్లి ప్రాంతం అభివృద్ధిలోనికి వచ్చింది. ఆ కాలంలో చుట్టు ప్రక్కల పల్లెల్లో కంటే జనావాసాలలో పెద్దగా ఉండి,




అభివృద్ధిలోకి కేంద్రస్థానంగా ఉండుటచే 'పెద్దపల్లి'గా పిలిచేవారు.

**29. రాజన్న సిరిసిల్ల :** ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి విభజించి నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా. శాసనాలలో ఈ ప్రాంతాన్ని 'సిద్ధశిల'గా పేర్కొనబడింది. కాలక్రమేణా 'సిద్ధశిల- శ్రీశిల- సిరిశిల- సిరిసిల్లాగా పేరు మార్పు చెందింది. పూర్వం ఈ ప్రాంతంలో నిలకడగా పారే ఏఱు (వాగు) ఉండి, పంటలకు నిలయమైనందునే సిరిసిల్లగా పేరు వచ్చి ఉండవచ్చు.

**30. కొమరం భీం ఆసిఫాబాద్ :** పూర్వం ఆసిఫాబాద్‌ను జిల్లాను జనగామగా పిలిచేవారు. క్రీ॥శ॥ 1741లో ఈ ప్రాంతం నిజాం రాజు పాలనలోనికి వచ్చింది. హైదరాబాద్ రాజ్యంలో బీదర్ సుబాలో చేరింది. బీదరు సుబేదార్ ఆసిఫ్‌ఖాన్ ఈ ప్రాంతాన్ని పాలించేవాడు. అప్పటి నుండి ఆసిఫాబాద్‌గా పిలువబడుతుంది. ఆబాద్ అనగా నివసించే చోటు అని అర్థం.

ఆదివాసీల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గోండు వీరుడు కొమరం భీం 'జల్-జంగల్ -జమీన్' అనే నినాదంతో ఆనాటి నిజాం ప్రభుత్వంతో గెరిల్లా పద్ధతిలో పోరాడి ప్రాణాలిచ్చిన యోధుడు. ఈయన పేరు మీదుగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన జిల్లాకు 'కొమరం భీం ఆసిఫాబాద్'గా పేరు మార్చడం జరిగింది.

**31. నిజామాబాద్ :** పూర్వం ఈ ప్రాంతాన్ని ఇందూరు, ఇంద్రపురి, నాగభూమి, మంజీర భూమి, సపాద లక్ష భూమి, దక్షిణ కోసల, ధర్మాభిదానపురం, పోదనపాడు, కాసలనాడు, అని వివిద పేర్లతో పిలిచేవారు. క్రీ॥శ॥ 388లో ఈ ప్రాంతాన్ని పాలించిన త్రికూట వంశానికి చెందిన ఇంద్రదత్తుడనే రాజు పేరు మీదుగా 'ఇంద్రపురి' అని పేరు. 8వ శతాబ్దిలో పాలించిన రాష్ట్రకూట వంశానికి చెందిన ఇంద్రవల్లభ పాంత్యవర్మ ఇంద్రసోముడు పేరు మీదుగా 'ఇందూరు' అని పేరు. రాష్ట్రకూటుల కాలంలోనే నాగభూమిగా పిలువబడింది. 1901వ సంవత్సరంలో ఈప్రాంతానికి రైలు మార్గం ఏర్పడింది. అప్పటి నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ 1905లో 'నిజాం ఉల్ ముల్క్' పేరు మీద నిజామాబాద్‌గా పేరు మార్చడం జరిగింది.

# నవీన లోకపు ఆవిర్భావానికి..

**ఆర్. నవజీవన్ రెడ్డి,** ఫోన్ : 9742377332

కోట్ల వాహనాలు పరుగెడుతున్నాయి
రహదారులు కిక్కిరిసిపోతున్నాయి
పాదచారులు,సంచారులు
బ్రహ్మచారులు,భామలు
విడి విడిగా / వడి వడి గా
నవీన లోకపు ఆవిర్భావానికి ...
పరుగెడుతూ , పోరాడుతూ

నడుం కట్టి,భుజం తట్టి
సత్తువ నిండిన నరాలతో,
ఉత్సాహంతో,ఉద్వేగంతో
శాస్త్ర విజ్ఞానం తో
మెళకువలు నేర్చి / మెలికను విప్పి
వడి వడి గా
నవీన లోకపు ఆవిర్భావానికి ...
పరుగెడుతూ, పోరాడుతూ

మార్పు కోరి / మతాలను వీడి
మానవత్వాన్ని నింపుకుని
సమాజపు నిర్వేదనమును రూపుమాపి
నిస్తేజమైన మనసుకు చేయూతనిచ్చి
వడి వడి గా
నవీన లోకపు ఆవిర్భావానికి ...
పరుగెడుతూ, పోరాడుతూ

వివక్ష లేని జాతిని కోరి
నారీమణులపై అఘాయిత్యాలు లేని
చట్టాలు చుట్టాలకు కాదని
దౌర్జన్యాలు, దుర్మార్గాలు అణచివేసి
సంకెళ్ళతో దుర్మార్గులకు బుద్ధి చెప్పి
వడి వడి గా
నవీన లోకపు ఆవిర్భావానికి ...
పరుగెడుతూ , పోరాడుతూ ..

పలికే పదమే వేదమై
వేసే అడుగే ప్రభంజనమై
మార్పు కోరుతూ
మార్పు తీసుకొస్తూ
ఆవిర్భవించింది నవీన లోకం...

**32. నారాయణపేట్ :** మహబూబ్‌నగర్ జిల్లా నుండి వేరు చేస్తూ 2019 ఫిబ్రవరి 16న నూతనజిల్లాగా ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణలోని ప్రాచీనమైన సంస్థానాలలో ఒకటైన లోకపల్లి సంస్థానాదీశులు నారాయణపేటను కేంద్రంగా చేసుకొని పాలించారు. 1890, డిసెంబర్ 4న ఆరవ నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ గారు నారాయణపేటగా పేరు మార్చడం జరిగింది. ఈ ప్రాంతం మహబూబ్‌నగర్ జిల్లాలో అంతర్భాగంగా ఉన్నప్పుడు, పూర్వం చోళులు ఈ ప్రాంతాన్ని పాలించినందున చోళవాడి అని కూడా పిలిచేవారు.

**33. ఖమ్మం :** ఈ జిల్లాను క్రీ॥శ॥ 1953లో వరంగల్ జిల్లానుండి వేరు చేసి ఏర్పాటు చేసినారు. ఖమ్మం పురానికి అధిష్ఠాన దేవుడు శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం అక్కడి గుట్ట మీద ఉన్నది. ఖిల్లా దగ్గర ఉన్నది. నరసింహా స్వామి ఇక్కడే అవతరించి హిరణ్యకశ్యపుడిని వధించాడనే ఒక వదంతి ఉన్నది. ఆ వదంతిని బట్టి దీనికి 'స్తంభాద్రి' అనే పేరు వచ్చింది. అంటే స్తంభము గల కొండ అని అర్థం. కానీ నరసింహా స్వామి గుట్టమీద స్తంభం లేదు. కవి హరిభట్టు 'శ్రీమహిత స్తంభాచల' అని అన్నారు. గుట్టకు మెట్లు ఉన్నందున 'కంబము మెట్టు పురము' అని మరొక చోట అన్నాడు. 'కంభం-ఖంభం-ఖమ్మం'గా కాలక్రమేణా పేరు మారింది. మరో కథనం ప్రకారం ఖమ్మం ఊరి మధ్యలో ఉన్న స్తంభాద్రి నుంచే మండపాలకు స్తంభాలకు కావాల్సిన రాళ్లు తరలిస్తూ వుండేవారు అందుకే దానికి 'స్తంభాద్రి' అనే పేరు వచ్చిందని చరిత్రాకారుల కథనం.

**ఆధార గ్రంథాలు :**

1. కృష్ణమూర్తి, భద్రిరాజు, 2010 తెలుగు భాషాచరిత్ర.
2. నారాయణరెడ్డి, సుంకిరెడ్డి, ముంగిలి, తెలంగాణ ప్రాచీన సాహిత్య చరిత్ర.
3. కిశోర్ బాబు, కపిలవాయి, 2011. నాగర్ కర్నూలు తాలుకా గ్రామాలు - చరిత్ర.
4. రంగాచార్య, దాశరథి జీవనయానం.
5. బాలగంగాధరరావు, యార్లగడ్డ - నామ విజ్ఞానం.
6. విశ్వనాథరెడ్డి, కేతు - కడప ఊర్ల పేర్లు
7. పరబ్రహ్మ శాస్త్రి, పి.వి - కాకతీయులు
8. లింగమూర్తి, కపిలవాయి - మన గ్రామ నామాలు
9. మాణిక ప్రభు, పి - మెదక్ జిల్లా గ్రామ నామాలు
10. సత్యనారాయణ, కోర్గు - వరంగల్ జిల్లా గ్రామ నామాలు - సాహిత్య, చారిత్రక పరిశీలన (పరిశోధన గ్రంథం).

❖ ❖ ❖ ❖ ❖

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 31 హైదరాబాద్ ఆగస్టు : 2024

# వెలుదండ సాహితీ సౌగంధిక సౌరభం (సృజనానందం)


డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 8328333720


మనిషిని మహాగ్రంథంగా తీర్చిదిద్ది, జీవన సమరానికి సిద్ధం చేసేది సాహిత్యం. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఇందుకు కేంద్రంగా నిలుస్తుంది. పఠనం, బోధనతో పాటు సాహిత్యాన్ని వెలువరించి దేశకీర్తిని వెలిగించినవారు ఈ శాఖలో అనేకం ఉన్నారు. అందులో నిత్య చైతన్యంతో, అనునిత్యం సాహితీసృజనే శ్వాసగా నడిచే నిలువెత్తు గ్రంథాలయం, విజ్ఞాన సర్వస్వం ఆచార్య వెలుదండ నిత్యానందరావు.

**'విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన'** అనగానే వెంటనే గుర్తుకొచ్చేవారు ఆచార్య నిత్యానంద రావుగారే. **'చంద్రరేఖా విలాపం-తొలి వికట ప్రబంధం', 'తెలుగు సాహిత్యంలో పేరడీ', 'హాసవిలాసం', 'భారతీయ జ్వలిత చేతన బంకించంద్ర', 'నిత్య వైవిధ్యం', 'నిత్యానుశీలనం', 'రాజనీతిజ్ఞుడు బూర్గుల', 'నిత్యాన్వేషణం'** వంటి అమూల్యమైన గ్రంథాలతో పాటు ఆయన సాహిత్య భాండాగారం ఏడు సంపుటాలుగా వెలువడి పాఠకలోక ప్రియమైంది. **'అనుభూతి అన్వేషణ', 'అక్షరమాల', 'వాగ్దేవి వరివస్య', 'పరిశోధకప్రభ', 'వ్యాస శేముషి', 'సృజనానందం', 'ఆదర్శపథం'.** ఈ ఏడింటిలో ఆరవది 'సృజనానందం'. దీని పరిశీలనమే ప్రస్తుత పరమావధి.

ఈ గ్రంథం భిన్నాంశాల సమాహారం. ఇందులో రచయిత రాసిన నాటికలు, కవితలు, కథలు, లేఖలు, లఘు వ్యాఖ్యలు, సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ వ్యాసాలు మొదలైనవి కొలువైనాయి. ఇవి రచయితలోని విభిన్న పార్శ్వాలను దర్శింపజేస్తున్నాయి. దృశ్య శ్రవణ జ్ఞానవికాస సాధనం నాటకం. నాటకం సమాహార కళ. ఈ నాటక రచనా కళను సమర్థంగా ఔపోసన పట్టినవారు వెలుదండవారు. ఈ సంకలనంలో వారు రాసిన **'కృతిస్వీకృతి', 'జంబుమాలి', 'మార్గదర్శి వివేకానందుడు', 'వంశాకురం'** అనే నాలుగు నాటికలున్నాయి. ఈ నాటకాలలో మూడు చారిత్రక కోణాన్ని, ఒకటి ఇతిహాస కోణాన్ని కలిగి వున్నాయి. 'కృతి స్వీకృతి' నాటకం విక్రమ సింహపురి అనబడే నెల్లూరు సీమను పాలించిన మనుమసిద్ధి మహారాజు ఆస్థానంలో ఒకనాడు జరిగిన సాహితీగోష్టిని దృశ్యమానం చేస్తుంది. మనుమసిద్ధి ఆస్థానంలో తిక్కన, అతని సోదరుడు ఖడ్గతిక్కనల మధ్య పరస్పర ప్రేమాభిమానాల మధ్య, రాజకీయ వ్యవహారాలకు స్వల్ప విరామమిస్తూ సాహిత్యం వైపుకు చర్చ సాగుతుంది. ఈ చర్చలో మనుమసిద్ధి మహారాజు సాహితీ వ్యవసాయానికి ఇచ్చిన తోడ్పాటు కనిపిస్తుంది. కేతన తన 'దశకుమార చరిత్ర'ను తిక్కనకు అంకితం ఇవ్వడం, కావ్యారంభంలో తిక్కన, మనుమసిద్ధి మహారాజుల వంశప్రతాపాలపై వెలుగు సారించడం వంటివి కనిపిస్తాయి. ఈ అంశాలు తిక్కన ప్రతిభను, నెల్లూరు పాలకుని సాహితీ పోషణాభిలాషను పాఠక/ప్రేక్షకులకు తెలిసేలా చేస్తాయి. నాటకంలోని సంభాషణలు తిక్కనను భారతాంధ్రీకరణ వైపుకు నడిపించడంతో కథ ముగుస్తుంది. చక్కని పాత్రచిత్రణ, ఔచిత్యంతో కూడిన సంభాషణలు నాటకాన్ని రసరమ్యం చేస్తాయి.

రెండవ నాటకం 'జంబుమాలి'. ఈ నాటకం రామాయణంలోని అరణ్యకాండను ఆధారంగా చేసుకొని నడిపించారు రచయిత. శూర్పణఖ-విద్యుజ్జిహ్వుల కుమారుడు జంబుమాలి. అనుకోకోకుండా ఇతడు లక్ష్మణుని చేతిలో మరణించడం, దానికి అతడు చింతించడం, తుదకు ఒక మహర్షి వలన అతడు ఒక రాక్షసి కుమారుడనీ, అతను చనిపోవడం వల్ల ఎంతో మేలు జరిగిందని తెలియడం వంటి ఘట్టాలు మన కండ్లముందు




కదిలిపోతాయి. చాలామందికి తెలియని ఈ రామాయణఘట్టాన్ని రచయిత ఈ నాటకంలో పరిచయం చేస్తారు. సకల సంపద్వంతుడైన రావణ సోదరి శూర్పణఖ అడవుల్లో ఎందుకు బ్రతుకుతున్నది? అన్న విషయమై ఎవ్వరూ అంతగా ఆలోచించరు. ఆ దిశగా ఈ నాటకం శ్రోతలను ఆలోచింపజేసి కొత్తకోణంలోకి నడిపిస్తుంది. విద్యుజ్జిహ్వుడికి ఆమెకు వివాహం జరగడం,

అతడు రావణుని కోపానికి గురి అయ్యి మరణించడం వంటివి శూర్పణఖ జీవితంలో దాగిన భూతకాల సత్యాలను పట్టిస్తాయి. అంతేకాదు రావణ సోదరి పుత్రశోకంలో ఉంటూ వెంటవెంటనే కామోపభోగ లాలసను ప్రకటించే ఆమె విపరీత మానసికస్థితిని, రావణ నాశనానికి ఆమె ఎలా కారణమైందో శ్రోతలు అర్థం చేసుకుంటారు.

నరేంద్రుడు వివేకానందుడుగా మారడానికి గల వాస్తవ కథనానికి నాటకరూపం **'మార్గదర్శి వివేకానందుడు'.** ఈ నాటకం నాటక లక్షణాల నీడలో భారతీయ అధ్యాత్మను ప్రపంచపరం చేస్తుంది. భగవదన్వేషణలో కొట్టుమిట్టాడుతున్న నరేంద్రుడు రామకృష్ణ పరమహంస సన్నిధికి చేరడం, అతడు నరేంద్రునికి భగవద్దర్శనంతో పాటు ఆత్మవికాసాన్ని కలిగించి భారతీయ అధ్యాత్మ ప్రభావాన్ని ప్రపంచంపై ప్రసరింపజేసేలా అతడిని తయారుచేయడం వంటివి మనం చూస్తాం. మనిషి మనీషిగా ఎలా ఎదగవచ్చు, జగతి సుఖాలకు దూరంగా నిజబంధువు అయిన దైవానికి దగ్గరై బ్రతుకును ఎలా పండించుకోవచ్చు అన్న జ్ఞానం ఈ నాటకం చదివి అందుకోవచ్చు.

చివరిది **'వంశాంకురం'.** ఈ నాటకం రాక్షస తంగడియుద్ధంతో ప్రభను కోల్పోయిన కడపటి విజయనగర రాజులు చంద్రగిరిని రాజధానిగా చేసుకొని రాజ్యాన్ని పాలించడం వంటి చరిత్ర ఘట్టాలకు చిత్రిక పడుతుంది. కథ ఆద్యంతం ఆసక్తిగా నడుస్తుంది. వెంకటపతి దేవరాయలు సంతానం కోసం అల్లాడుతుంటాడు. ఆయన భార్యలు కొండాంబ, బాయంబలు ఒక అజ్ఞాతసాధువుచే పురమాయించబడి, రాజ్య రక్షకుడు జగ్గరాయనిచే చెప్పబడిన 'వంశాకురవర్ధన వ్రతం' ద్వారా పుత్ర సంతానాన్ని పొందుతారు. ఇదంతా కపటనాటకమని గుర్తించిన వెంకటపతిరాజు తన వంశీయుడైన శ్రీరంగరాయలను రాజును చేసి చనిపోతాడు. నాటకంలోని సన్నివేశాలు ఒకవైపు రాజ్య సుభిక్షాన్ని దర్శింపజేస్తూనే, మరోవైపు జగ్గరాయల కుట్ర, యాచమనాయకుడు దాన్ని ఛేదించడం వంటివి రాజ్య అంతర్గత కలహాలు, సింహాసనం కోసం జరిగిన కుమ్ములాటలు కుట్రలను కండ్లముందుంచుతాయి. ఇలా నాలుగు నాటకాలు ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రంగా వెలువడి శ్రోతల్లో చారిత్రక, పౌరాణిక జ్ఞానజిజ్ఞాసను పెంపొందిస్తాయని చెప్పవచ్చు.

వెలుదండ వారి వాక్ ఝరిలోంచి కవితలు వెలువడడం విశేషం. వ్యాసపరంపరనే వారి సాహితీ సంపదలో అధికంగా కనిపించినా అప్పుడప్పుడు కవితలు రాసి వాటిని చమత్కారంగా వినిపించి ఎదుటివారిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతారు. వారి కవితలలో'వాగ్దేవి' కవిత పద్యకవిత. సీసపద్యాలలో భారతీ వైభవాన్ని ఆవిష్కరిస్తారు రచయిత.

**"నన్నయ కవిచంద్రు నవ్య సౌధంబున**
**లలితమౌ పలుకులు పలుక నేర్చి**
**తిక్కనామాత్యుని దివ్యాంగణంబున**
**తగురీతి బాల్యంబు దశను గడిపి**
**శ్రీనాథ కవిరాజు శీతాంశుశాలలో**
**యౌవన దశయందు నడుగుబెట్టి....."**

అంటూ భారతభారతి నన్నయ మొదలు తెలుగు కవులైన శ్రీనాథుడు, పెద్దన, పింగళిసూరన, ధూర్జటి, చేమకూర వెంకటకవులతో పాటు కవిపోషకుడు, కవిరాజు శ్రీకృష్ణదేవరాయలపై వాగ్దేవి చూపిన కరుణ కటాక్షాలను గురించి వర్ణిస్తారు. తెలుగు కవితను వెలిగించి పరవశించిన బ్రాహ్మీవైభవాన్ని రచయిత సుందరంగా, సభక్తికంగా కవితీకరించారు. ఈ సీస పద్యాలు రెండు ఆణిముత్యాలవలే గ్రంథ సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. 'మిడిసిపడకు' అనే శీర్షికతో ఒకే ఇతివృత్తాన్ని వచనకవితగాను, పద్యకవితగాను రాయడం గమనార్హం.

**"అగ్గిపెట్టెలోని అగ్గిపుల్లా!/గర్వించకు/నీ గంధకాన్ని కిరీటంగా/ నీ వుండే దాన్ని ఇంద్రభవనంగా /గుర్తుంచుకో నీది దురాశని....."** అంటూ వస్తువును వచనంలో....

**"అందమౌ పెట్టెలోనుండు నగ్గిపుల్ల!/క్రమ మకుటమ్ముగా నీదు గంధకమును/**

**ఇంద్రభవనమ్ముగా నీదు ఇరుకుగదిని / ఎదద తలపోసి తలపోసి మిడిసిపడకు /**

**విఱ్ఱవీగకు మిది గుర్తుపెట్టుకొనుము / నిజాము తెలుసుకొనీయదు నీ దురాశ...."** అంటూ పద్యంలో సాగుతుంది.

అగ్ని పంచభూతాలలో ఒకటి. అది అన్నింటా ఉష్ణరూపమై నివసించే ప్రకృతి శక్తి. ఋతువుల క్రమాన్ని క్రమబద్ధీకరించి ముందుకు కదిలిస్తుంది. విపరీతం జరిగినప్పుడే వినాశరూపం దాల్చి తన విరాట్ రూపాన్ని చూపిస్తుంది. ఇది అగ్నికి ఒకవైపు నిర్వచనం. కవి కవితలో మాత్రం మానవాళి కోసం పరితపించే నాయకులు ముందు ఒకతీరు, నాయకులయ్యాక మరోతీరుగా ప్రవర్తించే రీతిని పరోక్షంగా ప్రకటించారు. తన పదవి తనకు కిరీటంగా, ఇంద్ర భవనాది విలాసాలతో తనకంటే గొప్పవాడు లేడని విఱ్ఱవీగడం తగదని, ప్రజాతంత్రం పడగొట్టడానికి సిద్ధంగా ఉంటుందని హెచ్చరిస్తాడు. ప్రజల సంక్షేమమే పరమావధిగా ప్రజల మనిషిగా బ్రతికితే వారితో పాటు జీవితమనీ, లేకుంటే కలిగిన కలిమి, కల్మషమైన నీ నడక అగ్నిలా మారి నిన్నే కాల్చి బూడిద చేస్తుందని హితువు పలుకుతారు.

**'శృంగార నాయికలు'** అనే కవితలో అష్టవిధ నాయికల స్వభావాదులను చక్కని సీసపద్యంగా మలిచారు రచయిత. చెప్పడంకంటే ఆ కవిత చదువుకొని ఆనందించవలసిందే. సరళ పదాలతో ఎక్కడా ప్రయాసకు తావులేక ఎవ్వరికైనా అర్థం అయ్యే విధంగా ఈ పద్యం సాగడం విశేషం.

**'అనుమానం'** కవిత ఇందిరాగాంధీ హయంలో ఎమర్జెన్సీ వెళ్ళిపోయాక మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఏర్పడ్డ ప్రభుత్వం గురించి వివరిస్తూ సాగుతుంది. ఈ కవితలో 'పార్టీలు మారినంత మాత్రాన, అనాదిగా వారి మనస్సులో నాటుకుపోయిన పాత విలువలు అంత త్వరగా మారిపోవు కదా!' అంటూ అంతర్గత కీచులాటలు, తగాదాలు, సంఘర్షణలతో అల్లాడుతున్న అలనాటి ప్రభుత్వ తీరును సున్నితంగా విమర్శిస్తారు రచయిత.


**'భారతీయులెందరు?'** కవిత దేశ సాంస్కృతిక సౌభాగ్యాన్ని, భారతీయతను హృదయాన మోస్తూ దేశభక్తితో ఇక్కడి మనుషుల కోసం పరితపించే భూమిపుత్రులను గురించి తెలుపుతుంది. కవి ఈ కవితలో దేశ ఔన్నత్యాన్ని మరుగున పరుస్తున్న కుట్రలను ఛేదించి దేశప్రతిష్ఠను జాతీయ పతాకం చేసి ఎగురవేస్తాడు. ఇందులో..

**"భారతదేశంలో జనులే తప్ప/ భారతీయత లే దన్నాడట విదేశీయుడు/ నిజమే కాబోలనుకున్నాడు సామాన్యుడు/ ఒక్క క్షణ మాలోచించాడు/ ఆ (అ)సామాన్యుడు/ ఈ దేశంలో దేశీయులెందరని/ లెక్కగట్టాడు..."**

అంటూ ఈ మట్టి గొప్పదనాన్ని ఎరిగి, స్వదేశం మీద భక్తితో, అభిమానంతో సర్వజన హితంకోసం ప్రాణాలను అర్పించే దేశభక్తుల గురించి చెబుతూనే ఇక్కడ పుట్టి, ఇక్కడే పెరిగి, ఇక్కడి వనరులను ఉపయోగించుకొని సశక్త మానవ వనరులుగా తయారైన వారు సంపాదననే స్వార్థంతో పరదేశాలకు పయనమైపోయి అక్కడి సమృద్ధి పెంపుకు కారణమవుతున్న తీరును ఎండగడతారు. దేశభక్తితో అహరహం రగిలి, దేశసార్వభౌమత్వం ప్రజలదే అన్నవారిని రాజ్యం ఏ విధంగా అణచివేస్తుందో పరోక్షంగా తెలుపుతూనే ప్రజల్లో దేశభక్తి చింతనను మేల్కొలుపుతారు కవి.

ఇక రాజకీయ భాగోతం పేర రాసిన పద్యాలు ఎంతో చమత్కారంగా ఇటు దేశ రాజకీయ చిత్రాన్ని, అటు వ్యంగ్యభరితమైన హాస్యాన్ని గుమ్మరిస్తూ పాఠకులని ఆలోచింపజేస్తాయి.

**"ఓయమ్మ! నీ కుమారుడు**
**మా యిష్టంబున్న పదవి మననీడమ్మా**
**పోయెదమే పార్టికయిన**
**మా 'యన్నల' కొలువుచేయ మంజులవాణీ"** అంటూ నియంతృత్వ ధోరణులలోకి వెళ్ళిపోయిన అలనాటి ప్రజాప్రతినిధులతీరునూ , ప్రభుత్వాధినేతలు వివిధ శాఖలను తమ ఆధీనంలోకి తెచ్చుకొని వాటిని నియంత్రించడాన్నీ వ్యంగ్యంగా అభిశంసిస్తారు. ఈ పద్యంలో మొత్తంగా ప్రజాపాలన గాడితప్పిన విధం, ప్రభుత్వంలో నియంతృత్వం పెరగడంతో పార్టీని వీడి ఇతర పార్టీల తీర్థం పుచ్చుకుంటున్న అలనాటి, ఈనాటి రాజకీయ చిత్రం ప్రతిబింబితమైంది. మరొక పద్యంలో....



**"పదవి వచ్చువేళ! పదవి పోవు వేళ**
**ప్రాణమైన పదవి భంగమందు**
**కూడబెట్టినట్టి 'కోట్ల' రక్షణమందు**
**బొంకవచ్చు నఘము పొంద దధిప"** ప్రజాపాలకులు ప్రజాసేవను ఒక ఆర్థిక లావాదేవిగా భావిస్తున్నారనీ, అది నేడొక వ్యాపార మార్గమైందనీ, కోట్లు కూడబెట్టే దృష్టితోనే రాజకీయాలలోకి వస్తున్నారని, వారు తమ పదవులను కాపాడుకోవడానికి ఎలాంటి మార్గాలనైనా తొక్కడానికి సిద్ధంగా ఉన్నారని వారి మనస్థితిని ఎండగడతారు. అంతటా డబ్బు రాజకీయాలు మొదలై పదవి పొందడానికి, వచ్చిన పదవిని రక్షించుకోవడానికి ఎటువంటి అబద్ధాలనైనా పలుకుతున్నారని నిజాయితీ, సత్యనిష్ఠలు కరువైపోయాయని ప్రజాసంక్షేమం తుంగలో తొక్కుతున్నారని నిర్మొహమాటంగా పద్యాస్త్రం విసురుతారు.

అధిష్ఠానం అండకు చేరితే, అధిపతిని ప్రసన్నం చేసుకుంటే, పొగడ్తలతో ముంచెత్తుతే మాత్రమే నేడు పదవులు, పచ్చనోట్లు వచ్చి పడుతున్నాయని, అలా కాని పక్షంలో ఎవ్వరికీ ఏమి దక్కదని, నేడు భజన పరులదే శాసనసభ అన్న ఈనాటి, నాటి పరిస్థితికి అద్దం పడుతూ ...

**"చేతులార రాజీవు పూజింపదేని**
**నోరు నొవ్వ నిందిర కీర్తి నుడువదేని**
**కోట్ల ధనమును, పదవి కోరదేని**
**సీటు నేటికి వానికసెంబ్లియందు"** అంటూ ఎంతో నమ్మకంతో ప్రజలు గెలిపిస్తే వారి అభివృద్ధిని పక్కకు నెట్టి కేవలం అధినాయక భజన చేస్తూ పబ్బం గడుపుకునే వారిని పద్యంలో నిరసిస్తారు. ఇవేకాకుండా **'సమస్యా పూరణలు', 'కాళిదాసు పద్యాల తెలుగు అనువాదాలు', 'పద్మవదన' 'నేనే భారతాన్ని', 'సమత్వం ఆవహించగా', 'జీవుని (ని)వేదన', 'చిగురుటాకు', 'ఆనందాల హరివిల్లు'** మొదలైన కవితలతో ఆలోచనలకు పదునుపెట్టి వాస్తవం వైపు పాఠకులను కదిలిస్తారు.

కవితల అనంతరం కథలు గ్రంథంలో చోటుచేసుకుంటాయి. మొదటి కథ **'మగపిల్లాడు'**. కథా నాయకుడు దురదృష్టరావు చిన్న బడిపంతులు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొస్తుంటాడు. పాతకాలపు ఆచారాలను నమ్ముకొని తొమ్మిదిమంది ఆడపిల్లల మీద కొడుకు పుడతాడని భార్యతో రోజూ పేచి పెడతాడు. ఈ క్రమంలోనే కట్నం ఇవ్వలేకపోవడంతో పెద్దకూతురు నచ్చినవాడితో వెళ్ళిపోతుంది. కథా నాయకుడికి మళ్ళీ ఆడపిల్లే పుడుతుంది. అప్పటికి గాని అతనికి జ్ఞానోదయం కాదు. చివరికి మారుతున్న కాలానికి అనుగుణంగా మారడంలోనే మన అభ్యుదయముంటుందని గుర్తిస్తాడు. నేడు కుటుంబనియంత్రణ అనేది సార్వజనీనమైన సాధారణాంశమైంది. రచయిత ఈ కథ రాసిన 1976నాటికి కుటుంబనియంత్రణ పట్ల అపోహలు.. 'అపుత్రస్య గతిర్నాస్తి' అన్న విశ్వాసాలు బలంగా ఉన్న కాలమని గుర్తించాలి. ఒక పల్లెటూరులో 15 ఏళ్ళు కూడా సరిగారాని పదవతరగతి చదువుతున్న విద్యార్థి రాసిన కథ ఇది అని తెలుసుకొని ఆశ్చర్యానికి లోనవుతాం. ఈ కథ రాసేనాటికే సమాజం పట్ల, దేశంపట్ల ఎంత బాధ్యతాయుతమైన ఆలోచనలు మొలకెత్తాయో తెలిసి సంతోషం వేస్తుంది.

రెండవ కథ **'అశోకుడు నిర్మించిన నరకం'.** ఈ కథ కవి కాల్పనిక చతురతకు ఉదాహరణగా నిలుస్తుంది. తండ్రి మరణానంతరం పాటలిపుత్ర రాజ సింహాసనాన్ని అధిష్ఠించిన అశోకుడు **'కాలాశోకుడి నుండి ధర్మాశోకుడిగా మారిన చరిత్ర ఘట్టానికి మరోకథనమా! ఇది'** అని కథను చదివేవారికి అనిపించేలా చేస్తుంది. రాజ్యపర్యటనకు బయలుదేరిన అశోకుడు దండకారణ్యంలో చూసిన యమలోక దృశ్యాలు అతనిలో కొత్త ఆలోచనను కలిగిస్తాయి. అతని రాజ్యం లోనూ ఇటువంటి శిక్షల కేంద్రాన్ని ఒకదాన్ని ఏర్పాటు చేసి ప్రజలను భయానికి దగ్గరచేస్తే రాజ్యానికి ఎదురు తిరగరని భావిస్తాడు. రాజ్యంలో అత్యంత క్రూరుడిని ఇందుకు నియమిస్తారు. వాడు నరరక్తపానం చేసే అలవాటున్నవాడు. అనుకోకుండా అతని నరక సౌధంలోకి బౌద్ధసన్యాసి "నిత్యానందుడు"(రచయితపేరేగదా!) ప్రవేశించడం అతడు ఈ క్రూరునిలో మార్పును తేవడం, అది అశోకునిలోనూ మార్పుకు కారణమవ్వడం మనం చూస్తాం. భర్త వైరాగ్యంతో సంసారానికి దూరంగా ఉండడం, తనను పట్టించుకోక పోవడం, ప్రజల సంక్షేమం చుట్టూ తిరగడంతో బాధతో బోధి వృక్షాన్ని నరికింపజేస్తుంది అశోకుని భార్య. అది చూసిన అశోకుడు మరణశయ్యకు దగ్గర కావడం, నరికించిన చోటనే మరో బోధివృక్షం పురుడుపోసుకొని చిగురించడం కారణంగా అతడు తిరిగి కోలుకోవడంతో ఈ కథ ముగుస్తుంది. కథలో కరుణ (కారుణ్యం)కు మనిషి ఇవ్వల్సిన ప్రాధాన్యత కనబడుతుంది. మానవత్వమే అసలైన జీవన మార్గమని, ఇంద్రియ నిగ్రహంతో తన కళ్యాణం గావించుకుంటూ, సమస్త సృష్టి కళ్యాణం వైపుగా సాగడమే మనిషి జీవన పరమార్థం అని రచయిత చాటుతారు.

అలాగే మూడవ కథ 'రామూకేమైంది'. ఇందులో నాటకంలో నటిస్తున్న పాత్ర చుట్టూ కథ నడుస్తుంది. రామనాథం తన కుమారుడికి గుండెనొప్పి వచ్చిందని తెలియడంతో ఆగమేఘాల మీద బడికి చేరుకుంటాడు. నాటకమన్నా, నటన అన్నా ఏమాత్రం తెలియని రాము చెల్లి రోజా తన తండ్రికి బడిలో జరిగిన గుండెనొప్పి సన్నివేశాన్ని భయంభయంగా వివరిస్తుంది. తుదకు అది నాటకం రిహార్సల్ అని తెలిసి ఊపిరి పీల్చుకుంటాడు తండ్రి. సత్యాసత్యాల అవగాహన లేమి ఎంతటి అపోహలకు దారితీసి మనుషులను ఎలా పరేషాన్ చేస్తుందో ఈ కథ తెలియజేస్తుంది. రచయిత తన చిన్ననాటి అనుభవానికి కల్పించిన కథాకృతి ఇది. ఇక **'నిరుద్యోగిని సావిత్రి'** అలనాటి సతీ సావిత్రి కథను అనుసరిస్తూ వర్తమాన సమకాలీన స్థితిగతులను ప్రతిఫలిస్తూ సాగుతుంది.

రచయిత రాసిన లేఖలు, సన్మానపత్రాలు, సాహితీ వ్యాసాలు ఈ గ్రంథానికి మరింత వన్నెను తీసుకొచ్చాయి. **'పరులకీయవు, కుడువవు'** అనే శీర్షికతో ఆంధ్రప్రభ దినపత్రికకు1978లో రాసిన ఉత్తరమిది. నిత్యానందరావు తొలిసారిగా తనపేరును అచ్చులో చూసుకొన్నది. సింహాచలం దేవస్థాన యాజమాన్యానికి ఉండాల్సిన బాధ్యతలను గుర్తుచేస్తూ సంవేదనాత్మకతతో ఉత్తరం రాశారు వెలుదండవారు. **"పరులకీయవు కుడువవు పైడి నీకు/ఏమి లాభంబు చేకూర్చె ఇంతదనుక/అకట ఉండిన ఒకటి కాదె"** అంటూ అలనాడు సింహాచలం దేవస్థానంలో తస్కరులు హుండిని దోచి దేవదేవుని ఆస్తి గుల్ల చేసిన సందర్భంగా ఈ ఉత్తరం మానవాళికి-దైవానికి మధ్య వితరణ బంధాన్ని ఎరుకజేసింది. **'లోకానికి సమస్తం పంచిన దైవానికి లేమి ఎక్కడ ఉందని, అన్ని ఇవ్వగలిగిన స్వామికి మనమివ్వగలిగిందేమిటి'** అన్న సత్యాన్ని గుర్తుచేస్తూ **'భక్తులు సమర్పించిన సొమ్మును ప్రజల అవసరాలు తీర్చడానికి ఉప యోగించాలని, బీదల ఆకలిని తీర్చి, వారికి విద్యా, వైద్య సదుపాయాల కల్పనకు వాడాల'**ని హితవు పలుకుతారిక్కడ కవి. అలా వాడనట్టయితే తుదకు దొంగలకో, దొరలకో.....? అన్నట్టు తయారవుతుందన్న సత్యాన్ని గుర్తుచేస్తారు.

ఈనాడు దినపత్రికకు 2.6.1995లో రాసిన మరొక ఉత్తరం **'ఎం.ఎల్.ఏ. లకూ ఇద్దరు పిల్లల నిబంధన'**.. సర్పంచ్ స్థాయి వారికి ఇద్దరు పిల్లలకు మించి ఉండరాదని నిబంధన పెట్టి , ఎం.ఎల్.ఎ. లకు ఆ పై స్థాయి వారికి లేకపోవడం అన్యాయమని, మానవహక్కుల, రాజకీయ హక్కుల ఉల్లంఘన అని ప్రశ్నిస్తారిక్కడ రచయిత. అలాగే సర్పంచులు ఇంటిపన్నులు వగైరా అన్ని పన్నులు చెల్లించాలనడం మంచిదే కానీ ముందు ఎం.ఎల్.ఎలు, ఎం.పిలు కూడా 'నో డ్యూస్' చూపించి ఎన్నికలలో నిలబడాలంటారు. నైతికత పైస్థాయి నుంచి కింది స్థాయికి వ్యాపించాలనీ, ప్రజల జీవితాలను సక్రమ రీతిలో

నడిపించేవారు ముందుగా క్రమశిక్షణ నిబంధనలు పాటించాలన్న కనీస బాధ్యతను గుర్తుచేస్తారు.

ఇంకో లేఖలో...ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బంది పట్ల ఎన్నికల నిర్వహణకు పంపేటప్పుడు ఒక రకంగా, నిర్వహణ సామాగ్రి సమర్పించేటప్పుడు మరోరకంగా ప్రవర్తించే అధికారులతీరును నిరసిస్తారు. సబ్మిషన్ సమయంలో మహిళా సిబ్బందిని సైతం రాత్రి పదకొండు గంటల వరకు ఆపడం, వారికి రవాణా సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను గుర్తుచేస్తారు. ఇలా పద్దెనిమిది లేఖల్లో సాహిత్య, రాజకీయ, సామాజిక అంశాలపై సమకాలీన సత్యాలను ప్రతిబింబిస్తూ సమాజ సంక్షేమం పట్ల తనదైన అభిప్రాయాలను వినిపిస్తారు.

వీరు రాసిన సన్మాన పత్రాలు వివిధ సాహితీ ఉద్ధండుల వ్యక్తిత్వాలను ఆవిష్కరిస్తాయి. 2007లో ఆచార్య ఎస్వీ రామారావుగారికి, 2014లో బహుముఖ ప్రజ్ఞాభారతి డా. కపిలవాయి లింగమూర్తిగారికి, 2008లో అద్దేపల్లి రామ్మోహనరావు గారికి, 2009లో ఆచార్య బిరుదురాజు రామరాజుగారికి, అలాగే 2015లో ఆచార్య సి. నారాయణరెడ్డి కేంద్ర సాహిత్య అకాడమి ఫెలోషిప్ పొందినప్పుడు వెలుదండ వారు సన్మాన పత్రాలు రాశారు. వారు రాసిన సన్మాన పత్రాలు సన్మాన పత్ర నిర్మాణం, లేఖనం ఎలా ఉండాలో తెలుపుతూ ఆ వ్యక్తుల వ్యక్తిత్వాన్ని, వారి కీర్తినిప్రకాశింప చేస్తాయి. కవితాత్మకరీతి, విషయనిర్భరత కదును తొక్కుతూసాగుతాయి.

ఇక వీరు రాసిన రాజకీయ వ్యాసాలు దేశచరిత్ర గతిలో స్థిరమైపోయిన కొన్ని సందర్భాలను నమోదుచేశాయి. ఈ వ్యాసాలలో **'రాజకీయాల రగడలో పడి నలిగి మిగిలిన 'వందేమాతరం'** అన్న వ్యాసం జాతీయగీతానికి అన్ని అర్హతలు ఉన్న **'వందేమాతర గీతం–ప్రస్తుత జాతీయగీతం జనగణమన'**తో సమాన గౌరవాన్ని మాత్రమే పొందడం వెనక ఉన్న రాజకీయ రగడను విప్పి చెబుతుంది. 1911లో ఐదవ జార్జ్ చక్రవర్తి స్వాగతం కోసం రవీంద్రుడు రాసిన గీతానికి బ్రిటీష్ వారు ఇచ్చిన సమర్థన కారణంగా పెద్దపీట వేయడం మింగుడు పడని విషయంగా నిలుస్తుంది.

బ్రిటీష్ వారు (1907లో) కలకత్తాలోని లాల్ బజార్ లో చేసిన లాఠీఛార్జ్ సందర్భంగా బాల దేశభక్తుడు సుశీల్ శత్రు తుపాకీ గుండ్లకు తన గుండెలను ఎదురుగా నిల్పడం, బ్రిటీషువారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం వంటి సంఘటనలు **'పదిహేనేళ్ళ సుశీల్'** అనే వ్యాసంలో చూస్తాం. సాధన పత్రికలో 1981లో ప్రచురితమైన ఈ వ్యాసం దేశభక్తిని గుండెలనిండా నింపుతుంది.

ఇటువంటిదే మరొక వ్యాసం **'రబ్బానవాజ్ ఖాన్'.** ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ స్థాపించిన సంస్థ **'ఖాన్ ఖుదై ఖిద్మత్ గర్స్'.** ఈ సంస్థ తరపున గఫార్ ఖాన్ పుట్టిన ఊరు **'ఉత్మంజయ్'** లో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. ఈ బహిరంగ సభలో బ్రిటీషు సైనికుల తూటాలకు ఎదురొడ్డి నిలవలేక పారిపోతున్న జనాలలోని పిరికిని పటాపంచలు చేసి వారిని వీర సింహాలుగా తిరిగి సభా ప్రాంగణానికి రప్పించిన రబ్బానవాజ్ అనే మహిళ గుండెధైర్యాన్ని ఈ వ్యాసం అక్షరబద్ధం చేసింది. ఈ వ్యాసం చదివిన వారి గుండెనిండా దేశభక్తి, త్యాగ భావన పరుచుకుంటాయని చెప్పకనే చెప్పవచ్చు.

బెలూచిస్తాన్ నుండి చిత్రాల్ వరకు గల భూభాగం ముస్లీం పఠాన్ లకు ఆవాసంగా ఉన్నది. ఆ ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నిస్వార్థంగా పాకిస్తాన్ ముందుంచారు. అతని ఆదర్శ భావాలను, దేశభక్తిని ఖాతరు చెయ్యకుండా అతన్ని దేశద్రోహి కింద లెక్కగట్టి జైలుపాలు చేసిన ఘటనలు అనేకం **'పాక్ జైల్లో సరిహద్దు గాంధీ జీవితం'** అన్న వ్యాసం పాఠకుల ముందుంచుతుంది. ఈ వ్యాసం చదివిన వారి గుండెలు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ తరపున ఫిరంగులై పేలతాయి. భావ తరంగాలు నిప్పు కణికలై అక్కడి అధర్మ ప్రభుత్వాలను నిరసిస్తాయి.

గాంధీజీకి స్త్రీల పట్ల, వర్ణాశ్రమ ధర్మాలపట్ల, అస్పృశ్యత నివారణ పట్ల, గోరక్షణ పట్ల గల నిబద్ధత, అంకితభావంతో కూడిన ఆయన జీవన విధానం **"గాంధీజీ– హిందూ ధర్మం"** అనే వ్యాసంలో చూస్తాం. 'దసరా' పండుగకు సంబంధించి, దేవి నవరాత్రుల వైశిష్ట్యం గురించిన వ్యాసాలు శ్రీదేవి వైభవాన్ని కండ్లకు కదతాయి. కోణార్క్ సూర్యదేవుని మందిర నిర్మాణం వెనక ఉన్న ఆసక్తికర అంశాలు భారతీయుల శాస్త్రీయ దృక్పథాన్ని తెలియజేస్తాయి. ఇట్లా పదిహేను వ్యాసాలు దేనికవే ప్రత్యేకమై సరికొత్తగా ఆలోచింపజేస్తాయి. భారతీయ వైదిక, శాస్త్రీయ, వైజ్ఞానిక జ్ఞానాన్ని పరిచయం చేస్తాయి.

సాహిత్య వ్యాసాలు పదిహేను. ఇవి భిన్నాంశాల సమాహారం. ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని అర్థం చేసుకోలేక, అందులోని సమాజ హితభావనను పట్టుకోలేక పాశ్చాత్య ఇజాల పేరుతో కుప్పిగంతులు వేసేవారికి 'నవభారతి' శీర్షికన రాసిన వ్యాసంతో చెక్ పెడతారు. కృష్ణశాస్త్రి కవితా వైభవాన్ని, వ్యక్తిత్వ సౌరభాన్ని **'కృష్ణపక్షము–ఒక సమాలోచన'**గా, దేశపు ప్రస్తుత స్థితిగతులను, వైషమ్యాలతో దేశ సంస్కృతీ లతకు చీడల్లా పట్టి విఘాతం కలిగిస్తున్న విద్వేషకారుల చర్యలను అక్షరాలతో నిరసించిన ముదిగొండ శివప్రసాద్ కవితా సంపుటి **'అగ్నిగర్భ'** లోని **'ఉభయ సంధ్యలు'**కవితా గర్భీకృతాంశాలను మనముందుంచుతారు. పాఠ్యపుస్తకాలో రచయితలచే రాయబడ్డ భావ దోషవాక్యాలు తరాలను బలిచేయాడాన్ని సోదాహరణంగా **'పాఠ్యపుస్తకాలలో దోషాలు'** లో నిరూపిస్తారు. అంతేకాదు ఇరివెంటి **'కవి సమయములు',** కె.వి.రమణాచారి **'పద్యకవిత్వం–వస్తు విశ్లేషణ'** సిద్ధాంత గ్రంథాల అంతరంగాన్ని, ముక్తేవి భారతి, వెంపటి కుటుంబ శాస్త్రి, హరిహరనాథ్, రామశేషయ్య, మాలతీ చందూర్, గుత్తికొండ

సుబ్బారావు వంటి ఉద్దండ పండితుల సాహిత్యాన్ని, వ్యక్తిత్వ పరిమళాన్ని రచయిత మనకు పంచుతారు. రచయిత తాను చదువుకొన్న ఉన్నతపాఠశాల, పాలెం ప్రాచ్యకళాశాల అధ్యాపకుల వైశిష్ట్యాన్ని గురించి రెండువ్యాసాలు నిత్యానందరావు నేపథ్యాన్ని, కృతజ్ఞతాశీలాన్ని చాటుతాయి. ఇలా బహుళ భాగాలుగా, భిన్నాంశాల సమన్వితమై సృజనానందాన్ని కలిగిస్తుంది ఈ గ్రంథం. ఈ సంపుటంలోని ముప్పాతిక భాగం రచనలు రచయిత డిగ్రీస్థాయిలో రాసినవి కావడంగమనార్హం.

ఈ గ్రంథానికి **'తీరని దాహంతో తీరం వెంబడి'** అనే విలక్షణమైన శీర్షికతో డా. అమ్మంగి వేణుగోపాల్, **'నిత్య సత్యాల పరిశోధకుడి సృజనానంద హేల'** పేరుతో డా. ఎస్. రఘుగారలు అమూల్యమైన పీఠికలు రాయడం విశేషం. ఈ గ్రంథ రచయిత హృదయ విశాలతను వ్యక్తపరుస్తూ **'విస్ఫార వినమ్ర కాంతులు'** అనే శీర్షికతో 'ఎలనాగ' రాసిన కవిత రచయితగా ఎంత ఎదిగినా సాహిత్య సాగరగర్భంలో వ్యాసగంగై ఒదిగిపోయే వెలుదండ వారిని హిమాలయంగా చేసి పాఠకుల ముందు నిలబెడుతుంది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. సృజనానందం (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం)
2. అనుభూతి–అన్వేషణ (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం)
3. పరిశోధక ప్రభ (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం)
4. వ్యాస శేముషి (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం)
5. నిత్య వైవిధ్యం (వ్యాస సంపుటి)–ఆచార్య వెలుదండ నిత్యానందరావు
6. నిత్యానుశీలనం–ఆచార్య వెలుదండ నిత్యానందరావు
7. శతవాసంతిక ఉస్మానియా విశ్వవిద్యాలయం శతాబ్ది సంబరాల జ్ఞాపిక) వ్యాసాల సంకలనం.

❖ ❖ ❖ ❖ ❖

## ఒక లేఖ – సూచన

పరిశోధన వ్యాసం, వ్యాసం రాయడంలో మెలకువలను, లేదా మూసీ పత్రికకు వ్యాసం, వ్రాయవలసిన రీతిని మూసీ సంపాదకులు చెప్పడం ఆహ్వానించదగిన పరిణామం. శాస్త్ర సాంకేతిక రంగాలలోని కొన్ని పత్రికలు తమ పత్రికకు వ్యాసం రాయడానికి అనుసరించవలసిన (సైటేషన్) citation పద్ధతులను పేర్కొంటూ ఉంటాయి. మూసీ పత్రిక పరిశోధన వ్యాసంలో సాధారణంగా అనుసరించవలసిన పద్ధతులను పేర్కొన్నది.

ఉపయుక్త గ్రంథ సూచి నియమానికి ఉదాహరణకు మధ్య సవరణ అవసరం. అది అన్వయ లోపం తప్ప మరేమీ కాదు. ఉల్లేఖనాలను సూచించే విషయంలో కొంచెం వివరణ అవసరమని భావించి ఈ లేఖ....

పాద సూచికలు ఆధార గ్రంథాల నుంచి తీసుకున్నప్పుడు (ఆం.మ.భా.ఆది.ఆశ్వాస.235) అన్న రీతిలో బాగుంటుంది. సిధారెడ్డి కవిత్వంపై పరిశోధన చేసే పరిశోధకుడు కవితా సంపుటి పేరు, కవిత పేరు, సంవత్సరం, పుట అక్కడే బ్రాకెట్లో ఇస్తాడు. మరొకరి వ్యాసాన్ని తీసుకొని అక్కడ చెప్పే సందర్భంలోనూ ఇదే విధానాన్ని అనుసరించవచ్చు.

అయితే ఇటీవలి కాలంలోని వ్యాసాలలో శలాక రఘునాథ శర్మ భారత ధ్వని దర్శనంలో ఈ విధంగా అన్నారు అన్న వాక్యం ఉండి దాన్ని వ్యాసంలో చెప్పిన తరువాత, బ్రాకెట్‌లో రచయిత పేరు, పుస్తకం పేరు సంవత్సరం, పుట జోడించి పాద సూచికలో ఇస్తున్నారు. దీన్ని పరిహరించడానికి పదాల సంఖ్య పరిమితులను సూచించవచ్చు.

పాద సూచికలో ఇప్పుడు కేవలం తాము ఉదహరించిన ఎక్కడివో చెప్పడమే ప్రధానంగా కనిపిస్తుంది. వ్యాసంలో అవసరం లేని విషయ వివరణకు ఆటంకంగా ఉన్నవి. మరింత అదనపు సమాచారం ఇవ్వవలసినవి. పాద సూచికలలో ఇచ్చే పద్ధతి తెలుగు పరిశోధన గ్రంథాలు / వ్యాసాలలో పూర్తిగా మృగ్య మయింది. ఉదాహరించిన వాక్యం ఎక్కడిదో చెప్పేటప్పుడు పుస్తకం పేరు, సంవత్సరం, పుట ఇవ్వడం ఒక పద్ధతి కాగా, రచయిత పేరు, సంవత్సరం, పుట ఇవ్వడం రెండవ పద్ధతి. APA పద్ధతి రెండవ దానికి, MLA పద్ధతి మొదటి దానికి అనుకూలంగా కనిపిస్తుంది. రచయిత పేరు, పుస్తకం పేరు, సంవత్సరం, పుట అంతా పాదసూచికలో అవసరం లేదు. రచయిత లేదా పుస్తకం మాత్రమే తీసుకొని సంవత్సరం, పుట చెబితే చాలు. దీనిని వ్యాస రచయితలకు సూచించవచ్చు.

**– డా. సిహెచ్. లక్ష్మణచక్రవర్తి**

# మహాభారతం: 'ధర్మ' ప్రశ్నలు – 'భీష్మ' సమాధానాలు–8

**డా. అట్టెం దత్తయ్య** , సహాయాచార్యులు, ఎస్వీ కళాశాల, ఢిల్లీ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9494715445

'మాట'ను సాహిత్య గ్రంథాలలో పదునాలుగు విధాలుగా వాడినట్లు కనబడుతుంది. అర్థాలను గమనిస్తే... 'వాక్యము' **"మాటన వాక్యమై యొసగు..."** (ఆం.భా. 1.111) 'సందేశము' **"కృష్ణు జూచిన న్ననమరవిభుడు, పనిచె నీకొక్క మాట చెప్పంగ ననియె..."** (ప్రభా. 216) 'విషయము' **"నీవాప్పుడవు గావున నొక్కమాట యడిగిన..."** (హర. 4.22) 'హితోక్తి' **"అని యనేక ప్రకారంబుల బోధించిన తల్లి మాటలు చెవులు సోకనీక..."** (కాశీ. 4.98) చరిత్ర, నింద, వాగ్దండం, తిట్టు, వివాదం, లోకోక్తి, సూక్తి, శాస్త్రయుక్తి, ఆజ్ఞ, ప్రతిజ్ఞ, ప్రార్థన' మొదలైన అనేక అర్థాలతో 'మాట'ను వాడుతుంటారు. అంటే మాటే అన్ని రకాలుగా చక్రం తిప్పుతుందని తెలుస్తుంది. ఇట్లాంటి 'మాట'ను 'దానం'తో పోలుస్తూ ధర్మరాజు ఒక ప్రశ్న వేసాడు.

ప్రశ్న : **"దానం, ప్రియభాషణం అనే రెండింటిలో ఏది ఎక్కువ ప్రీతి కలిగిస్తుంది?"** (అను. 4.381)

సమాధానం : ధర్మరాజు ప్రశ్నకు భీష్ముడు ఒకే మాటలో **'ఆ రెండు మంచి పద్ధతులే, అవతలివారి తీరెరిగి నడవాలి'** అని సమాధానం చెప్పాడు. దానం ప్రీతికరమైందని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. మంచి మాటల గురించి తెలిపే కథ ఒకటి చెపుతాను వినుమని మొదలుపెట్టాడు.

బుద్ధిమంతుడైన ఒక బ్రాహ్మణుడు వుండేవాడు. ఏదో పనిమీద అడవికి వెళ్ళాడు. అది జన సంచారం లేని అడవి. భయంకరమైన రాక్షసుడు అతణ్ణి తినడానికి పట్టుకున్నాడు. ఆ బ్రాహ్మణుడు మంచిమాటలు ప్రయోగించేవాడై, ఏవిధమైన కలతపాటు లేకుండా ఆ రాక్షసుడి మొగం చూస్తున్నాడు. ఆ బ్రాహ్మణుడి ధైర్యం చూసి, అతడి ఉదాత్తభావం గమనించాడు. సంతోషించి రాక్షసుడు ఇలా అన్నాడు.

**"ఇదిగో, బాపనయ్యా! నేను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పావా, నిన్ను వదిలేస్తాను. లేదా, నీమాంసం తింటాను"** అని **'నా శరీరం కృశించిపోవడానికి, వెలవెలబోవడానికి కారణం ఏమిటి?'** అని అడిగాడు.

రాక్షసుడి ప్రశ్న విన్న బ్రాహ్మణుడు తొందరపడకుండా కొంతసేపు విచారించాడు. తర్వాత ఇలా అందుకున్నాడు.

"మహాపురుషా! దయాపరులు, ఉత్తములైన మీ వంటి వారు అడిగినప్పుడు తోచినవిధంగా చెప్పడంకంటే మేలు ఏముంటుంది నాకు? చెపుతాను విను.



నీ చెడ్డతనం వల్ల చుట్టాల్ని ఎడబాసి పశ్చాత్తాపపడినపుడూ; పేదరికం వచ్చి ధనం కావాలని తాపత్రయ పడినపుడూ; మొగమాటం వల్ల ఇతరుల చేత చిక్కిపోగా నిన్ను గెలిచానని అతడు చంకలు గుద్దుకున్నపుడు; తగినవాడనుకొని వొకరికి నువ్వు మేలు చేస్తే అది తన పౌరుషం వల్లే జరిగిందని అతడు బడాయి చెప్పుకున్నప్పుడూ; దుర్మతులు నీ గుణాలు పొగిడి, బుద్ధిమంతులు పొగడకుండా వుంటే నువ్వు సిగ్గుపడినప్పుడూ శరీరం చిక్కిపోతుంది. వెలవెలపోతుంది.

ఇంతేకాదు తగువిధంగా మాటలు సభలో పలికినపుడు అంగీకరించకపోవడం, నీ భార్యకి నీ తప్పు తెలిసిపోయి ఆమె బాధ పడినప్పుడు ఆమెని నువ్వు ఓదార్చకపోవడం, నీ ధనం ఇతరులు దోచుకోవాలని చూస్తున్నపుడు దాన్ని రక్షించుకోవాలని భావించక పోవడం, నీచుడు నిన్ను దూషిస్తూంటే అది నిజమే అని నీ బంధువులు భావించడం, నువ్వు చేస్తున్న మంచిపనులు చూసి నీ స్నేహితులు అదంతా మాయ అని భావించడం, దుఃఖం, సంపద, గౌరవం కలిగినపుడు వాటిని వెలిబుచ్చలేకపోవడం వీటిలో ఏ ఒక్కటి కలిగినా కూడా శరీరం చిక్కిపోతుంది. వెలవెలపోతుంది.

భార్య, కొడుకు, అల్లుడు మంచి నడవడి లేనివారై తిప్పలబెట్టడం, తల్లీ తండ్రీ అన్నదమ్ములూ రోగాలతో బాధపడినా, వెనకజన్మలో హత్యలు చేసినా, దుర్బుద్ధితో ఇతరుల ధనాన్ని అపహరించినా, కష్టార్జితమైన ధనం వ్యర్థంగా పోగొట్టుకున్నా, బంధువులు కాలం చేసినా, మొగమాటపడి దుర్మార్గుడికి సాయంచేసి తన కీర్తికి కళంకం తెచ్చుకున్నా, ఎంతో కాలం కష్టపడి ప్రయత్నపూర్వకంగా చేసినపని ఒక్క పొరపాటుతో పగవాడితో పాడైపోయినా శరీరం చిక్కిపోతుంది" అని చెప్పాడు.

బ్రాహ్మణుడి మంచిమాటలు విన్న రాక్షసుడు సంతోషించాడు. మెచ్చుకున్నాడు. ఇలా వుంటుంది మంచిమాటల మహిమ అని భీష్ముడు తెలియచేసాడు.




ధర్మరాజు ప్రశ్నలో రెండింటిని పోల్చి అడిగాడు అంటే వాటిలో సమాన ధర్మాలున్నాయని గమనించాలి. దానం వల్ల ఎదుటి వారిని తృప్తి పరచగలం. కొన్నిసార్లు మంచిమాట గొప్ప దానం కంటే కూడా ఎక్కువ తృప్తినిస్తుంది. కొన్ని రకాల బాధల్లో ఉన్నవారికి దానం కంటే మంచి మాటలే అవసరం. కొన్ని విషయాలలో భయపడుతున్న వారికి ఏమి దానం ఇచ్చిన సంతోషించరు, కాని ధైర్యం అందించే నాలుగు మాటలకు తృప్తిపడుతారు.

ఏదైనా అవసరం ఉన్నవారే ఇతరుల నుండి ఆశిస్తారు. అందులో శారీరక అవసరం ఉన్నవారు దానాన్ని పొందగోరుతారు. మానసిక అవసరం ఉన్నవారు మంచిమాటలను ఆశిస్తారు. భీష్ముడు చెప్పిన కథలో రాక్షసునికి మనసులో కలిగిన ప్రశ్న మాటలతో తప్ప వరాలతో తీరేదికాదు. కొన్నిసార్లు కొన్ని మాటలు ఎంత ధనానికైనా సరితూగవు.

మనిషి జీవితంలో పొందవలసినవి ముఖ్యంగా మూడు. అవి ధనము, సుఖము, పరము (ముక్తి). ధర్మంతో ధనాన్ని సంపాదించాలి. ఆ ధనంతో సుఖాన్ని పొందాలి. చివరగా ముక్తిని పొందాలి. ఇవే చతుర్విధ పురుషార్థాలు. వీటన్నిటికి మూలం మాటలే. ఒక పద్యం ఈ విషయాలను స్పష్టంగా తెలియపరుస్తుంది.

**"మాటలచేత దేవతలు మన్నన జేసి వరంబులిచ్చెద**
**ర్మాటల చేత భూపతులు మన్నన జేసి ధనంబులిచ్చెద**
**ర్మాటల చేత కామినులు మన్నన జేసి సుఖంబులిచ్చెద**
**ర్మాటలు నేరకున్న నవమానము న్యూనము మాన భంగమున్"**
(అజ్ఞాతకవి)

దైవాన్ని ప్రార్థించడం కూడా మాటలే కదా. అదే మంత్రం, స్తోత్రం, నమకచమకాలు అంటూ రకరకాలుగా మాటలనే ప్రయోగిస్తున్నాడు మానవుడు. హిందువులు హరే రామా అని, ముస్లింలు అల్లా అని, క్రైస్తవులు హలేలుయ అంటూ కొన్నికొన్ని వారాలలో వారివారి ప్రార్థన మందిరాలలో మాట, పాటలతో ప్రార్థనలు, భజనలు చేస్తారు. నిజమే ఈ మాటను అభీష్టసిద్ధికి కార్యసాధనంగా మలచుకుని అన్నమయ్య, రామదాసు, త్యాగరాజు, కబీరులాంటి వారెందరో భగవంతుని అనుగ్రహం పొందారు. ఇది చారిత్రక ఆధారాల విశేషాంశం.

మాటల వలన ధనాన్ని సంపాదిస్తారు. ఇప్పటి రోజులలో ఉద్యోగంలో చేరాలనుకున్నా చదువుతోపాటు చక్కని వాక్చాతుర్యం అవసరం. పెద్ద పెద్ద వ్యాపారాలలో కూడా చక్కగా మాట్లాడ గలిగినవారే (Communication skills) ముందుకు దూసుకుపోతున్నారు. అంతేకాదు రాజకీయవేత్తలు చాలామంది చక్కగా మాట్లాడే నైపుణ్యం కలవారే ప్రజా రాజకీయాలలో రాణించారు. రాణిస్తున్నారు.

సుఖాన్ని పొందడానికి కూడా మాటలే చాలా అవసరం. తల్లిదండ్రుల, మిత్రుల ప్రేమను నోచుకోవడానికి మృదుభాషణం అవసరం. దాంపత్య జీవనంలో కూడా చక్కని మాట వైఖరి ఎంతో ముఖ్యం. అది సుఖదాయి, కుటుంబ వికాసానికి దోహదకారి. ఎంత చదువుకున్న వారైనా, ఎంత సంపాదిస్తున్న వారైనా సరే మాటల వల్ల జీవిత భాగస్వామితో తేడాలు వచ్చి మాటామాటా పెరిగి సంసారాలు ఛిన్నాభిన్నమౌతున్నాయి. మొత్తంమీద మంచి మాటల ద్వారానే పురుషార్థాలను సులభంగా పొందవచ్చు అనే విషయం అత్యంత వాస్తవం. ఇదే సత్యాన్ని వేమన కూడా బోధించాడు.

**"వాక్కు వలన గలుగు పరమగు మోక్షంబు**
**వాక్కు వలన గలుగు వరలు ఘనత**
**వాక్కు వలన గలుగు నెక్కుడైశ్వర్యంబు**
**విశ్వదాభిరామ వినుర వేమ! "**

మనిషి తన అవసరార్థం మాటలను నేర్పుతో జాగ్రత్తగా వాడుతుంటాడు. ఈ మాటలు ఇంపుసొంపులవల్ల మనిషికి ఆభరణంగా నిలుస్తుంటాయి. ఈ విషయాన్ని భర్తృహరి "కేయూరాణి న భూషయన్తి..." అనే రమణీయమైన శ్లోకంలో ఇలా చెప్పాడు. **"బంగారు హారాలు ధరించడం, సిగలో పూలు పెట్టుకోవడం, సుగంధ ద్రవ్యాలు వాడటం, పన్నీటితో స్నానం చేయడం మొదలైనవి మానవునికి అలంకారాలు కావు. సంస్కారవంతమైన మాట మాత్రమే నిజమైన అలంకారం.''** మిగిలిన అన్ని అలంకారాలు నశించిపోయేవే. వాక్కు మాత్రం వన్నె తరగని, చెదరని అలంకారం. అన్ని మాటలూ మనిషి అవసరాలను తీర్చవు. సంస్కారవంతమైన మాటలు మాత్రమే తీర్చగలవు. ఈ మాట రూపాంతరం చెంది వచనం, కవిత్వం, పాట, గేయం, పదంగా మారుతుంది. మాట లేనినాడు మనిషికి వినోదం లేదు. సంస్కృతి లేదు. ఆచారం ఉండదు. ఇదే భావన్నే ఈ కింది కవితా పంక్తులు విశదం చేస్తున్నాయి.

**"మాటల కోటలు గట్టి / మహారాజుగా మసలుతాడొకడు**
**మాట చేటలతో / మనసు చెరిగి పోతాడొకడు**
**మాటలు బాటలు వేస్తాయి / మాటలు పాటలు రాస్తాయి**
**మాటలు లేకపోతే / కవిత లేదు / గానం లేదు / నాగరికత లేదు**
**నవ్యత లేదు / జాగృతి లేదు / చైతన్యాకృతి లేదు**

**వెలుగును చూపించేది / విశ్వాన్ని నడిపించేది / వాక్శక్తి వాగ్గ్రక్తి"**
– *(వేముగంటి నరసింహాచార్యులు)*

మాటలు కొన్ని సమయాల్లో మనిషికి ప్రాణం పోస్తాయి. ఒంటరిగా ఉన్నప్పుడు పలకరింపు, పిలుపు, నిరాశలో ఉన్నప్పుడు ప్రేరణ, వైరాగ్యంతో ఉన్నప్పుడు ఆశ మొదలైన వాటిని రకరకాలుగా అవసరాలకు అందిస్తూ ధైర్యాన్ని నింపేవి మాటలు మాత్రమే.

ఈ ప్రశ్నలో వాడిన రెండు పదాలను కలిపి వాడుకుంటున్న పదం కూడా వాడుకలో ఉంది. అది వాగ్దానం. ఇక్కడ వాక్కును దానం చేయడం కాదు. మాట ఇచ్చుట. మాటిచ్చి తప్పేవారు కూడా ఉంటారు. మాట ఇవ్వడం అనేది ఎంత గొప్ప విషయమో, మాటిచ్చి తప్పడం అనేది ఎంత దుర్భరమైనదో భాగవతంలో గల బలిచక్రవర్తి కథలోని పోతన పద్యం తెలియజేస్తుంది.

**"బ్రదుక వచ్చుగాక బహుబంధనములైన**
**వచ్చుగాక లేమి వచ్చుగాక**
**జీవధనములైన జెడుగాక, పడుగాక**
**మాట దిరుగలేరు మానధనులు"** (భాగవతం. 8. 598)


బాగా బ్రతికినా, అనేక కష్టాలకు గురైనా, పేదరికం వచ్చినా, ప్రాణానికి, ధనానికి చేటు వచ్చినా, చివరకు చావు సంభవించినా సరే మానధనులు మాట తప్పలేరు అంటారు.

మొత్తంగా ధర్మరాజు ప్రశ్నలో గల దానం, ప్రియభాషణం రెండూ మహాప్రభావవంతమైనవి. భీష్ముడు ఏకవాక్యంలో చెప్పినట్లుగా అవతలివారి తీరెరిగి నడచుకోవాలి. నీ దగ్గర ఆశించేవారికైనా, నీవు ఆలోచించదలిచిన వారికైనా ఏమి కావాలి? వాక్కు సహాయమా? అర్థ సహాయమా? అని నిర్ధారించుకుని అందివ్వాలి. ఇచ్చేవారి దగ్గర ఏదుంటే అది ఇవ్వడం కాదు ఆశించేవారికి ఏమి కావాలనేది ప్రధానం. కొన్నిసార్లు లక్షాధికారులకు కూడా ఆపదలు వస్తాయి. వారికి కావాల్సింది ధనం కాదు. ధైర్యాన్ని, స్థైర్యాన్ని, శాంతిని అందించే మాటసహాయం కావాలి. ధనహీనులు కొన్నిసార్లు చుట్టూ మాటకార్లను కలిగి ఉంటారు. కాని వారికి కావల్సింది ధనం. ఒకదానితో మరొకదాని లోటు తీర్చడం అనేది అసాధ్యమైన విషయం. రెండూ వేటికవే ప్రత్యేకం.

★ ★ ★ ★ ★

దానంతో మరో రెండింటిని పోల్చుతూ అడిగిన ప్రశ్న ఒకటి కనిపిస్తుంది. దానానికి సరితూగేది మృదుభాషణం అని పైన సమాధానంలో తేలింది. మరి ఇంకా రెండు కూడా ఉన్నాయా? ప్రశ్నను చదివాకా నిజమే అనిపించింది.

ప్రశ్న: **విద్యా, తపస్సు, దానం అనే వాటిలో ఏది గొప్పది? దయచేసి తెలుపుము.** (అను. 4. 346)




దీనికి సమాధానంగా భీష్ముడు **'వ్యాసమైత్రేయ సంవాదం'** తెలియజేసాడు.

వ్యాసుడు ఒకసారి వారణాసీపురం వెళ్ళాడు. అక్కడ కొంత ముందునుండే మైత్రేయుడు నివసిస్తున్నాడు. అతడి దగ్గిరికి వ్యాసుడు అప్రకాశంగా వెళ్ళాడు. అతణ్ణి తెలుసుకున్నాడు మైత్రేయుడు. భక్తిపూర్వకంగా నమస్కరించాడు. పూజించాడు. ఉత్కృష్టమైన భోజనం పెట్టి తృప్తి పరిచాడు. సంతోషంతో కలకల్లాడుతున్న అతణ్ణి చూసి, **"వ్యాస మునీంద్రా! మీలో అధికమైన సంతోషం కనిపించింది. ఏమిటి దీనికి కారణం?"** అని గౌరవంగా అడిగాడు.

**"తపస్సూ, విద్యా మొదలైన ధర్మాల్లోకల్లా దానమే గొప్ప దయ్యా."** ఆదరంగా అన్నాడు వ్యాసుడు. **"దానమివ్వతగిన వస్తువులన్నిటిలోనూ అన్నమే గొప్పది. ఏమంటే, ప్రాణమూ, శరీరమూ, బలమూ అన్నీ అన్నమయమే. అందుకే పండితులు అన్నమే మహనీయమైందని భావిస్తారు"** అన్నాడు.

**"తపస్సు మనస్సులోని కల్మషం కడిగేస్తుంది; విద్యకి ఆస్పద మవుతుంది. తపస్సు చేసినవాడు ఉత్తమదానంతో పరిపక్వమైన విద్యనీ, తపస్సునీ మెచ్చుకుంటాడు. కాబట్టి, తపస్సూ, విద్యా దానంవల్లే వర్ధిల్లుతున్నాయి. ఉత్తమ వ్రతదీక్షాపరులు భగవంతుణ్ణి దర్శించడానికి దీపం వంటిది విద్య. అట్లాంటప్పుడు అన్న దానం అధిక సంతోషం కలిగించకుండా ఎలావుంటుంది! అతి కలుష చిత్తుడైనా మహత్తరమైన దానం వల్ల విశుద్ధభావం పొందుతాడు. సందేహం లేదు"** అని తెలిపాడు. 'ధర్మారాజా! తపమూ, విద్యా దేవతలు కూడా పూజించదగినవి. వాటికి పోషకమైంది దానం.' అని భీష్ముడు తెలియచెప్పాడు.

ఈ సమాధానం మూడింటికి తగు ప్రాధాన్యం ఉన్నట్లుగా తెలియజేస్తుంది. 'విద్యా హి కా బ్రహ్మగతి ప్రదా...' (ప్రశ్నోత్తరి. శ్లో. 11) బ్రహ్మతత్త్వమును ప్రాప్తింపచేయునది నిజమైన విద్య అంటాడు శంకరాచార్యులు. భగవద్గీత కూడా ఆధ్యాత్మిక విద్యనే విద్య అంటుంది. హితోపదేశంలో అన్నిటికి మూలం విద్యనే అని విశదపరుస్తుంది.



**"విద్యా దదాతి వినయం, వినయాద్యాతి పాత్రతామ్
పాత్రత్వా ధ్ధన మాప్నోతి, ధనాధ్ధర్మం తతస్సుఖమ్"** (హితో. 1-6)

విద్యవలన వినయాన్ని, వినయం వల్ల పాత్రతను, అందు మూలాన ధనాన్ని, ధనం వల్ల సుఖాన్ని పొందుతారు అని శ్లోకభావం.

తపస్సు అంటే ఏమిటో తెలిపి, తపస్సు మాహాత్మ్యాన్ని గురించి భారతం వేరువేరు చోట్ల చక్కగా వివరించింది. 'తపస్సంటే కేవలం ఆధారాది నియమాలతో శరీరాన్ని శుష్కింపజేయడం, ముక్కుమూసుకొని ధ్యానం చేయడం మాత్రమే కాదు. ఇంద్రియ నిగ్రహం, దయ, అహింసాది సద్గుణాలతో నడుచుకోవడం తపస్సు.' (శాంతి. 2-346-348). 'తపస్సే ధర్మాలన్నిటికి మూలమైంది. వ్రతాలాచరించే వారు పండ్లు కందమూలాలు ఆహారంగా స్వీకరిస్తూ నీళ్ళు త్రాగుతూ తపోవృత్తితో సంతృప్తిగా జీవిస్తారు. తపోజీవనంలో సత్యం, శుచి మొదలైనవి అలవడతాయి. తపస్సు వలన పంచ పాతకాల్లాంటి మహా పాపాలు కూడా నశిస్తాయి. సకల కార్యాలు ఫలిస్తాయి. అందుకే అన్ని శక్తుల కంటె తపశ్శక్తి గొప్పదని పెద్దలు చెపుతారు. (శాంతి. 3-413-415). ఒక శాస్త్రగ్రంథం ఈ రెండింటి వల్లనే విజ్ఞానవంతులు మోక్షాన్ని పొందుతారు అని తెల్చిచెపుతుంది.

**"తపో విద్యా చ విప్రస్య, నిశ్శ్రేయసకరం పరం
తపసా కల్మషం హంతి, విద్యయాఽమృత మశ్నుతే"**
(మను. 12-104)

తపస్సు, విద్య యను నీ రెండును విజ్ఞానవంతులకు ఉత్తమమైన మోక్షసాధనాలు. తపస్సుచే కిల్బిషాలు నశింపచేసికొని, విద్యచే అమృతత్త్వము నొందుతారని ఈ శ్లోకం తెలియజేస్తుంది.

ధర్మరాజు ప్రశ్నలో అడిగిన మూడు పదాలను పరాశర స్మృతి మూడు యుగాలను ఒకొక్క పదాన్ని మోక్షమార్గంగా వివరించింది.


**"తపఃపరం కృతయుగే, త్రేతాయాం జ్ఞాన ముచ్యతే
ద్వాపరే యజ్ఞ మిత్యాహుః దానమేవ కలౌ యుగే"** (పరాశరస్మృతి)

కృతయుగమున తపస్సు, త్రేతాయుగమందు జ్ఞానం(విద్యా), ద్వాపరయుగమందు యజ్ఞం, కలియుగమున దానమును ఉత్కృష్టమైనవి అని భావం. ఈ శ్లోకం ప్రకారం మూడు పదాలు సమానార్థకాలే. కాని కాలాంతరంలో రూపాంతరాలుగా వినియోగించారు. మూడు సమానమైనవే.

ధర్మరాజు అడిగిన ఈ రెండు ప్రశ్నలవల్ల దానంతో పాటు మృదుభాషణం, తపస్సు, విద్యలు కూడా విశేషమైనవి అని విశదపరిచాడు. తపస్సు చేసేవారు వారి గుణాలను, కోరికలను, ఇంద్రియాలను అదుపులో పెట్టుకుంటారు. విద్యావంతులు కూడా. వీరు మాత్రమే ప్రియంగా, శాంతగా, మృదువుగా మాట్లాడగలరు. ఇతరులకు ఏదైనా సహాయం, దానం చేయడానికి వెనుకాడరు. మొత్తంగా ఇవన్నీ ఒకదానికి ఒకటి ముడిపడి ఉంటాయి. వీటన్నిటిని సమపాళ్లలో వున్నవారు మహానుభావులు. ఆదర్శనీయులు.

**ఆధార గ్రంథాలు :**

1. అప్పలస్వామి, పురిపండా. '**వ్యావహారికాంధ్ర మహాభారతం**' (శాంతి పర్వము). 1976. రాజమండ్రి: ప్రాచీన గ్రంథావళి.
2. కమలాకరశర్మ, సాగి. '**దానం – విధానం**'. 2013. హైదరాబాద్ : వేద సంస్కృతి పరిషత్.
3. నిర్వికల్పానంద, '**శ్రీమద్భగవద్గీత**' (పదచ్ఛేద టీకాతాత్పర్య సహితం). 2010. హైదరాబాద్ : రామకృష్ణమఠం.
4. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. శ్రీనివాసులు, సూరం. సంపా. '**శ్రీమహాభారతము**' (అన్ని పర్వాలు, 7 సంపుటాలు). 2018. గోరఖ్‌పూర్: గీతాప్రెస్.
5. విశ్వేశ్వర శాస్త్రి, జన్నాభట్ల. సంపా. '**మహాభారత వైజయంతి**' (తొమ్మిది సంపుటాలు). 2006. గుంటూరు : భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.
6. సుబ్రహ్మణ్యం, జి.వి. సంపా. '**కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతము**' (అన్ని పర్వాలు, 15 సంపుటాలు). 2014. తిరుపతి: తి.తి.దే.
7. హనుమంతరాయ శర్మ, బలభద్రపాత్రుని. '**మహాభారత విమర్శనము**' (రెండు సంపుటాలు). 1996. గుంటూరు: భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్.



# ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యము – చమత్కారాలు

**డా. డి. ప్రవీణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, భీమునిపట్నం. ఫోన్ : 92904 41535

**వ్యాస సంగ్రహము**

ధూర్జటి రచించినటువంటి శ్రీకాళహస్తి మాహాత్మ్యములోని చమత్కారాలను ఈ పరిశోధన వ్యాసంలో కొంతవరకు తెలియజేయ ప్రయత్నం.

చమత్కారం అనేది కావ్య స్రవంతిలో బహువిధాలుగా గోచరిస్తూ ఉంటుంది. చమత్కారం చర్చను సంస్కృత అలంకారికులు విస్తృతంగా చేశారు. వారిలో క్షేమేంద్రుడు తన కవి కంఠాభరణంలో దశ విధ చమత్కారాలను పేర్కొన్నాడు. నిర్మాణాత్మక పద్ధతిలో ఈ పరిశోధనా పత్రాన్ని రాయడం జరిగినది.

**పరిచయము**


అభినవ గుప్తుడు **'చమత్కారమంటే నిరాఘాటమైన ఆనందాన్ని కలిగించేదని కావ్యాస్వాదన వేళలో కలిగే వణుకు, గగుర్పాటు ఉల్లాసాది వికారము కూడా చమత్కారమే'** అన్నాడు. ఔచిత్యవాదియైన క్షేమేంద్రుడు **'ఔచిత్యస్య చమత్కార కారిణ: చారుచర్వణే రసజీవిత భూతస్య విచార: క్రియతేధునా'** రసానికి కూడా జీవితం వంటిది ఔచిత్యం అదే చమత్కారాన్ని కలిగిస్తుందన్నాడు. క్షేమేంద్రుడు తన కవి కంఠాభరణంలో దశ విధ చమత్కారాలను పేర్కొన్నాడు. ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యములోని చమత్కారాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

**1. అవిచారిత రమణీయకము**

కవులు పేర్కొన్న కొన్ని సంగతులు వాస్తవ జగత్తులో సత్యదూరాలు. నదులకు సముద్రుడు భర్త. కమలాలకు సూర్యుడు ప్రియుడు. కవులకు చంద్రుడు చెలికాడు. పాములకు వాయువే ఆహారం. చాతక పక్షి స్వాతి నక్షత్రంలో చినుకులనే తాగుతుంది. చకోరాలు వెన్నెల తింటాయి. హంసలు మానససరోవరంలో ఉంటాయి వంటివి కవి సమయాల వలన కలిగే చమత్కారాలన్నీ అవిచారిత రమణీయకాలే. శ్రీ కాళహస్తి మాహాత్మ్యములో...

**"ఎక్కడి దుర్మదుండొ, తనకే నొనరించిన రత్న పూజనల్**
**దిక్కుల బాఱజల్లి, జగతీరుహ శాఖలు దమ్మి కాడలున్**
**బెక్కులు గొంచువచ్చి పయిబెట్టిన నూరక యుండె శంకరుం**
**డక్కట! యేమి సెప్ప ! నహహా ! పగవారిని గూడె దైవమున్"**

ఎక్కడి ధర్మం కలవాడు శివుడికి నేను చేసిన రత్నాల పూజలను దిక్కుల పారజల్లి, చెట్ల కొమ్మలను తామర కాడలను తెచ్చి తన మీద పెడితే శివుడు మౌనంగా ఉంటాడు. ఏమని చెప్పేది? శివుడు కూడా శత్రువులతో చేరాడు అని సర్పం విషాదంలో మునిగిపోతుంది.



పద్యంలో ఎక్కడా కాఠిన్యం లేదు. సులభంగా ఆ పాము యొక్క ఆవేదన అర్థమవుతుంది. సాధారణంగా కోపాన్ని ప్రదర్శించే సందర్భాల్లో దీర్ఘ సమాసాలను ప్రయోగించడం పరిపాటి. కానీ ధూర్జటి సర్పం అలతి అలతి పదాలతోటే దుక్కించింది.

పాము పూజించి వెళ్ళిన తర్వాత శివుని పూజించడానికి వచ్చిన ఏనుగు శివుని మీద రత్నాలను చూసి...

**"అచ్చపు నీలవర్ణ దృషదావళి నల్లని కల్వలే? కదుం**
**బచ్చని రాలు బిల్వ నవ పత్రములే ? యరుణాశ్మ భంగముల్**
**విచ్చిన యెఱ్ఱదామరలె ? విశ్వపతీ ? విరసోపలంబు లె**
**ట్లచ్చుదలయ్యె నీకు ? నవి యందునె గంధ మృదుత్వ శైత్యముల్"**

ఈశ్వరా! నల్లనిరాళ్ళు నల్లకలువలవుతాయా? గరుడపచ్చలు లేత బిల్వపత్రాలు అవుతాయా? కెంపు తునుకలు ఎర్ర తామర లవుతాయా? రసహీనమైన రాళ్ళు నీకు ఏ విధంగా నచ్చాయి? అవి పరిమళాన్ని, మార్దవాన్ని, చల్లదనాన్ని కలిగించలేవు కదా! అని ఏనుగు తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది. ధూర్జటి మాధురీ మహిమకు ఈ పద్యం ప్రభలోదాహరణం. ఏ మాత్రం అర్థ విచారం చేయకుండానే అవగతమయ్యే అవిచారిత రామణీయక చమత్కారమైన పద్యం ఇది.

**2. విచార్యమాన రమణీయ చమత్కారం**

దశవిధ చమత్కారాలలోనూ బుధజన ప్రీతి పాత్రమైనది విచార్యమాన రమణీయ చమత్కారం. దీనిని సమర్థవంతంగా నిర్వహించేటప్పుడే ఆ కవి అమరుడై, పద్యం అమృతమై నిలుస్తుంది. పద్య భావాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకోవాలంటే శాస్త్రీయ, ఇతిహాసిక, పౌరాణిక, చారిత్రక సంబంధమైన నేపథ్యంలో లోక



వ్యవహారాన్నో, కావ్య మర్యాదనో ఆసరా చేసుకోవాలి. ఈ చమత్కారం కవికి గల బహుముఖ పాండిత్యాన్ని వెల్లడిస్తుంది.

అగస్త్య మహర్షి ఉగ్రతపస్సు చేస్తున్నాడు. తపస్సుకు కారణం ఎవరికీ అంతు పట్టలేదు. ఒక్క శివునికి తప్ప. శ్రీకాళహస్తి క్షేత్రంలో ఒక పుణ్యనదీ ప్రవాహం ఉండాలనేది అగస్త్యుని లక్ష్యం. ఇది తెలియక దేవతలతో సహా బ్రహ్మదేవుడు శంకరుని సన్నిధికి చేరాడు. వెళ్ళగానే బ్రహ్మకు స్వామిపాదాలు కనిపించాయి.

**"క్రోడాకారము దాల్చి పోత్రమున వైకుంఠుండు భూభేదన**
**క్రీడాలంపటుడయ్యు నీపదము వీక్షింపంగ లేడయ్యె నే**
**చూడంగంటి ఫలించె నా తపమటంచున్ మొక్కి కన్నీరు తో**
**డ్తోడన్ రెప్పలుచిప్పిలంగ పునరుక్తుల్ గాగ ప్రార్థించుచున్"**

శివరాత్రి లింగోద్భవ నేపథ్యం తెలిస్తేనే గాని ఈ పద్యంలోని చమత్కారం తెలియదు.

**3.సమస్త సూక్త వ్యాపీ**

చమత్కారం పద్యం అంతటా వ్యాపించి ఉంటే దాన్ని 'సమస్త సూక్త వ్యాపీ' అంటాం. ఈ చమత్కారాన్ని సాధించడం చాలా కష్టం. అర్థం, శబ్దం, రసం, అలంకారాది సమస్త సంబారాలను కలుపుకొని మొత్తం పద్యాన్ని చమత్కారంగా చెప్పాలి. పద్యం బిగువు సడలకుండా పఠితృహృదయాలను పరవశింపజేయాలి.

దక్షిణ కైలాస పర్వతం మీద శంకరుడు పార్వతీదేవితో విహరిస్తున్నాడు. ఆ పర్వతం మీద మున్యాశ్రమాలున్నాయి. బోయ పల్లెలున్నాయి. యోగాశ్రమాలున్నాయి. మేడలు కట్టుకొని నివసిస్తున్న సంపన్నులున్నారు. అన్ని ప్రదేశాలకు అమ్మవారితో కలిసి వెళ్తున్నాడు స్వామి. ఎక్కడ ఎలాగుండాలో అలాగే ఉన్నాడాయన.

**"శిష్టనీవార ముష్టింపచాశ్రమముల**
**మెలగు సంయమి గృహమేధియగుచు**
**కాంతారమధ్య పక్కణ విహారంబుల**
**జలుపు కిరాతసంసారియగుచు**
**సంతతాంతర్యాగ సాధకస్థలముల**
**నలరారు సిద్ధగృహస్థుడగుచు**
**లలిత చతుర్విధాలంకారములదాల్చు**
**నవభోగరత గృహనాథుడగుచు**
**మంచుగుబ్బలి రాజుకుమారి గూడి**
**వేలుపుల పెద్ద జముదెస వెండికొండ**
**తన్ను తెలిసినవారికి నన్నిదెసల**
**తానయనురీతి బహువేషధారియగుచు"**

మునీంద్రుల ఆశ్రమానికి వెళ్ళినప్పుడు భార్యాసహితుడైన మునీంద్రుడుగానే వేషం ధరించాడు. బోయపల్లెలకు వెళితే కిరాత సంసారిలాగా దర్శనమిచ్చాడు. యోగ సాధకుల సన్నిధికి వెళితే సిద్ధగృహస్థుడిలా అవతారమెత్తాడు. సర్వాలంకార సమేతమైన భవనాల్లో భోగాసక్తుడైన గృహనాథుడిలా ప్రబంధయుగ కావ్యాలు, చమత్కార ప్రస్థానం తోచాడు. ఎప్పటికెయ్యది ప్రస్తుతమో అప్పటికా వేషాన్ని హైమవతి కూడా ధరించింది. ప్రతిపాదంలోనూ చమత్కార ముంది. ఈశ్వరుడు తపస్సు చేశాడు కాబట్టి ఒకప్పుడు మునివేషంలో ఉన్నవాడే. అర్జునునికి పాశుపతాస్త్ర ప్రదానం కోసం కిరాతవేషం కూడా ధరించినవాడే. ఆయన యోగీశ్వరేశ్వరుడు. వలపించుకొని వలచిన భార్యతో మణి నిర్మితమైన హిమవత్కందర విహారములు చేసినవాడే. కాబట్టి ఆయన ధరించిన వేషాలన్నీ ఒకప్పుడు ధరించినవే. అన్ని సూక్తాలు చమత్కార భరితాలే.

**4. సూక్తైక దేశదృశ్యమానము**

ఎక్కడో ఒక పాదంలోనో, పాదార్థంలోనో చిన్న చమత్కారకార అంశం ఉంటుంది. దానివల్ల సమస్త విషయం విశ్వరూపం ధరించి సుబోధకమౌతుంది. ఆ చమత్కారాన్ని అంది పుచ్చుకోకపోతే అంతా నీరసంగా ఉంటుంది. ఇది నర్మగర్భ రూపంలోనూ, వ్యంగ్య రూపం లోనూ, సందేశరూపంలోనూ, లోకోక్తి రూపంలోనూ సాధారణంగా నిక్షిప్తమై ఉంటుంది. పన్నగ, గజముల భక్తికి పరీక్ష జరగబోతోంది. అందరికీ ఉత్కంఠ, సూర్యుడు కూడా ఆ ఉత్కంఠతోనే ఉదయించాడట.

**"పన్నగంబు గజము బలమునఁ జలమున**
**పోరుటెట్లొ ! శివుని పొందుటెట్లొ !**
**చూడవలయు ననుచు వేడుకతో వచ్చు**
**కరణి నంత దోచె కర్మసాక్షి"**

గజసర్పాలు ఎలా పోరాడతాయి. శివైక్యాన్ని ఎలా పొందుతాయి. అనే ఉత్కంఠతో సూర్యుడుదయించాడనడంలో విశేషం లేదు. చాలామంది కవులు కథాసందర్భంతో సూర్యోదయాస్తమయాలను కలగలపిన వర్ణనలు చేశారు.

ఇందులో విశేషణమేమిటంటే సూర్యునికి కర్మసాక్షి అనే విశేషణాన్ని ప్రయోగించడం. 'కరణి నంత దీవిని తరణి దోచె' అని వ్రాసినా పాదం అందంగానే వచ్చేది. కాని కర్మసాక్షి అనే పదప్రయోగం వల్ల ప్రకరణానికంతటికి అందం వచ్చింది. ఆయన కర్మసాక్షి. రేపెప్పుడైన ఋజువు కావాలంటే ఆయన సాక్ష్యం చెప్పాలి.

ఆయన లేకుండా ఏ కర్మ జరపకూడదు. పగలంతా కర్మలనాచరించి, రాత్రంతా కర్మలగురించి ఆలోచించి నిద్రపోవాలి. ఇది దైవనిర్ణయం. దుష్కర్మలు చేయడానికి రాత్రిపూటే వీలు. పగలు కర్మసాక్షి ఉంటాడు. దొరికిపోవడం నిశ్చయం. కాబట్టి ఇక్కడొక అపురూపమైన కర్మ జరుగబోతోంది. కర్మసాక్షి వచ్చాడు అనడం గొప్ప చమత్కారాన్ని కలిగిస్తుంది.

**5. శబ్ద గతము**

కవితాభ్యాసపు తొలినాళ్ళలో కవి శబ్దాడంబరానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు. సుదీర్ఘ సమాసాలు నిఘంటు పరిమిత పదాలు అనుప్రాసలు ప్రయోగించడమే గొప్పతనమనుకుంటాడు. కవి ప్రయోగించిన శబ్దాన్ని తొలగించి మరొక శబ్దాన్ని అలికితే అది అతుకులాగనే కనిపించి ఆ సందర్భంలో కవి ప్రయోగించిన శబ్దం అయిన మరొక శబ్దం అమరదు అనిపించాలి. అపుడే సమర్థుడైన కవి అనిపించుకుంటాడు.

**"కైలాసం బగ జేశులన్ కొలువ రాగా భక్తితో దేవతా**
**శైలంబున్ చనుదెంచె గూడి ధనదాశంబుట్టి జోడై యమా**
**శాలీలాగమనంబునన్ శశిదినస్వాముల్ వియద్వీధి రా**
**కాలంబిట్లగు టేలకో? యనుచు లోకంబద్భుతంబందగన్"**

తెల్లని వెండికొండ, పసిమిరంగు మేరు పర్వతం ఒకదాని వెంట మరొకటి ఉత్తర దిక్కున నుండి దక్షిణం వైపు వస్తుంటే చూస్తున్న వాళ్ళంతా ఆశ్చర్యపడుతున్నారు. ఇదేమిటి సూర్యచంద్రులు కలిసి ప్రయాణం చేస్తున్నారు. పైగా తూర్పునుండి పడమటి వైపుకు కాకుండా అపసవ్యంగా ఉత్తరం దిక్కు నుండి దక్షిణంవైపు వెళ్తున్నారు. కాల వైపరిత్యమేమిటి? అని.

ఈ పద్యంలో ధూర్జటి ప్రయోగించిన శబ్దాలు చమత్కారంగా ఉన్నాయి. అగజేశులు (పార్వతీపరమేశ్వరులు) ధనదాశ (కుబేర దిక్కు ఉత్తరం) యమాశ (యముని దిక్కు దక్షిణం) శశిదిన స్వాముల్ (చంద్రార్కులు) ఈ శబ్దాలన్నీ ధూర్జటి తయారుచేసుకున్నవే. ఇటువంటి శబ్ద ప్రయోగం ధూర్జటి కావ్యాల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది.

**6. అర్థగతము**

తన మనసులోని మాటను ఎదుటివారికి చెప్పాలి. కాని సూటిగా చెప్పే అవకాశం లేదు. పైకి మామూలుగా మాట్లాడుతున్నట్లుగానే లోపల మరో అర్థాన్ని స్ఫురింపజేయాలి. ఇది చెప్పేవారి సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. వినేవారు దాన్ని అర్థం చేసుకోవచ్చు లేకపోవచ్చు కాని పాఠకునికి అర్థమౌతూనే ఉంటుంది. అలాంటి స్ఫూర్తి గొప్ప చమత్కార జనకమౌతుంది. ఇంకా వాచ్యార్థ, లక్షణార్థ, వ్యంగ్యార్థాల ద్వారా సాధింపబడే చమత్కారమే అర్థ చమత్కారం.

పార్వతీ పరమేశ్వరులు దక్షిణ కైలాస పర్వతం మీద విహరిస్తున్నారు. ఆ పర్వతం నిండా పూదోటలు, మృగాలు మొదలు




ఎన్నో ఉన్నాయి. పరమేశ్వరుడు అన్నిటినీ నిశితంగా పరిశీలిస్తున్నాడు.

**"అలరుందీవెలు, పువ్వుగుత్తులు, కురంగాలోకముల్ పల్లవం**
**బులు, పంచానన మధ్యముల్, మధుకరంబుల్, బింబముల్, దాడిమీ**
**ఫలబీజాదులు సద్రిజావయవ సౌభాగ్యంబుతో నీడురా**
**గలవో ? లేవొ? యటంచు చూచుగతి నాగ్రావంబునం ద్రిమ్మరున్"**

అమ్మవారికి సౌందర్యానికి సాటిరాగల ఉపమావస్తువేదీ ఈశ్వరునికి ఆ పర్వతం మీద కనిపించడం లేదు. ఇతర స్త్రీలకయితే ఆ ఉపమానాలు చాలా గొప్పగా సరిపోతాయి. లతలు, పూగుత్తులు, జింకల కన్నులు, చిగురుటాకులు, సింహాల నడుములు, తుమ్మెదలు, దొండపండ్లు, దానిమ్మగింజలు మొదలైన ఉపమావస్తువులు – శరీరం, స్తనాలు, కళ్ళు, వ్రేళ్ళు, నడుము, కేశములు, పెదవులు, దంతాలు మొదలైన – ఉపమేయాలకు గొప్పగా అమరుతాయి. ఇది కవుల కల్పనలేనా? నిజమేనా అన్నట్లు పార్వతీదేవి అవయవాలను, ఆ ఉపమాన వస్తువులను, తరచితరచి చూస్తున్నాడాయన. అయినా ఆయనకు తృప్తి కలిగినట్లు లేదు.

**ముగింపు**

ధూర్జటి తన అతులిత మాధురి మహిమతో శ్రీకాళహస్తి మాహాత్మ్యములో దశవిధ చమత్కారాలను అద్భుతంగా రచించాడు. ఇతివృత్తం స్కాంద పురాణ అంతర్గతమైన వైష్ణవ ఖండంలోని ఆరవ అధ్యాయం శివ రహస్య సంగ్రహం నుండి గ్రహించబడినా ధూర్జటి తనదైన శైలిలో చమత్కారయుతంగా తన రచనలను చేశాడు.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. ధూర్జటి, శ్రీకాళహస్తి మాహాత్మ్యము, ఎమెస్కో, విజయవాడ, 1990
2. క్షేమేంద్రుడు, కవి కంఠాభరణం, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత పరిషత్, హైదరాబాద్ 1961.
3. డా. జి. నాగయ్య, తెలుగు సాహిత్య చరిత్ర భాగం 2, నవ్య పరిశోధక ప్రచురణలు, తిరుపతి 2003.

❖ ❖ ❖ ❖ ❖

# అన్నమాచార్య కీర్తనలు – నవవిధ భక్తిమార్గాలు

డా. గిరాజ శేషమాంబ, ఫోన్ : 9492861661

**వ్యాస సంపుటి :** భక్తి భావన భారతీయతత్త్వం. మోక్షానికి చాలా మార్గాలున్నాయి. వీటిలో జ్ఞానాన్ని పొంది దానితో మోక్షం పొందడం. భక్తితో మోక్షాన్ని పొందడం సత్కర్మతో మోక్షాన్ని పొందడం ప్రధానంగా చెప్పుకోదగ్గ మార్గాలు. వీటిలో భక్తి ప్రముఖమైనది. శ్రేష్టమైనది. అందుకే, **"మోక్షసాధన సామగ్ర్యాం భకిరేవ గరీయసీ"** అన్నారు పెద్దలు. అన్నమయ్య రచించిన కీర్తనలన్నింటిలోను భక్తి తొణికిసలాడటం గమనార్హం. అన్నమాచార్యులవారు ఆధ్యాత్మ సంకీర్తనలలో వివరించిన భక్తి అనిర్వచనీయం.

కీలక పదాలు : సాహిత్యం, సంకీర్తనలు, రచనలు, భాగవతం, జీవితచరిత్ర.

**ఉపోద్ఘాతము**

పదకవితా పితామహుడుగా, ప్రథమాంధ్ర వాగ్గేయకారుడుగా అన్నమయ్య తన సాహిత్య ప్రతిభాపాటవాలను 32,000 సంకీర్తనలలో పొందుపరచారు. వీటిలో 12,000 కీర్తనలు మాత్రమే లభించాయి. అందుచేతనే 15వ శతాబ్దాన్ని తెలుగువాఙ్మయ చరిత్రలో ఒక ముఖ్యఘట్టంగా వర్ణించవచ్చు.

అన్నమయ్య రచనలు ఒక సారస్వత క్షీర సముద్రం. ఆంధ్రవాఙ్మయంలో అన్నమాచార్యుని రచనలు మించినవి లేవు. అన్నమాచార్య రచనలలో భక్తి, శృంగారం, వేదాంతం ఇలా పలురకాలు గోచరిస్తాయి. అన్నమయ్య సంకీర్తనలలో గోచరించే నవవిధ భక్తిమార్గాలైన శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వదనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనా భక్తి బేధాలను పేర్కొంటూ అనేక కీర్తనలు రచించారు. అన్నమయ్య సంకీర్తనలలో ఆవిష్కృతమైన వివిధ భక్తిమార్గాలను సూక్ష్మంగా పరిశీలించి, ప్రధానమైన నవవిధ భక్తి రచనలు గురించి ప్రస్తావించటమే ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

**భక్తి రకాలు :** భక్తి రకాలను గురించి విభిన్నాభిప్రాయాలు వ్యాప్తిలో ఉన్నాయి. గుణబేధాలను బట్టి భక్తి మూడురకాలుగా వర్గీకరించవచు. అవి సాత్త్విక, రాజస, తామస భక్తిగా పేర్కొనటం జరిగింది. భగవద్గీతలో ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని అని నాలుగు రకాల భక్తులు తనను భజిస్తారని శ్రీకృష్ణ భగవానుడు తెలియజేశాడు. నారదుడు పదకొండు రకాల భక్తిని పేర్కొన్నాడు. అన్నమయ్య కూడ పదకొండు రకాల భక్తి బేధాలను పేర్కొంటూ ఒక కీర్తన రచించాడు.

**రాగం : బృందావనసారంగ ; తాళం – ఆది**

**"నానా భక్తులవి నరుల మార్గములు**
**యేనెపానైనా నాతడియ్య కొనుభక్తి"**

**హరికిగా వాదించుటది ఉన్మాదభక్తి**
**పరుల గొలువకుంటే పతివ్రతాభక్తి**
**అరసి యాత్మ గణుటదియే విజ్ఞానభక్తి**
**అరమరచి చొక్కుటే ఆనందభక్తి ॥ (1 చర)**

**అతి సాహసాల పూజ అదిరాక్షసభక్తి**
**అతని దాసుల సేవి అదియే తురీయభక్తి**
**క్షితినాకపని గోర చేసుటే తామస భక్తి**
**అతడే గతిని వుండుటది వైరాగ్యభక్తి ॥ (2 చర)**

**అట్టి స్వతంత్రుడేటే అది రాజసభక్తి**
**నెట్టిన శరణనుటే నిర్మల భకి**
**గట్టిగా శ్రీవేంకటేశు కైంకర్యమే సేసి**
**తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి ॥ (3 చర)**

ఈ కీర్తనద్వారా అన్నమయ్య వెల్లడించిన భక్తి రకాలు – ఉన్మాద భక్తి, పతివ్రతాభక్తి, విజ్ఞానభక్తి, ఆనందభక్తి, రాక్షసభక్తి, తురీయభక్తి, తామసభక్తి, వైరాగ్యభక్తి, రాజసభక్తి, నిర్మలభక్తి, నిజభక్తి.

భక్తి రచనాకారులలో 11 రకాల భక్తిభేదాలను గురించి మొట్టమొదటగా రచించినది అన్నమాచార్యులవారే.

**అన్నమయ్య రచనలలో – నవవిధ భక్తులు**

**శ్రవణభక్తి :** నవవిధ భక్తిమార్గాలలో "శ్రవణభక్తి" ప్రథమం ఆరాధ్య దేవతల మహిమలను, గుణగణాలను, ఘనతను వినడం శ్రవణ భక్తి లక్షణం. ఆయా దేవతల గురించి వినడం వల్ల వారిపట్ల భక్తి ఏర్పడి ఉన్నతస్థితికి చేరుకోవడానికి దోహదమేర్పడుతుంది. అన్నమయ్య సౌభాగ్యకరమైన విష్ణుకథను విని తరించమని విశ్వజనులకు ఉద్బోధించాడు. ఈ కీర్తనని రచించాడు.

**రాగం – శుద్ధ ధన్యాసి ; తాళం – ఆది**

**పల్లవి : "వినరో భాగ్యము విష్ణుకథ**
**వెనుబల మిదివో విష్ణుకథ"**

**కీర్తన భక్తి :** కీర్తించటం అంటే పొగడటం, వినుతించటం, భగవతుని కీర్తిని గానం చేయటమే కీర్తనభక్తి ప్రధాన లక్షణం. భగవంతుని నామాన్ని, కథలను వినడం ద్వారా మానవ జీవితంలో కలిగే మార్పులను శ్రవణభక్తి ద్వారా వివరించారు అన్నమయ్య.

**రాగం – చలనాట ; తాళం – ఖంఢచాపు**

**పల్లవి : "చాలదా బ్రహ్మయిది సంకీర్తనం మీకు**
**జాలెల్ల నడగించు సంకీర్తనం"** అంటూ అన్నమయ్య కీర్తన భక్తి యొక్క గొప్పతనాన్ని ఈ రచనలో వివరించారు. ఇటువంటి నామసంకీర్తన ద్వారా మోక్షమార్గాన్ని ఏవిధంగా పొందవచ్చో, కలియుగంలో నామసంకీర్తన ఎంత ప్రాధాన్యమైనదో ఈ కీర్తన ద్వారా వివరించారు అన్నమయ్య.

**స్మరణభక్తి :** నిరంతరమూ భగవంతుని మనసారా స్మరించడమే స్మరణభక్తి. తదేకంగా దేవుని ఆకార, చేష్టలను స్మరించడం వల్ల మనసు ఏకాగ్రమవుతుంది. తన్మయత్వం కలుగుతుంది. అన్నమయ్య భగవంతుని స్మరించవలసిన ఆవశ్యకతను తెలుపుతూ అనేక కీర్తనలు రచించారు. జప, తపాల కన్నా స్మరణే శ్రేష్టమని చెప్పారు. హరి స్మరణ లేని ఇతర సుఖములు సుఖాలు కావని అన్నమయ్య సుస్పష్టం చేశారు.

**"ఆత్మ గల వేంకటపతి నాత్మదలచి సుఖింపక**
**యేతరి సుఖములు దిరిగిన నింపులు దనకేనా"** అంటారు ఈ కీర్తనలో అన్నమయ్య. ఇతర పనులను కట్టిపెట్టి శ్రీ వేంకటేశ్వరుని స్మరించవలసినదిగా...

**"విడువుము మనసా వీరిడి చేతలు**
**తడయక శ్రీహరి దలచవో యికను"** అని కీర్తించారు. ఈవిధంగా స్మరణ భక్తిని పై కీర్తనలలో వివరించారు అన్నమయ్య. భగవంతుని నామాన్ని ఏ విధంగా స్మరించి తరించాలో స్మరణ భక్తి ద్వారా ఈ కీర్తనలో వివరించారు అన్నమయ్య.

**పాదసేవనాభక్తి :** త్రికరణశుద్ధిగా భగవంతుని పాదాలను సేవిస్తూ జీవించడమే పాదసేవనాభక్తి, ఆంజనేయుడు ఆశ్రయించినది ఈ పాదసేవనాభక్తియే. భగవత్పాద సేవ చేయవలసిందిగా అన్నమయ్య ఉద్బోధించాడు. ఈ సంకీర్తనలో...

**"చెన్ను మీర వారిపాదసేవసేయు మనసా"** అంటారు అన్నమయ్య.

అలాగే మరొక సంకీర్తనలో వేంకటేశ్వరుని సేవ విశ్వ విజయాన్ని సంపాదించిపెట్టడమే గాక మోక్షాన్ని కూడ కలిగిస్తుందని **"శ్రీ వేంకటేశ్వరుని సేవ చేతిలోన మోక్షమై కేవలపు ప్రపంచము గెలిపించును"** అనే ఈ కీర్తనలో వివరిస్తారు అన్నమయ్య మోక్షము, సేవ రెండింటిలో మోక్షానికన్నా సేవదే పైచేయి అని తెలియజేసారు అన్నమయ్య. అలాగే మరొక సంకీర్తనలో

**రాగం – భౌళి ; తాళం – ఆది**

**పల్లవి : శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ**
**శ్రీమన్నారాయణ శ్రీపాదమే శరణు**

**చరణం : "కమలనాభ నీ పద కమలమే శరణు"**
**"విడువ విడువ నింక విష్ణుడు నీ పాదములు**
**కడిని సంసారమార్ధి కదుముంచుకొనిన"** అంటూ పాదసేవనా భక్తిని తన కీర్తనలలో వివరించారు అన్నమయ్య.

**అర్చనాభక్తి :** భగవంతుని విగ్రహరూపంలో ఉపాసించి, పూజించి తమకు నచ్చిన భగవన్మూర్తిని ముందు షోడశోపచార పూజ విధానంలో కొలిచే పద్ధతినే అర్చనాభక్తి అంటారు. తాను ఉపాసించే భగవన్మూర్తినే సాక్షాత్ భగవంతునిగా భావించి అర్చిస్తే మానసిక ఏకాగ్రత కుదురుతుంది. తద్వారా మానవుడు ఉన్నతస్థితికి చేరుకొనేందుకు వీలవుతుంది. అర్చిస్తున్న మూర్తిని తదేకంగా చూస్తూ భావిస్తుండటం వల్ల తన్మయుడై భగవంతునికి చేరువయ్యే అవకాశం ఉంది. అన్నమాచార్యుడు కూడ అర్చనకు సంబంధించి ఎన్నో కీర్తనలు రచించారు. వాటిలో అర్చనా విశిష్టతను అనేక రీతులుగా వ్యక్తం చేసాడు. హరిపూజలు ఔన్నత్యాన్ని అందించి అలరిస్తాయని అన్నమయ్య ఈ కీర్తనలో...

**"పొందుగ నచ్యుతు బూజించు పూజలు**
**కిందట గొనకెక్కెడి నిచ్చెనలు"** అని వివరిస్తారు. మరొక సంకీర్తనలో

**"పూని దేవేంద్రాదులై పొడవు కెక్కినవారు**
**శ్రీనాథ మిమ్మునే పూజించిన వారు హరి"** అంటూ ఇంద్రాదుల ఔన్నత్యానికి వారు చేయించుకున్న ఇందిరేశుని పూజలే కారణమని, హరిపూజా విశిష్టతను తెలియచేశారు అన్నమయ్య. భగవంతునికి నిత్యార్చన ద్వారా కూడా మానవుడు ఉన్నత స్థితికి చేరుకోవచ్చునని అన్నమయ్య ఈ కీర్తనల ద్వారా వివరించారు.

**వందన భక్తి :** నమస్కారం, ప్రణామం, దండం మొదలయినవి సమానార్థకాలుగా, పర్యాయపదాలుగా వ్యవహారంలో ఉన్నాయి. భగవంతుని నమస్కరించటమే వందనభక్తి ప్రధాన లక్షణం. తలవంచి నమస్కరించడం, చేతులు జోడించి నమస్కరించడం, మోకరిల్లడం, సాష్టాంగ ప్రణామం చేయడం ఇవన్నీ ఈ కోవకే చెందుతాయి. అన్నమయ్య వందన భక్తి గురించి

**"శేషసాయికి మ్రొక్కు శిరము శిరము"** అని భగవంతునికి నమస్కరించే తల మాత్రమే తల అంటూ వివరించారు. మరొక సంకీర్తనలో..

**"మొక్కరో మీరు మోసపోక మీకు**
**దిక్కు దెసైన ఆదిదేవునికి"**

**"నలినాక్ష నీకు నమస్కరించిన**
**ఫలము వొగడనికి బ్రహ్మకు వశమా"** – ఇందిరేశునికి నమస్కరించమని ఈ సంకీర్తనలో వివరిస్తూ భగవంతునికి

నమస్కరించిన పొందే ఫలాన్ని వివరించారు అన్నమయ్య. మరొక సంకీర్తనలో ...

**"ఉన్న సుద్దులేల మాకువూర విచారము లెల్ల"**
**వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు"** అంటూ వివిధ సంకీర్తనలలో వందన భక్తి ఈ విధంగా తెలియజేస్తారు అన్నమయ్య. భగవంతుని యెదుట మోకరిల్లి, నమస్కరించి భక్తుడు తన భక్తిని ఏవిధంగా ప్రకటించవచ్చు అని అన్నమయ్య ఈ కీర్తనలు అన్నింటిలో వివరించారు.

**దాస్యభక్తి :** అన్య మనస్కులై భగవంతునికి దాస్యం నెరపడమే దాస్యభక్తి. ఈ విధానంలో భగవంతునికి, దాసునికి మధ్య ఉన్న సంబంధాన్ని, భగవంతునికి తనకు మధ్య నెలకొల్పుకొని భక్తుడు ఉపాసిస్తాడు దీనినే దాస్య భక్తి అని వివరించారు. అన్నమయ్య హరిదాస్య ఘనతను అనేక విధాలుగా వివరించారు.

**"యెంచగ నీదాస్యము నాకినామిచ్చితిగాన**
**పంచల నీపుట్టుగు నఫలమాయానిదివో"** వేంకటేశ్వర దాస్యం వల్లనే తన జన్మ సార్ధకమైనదని తెలియజేసారు ఈ సంకీర్తనలో అన్నమయ్య. మరొక సంకీర్తనలో..

**"బంతుల బాత్రాపాత్రము వెదకిన**
**అంతట హరిదాస్యమే పో ఘనము"** అంటూ హరిదాస్యమే సర్వోత్కృష్టమని తెలియజేస్తాడు అన్నమయ్య.

**సఖ్య భక్తి :** భగవంతుడిని మిత్రునిగా భావించి మన కష్టసుఖాలు ఆయనకి నివేదించి సంతృప్తి చెందే విధానమే సఖ్య భక్తి.

**రాగం - హంసధ్వని ; తాళం - ఆది**

**పల్లవి : "బలువగు దనరూపము చూపెన్**
**కలదింతయు దనఘన తెరిగించెన్"**
**చ (1) పాండవ రక్షణ పరుడై నరులకు**
**నండనే తెలిపి మహామహిమ**
**దండి విడిచి తనదయతో అర్జునకు**
**దుండుగ మగటిమి నొడబడబలికె ॥**
**చ (2) మగుడగ కులధర్మములు పుణ్యములు**
**తెగిపార్థున కుపదేశించెన్ ..** అంటూ అర్జునుని సఖ్య భక్తి గురించి వివరిస్తారు ఈ సంకీర్తనలో అన్నమయ్య. ఈ భక్తి నవలంబించి కృతకృత్యులైన వారిలో అర్జునుడు ప్రథముడుగా నిలుస్తాడని అన్నమయ్య వివరించారు.

**ఆత్మనివేదనాభక్తి :** అన్ని చింతలూ విడిచి తన్ను సర్వాత్మనా భగవంతునికి సమర్పించుకోవడమే ఆత్మనివేదనాభక్తి.


**"ఒడబరుచుకొంటివి వుపేంద్ర నిన్ను నిపుడె**
**చిదుముడి నీ సేవకే సెలవు చేసుకొమ్మీ"** అంటారు. అన్నమయ్య ఈ కీర్తనలో తన సర్వస్వము భగవంతునికే సమర్పణ మన్నాడు అన్నమయ్య. శరణాగతి కూడ ఆత్మనివేదన వంటిది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆత్మనివేదన, శరణాగతి ఒకే నాణానికి చెందిన ఇరువైపుల వంటిది. అన్నమయ్య శరణాగతి గురించి అనేకవిధాలుగా వివరించాడు. ఈ సంకీర్తనలో..

**"శరణన్న వారికి విజ్ఞానము దగులు**
**గరియ నిందువల్లనే ఘనమోక్షమూ దగులు"** అంటూ భగవంతుని శరణుజొచ్చిన వారికి విజ్ఞానము తద్వారా మోక్షము సిద్ధిస్తాయని వివరించారు అన్నమయ్య. భక్తుడు తనను తాను సమర్పించుకుని భగవంతున్ని చేరుకునే మార్గాన్ని ఈ కీర్తనల ద్వారా వివరించారు.

**ముగింపు :** తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడైన అన్నమయ్య తన రచనలలో భక్తి వైశిష్ట్యాన్ని వివరిస్తూ నవవిధ భక్తిమార్గాలలో రచించి ఇటు సాహిత్య లోకానికి అనేక విషయాలను అందించడమే కాక, పరిశోధనా అంశాలుగా కూడా వీరి రచనలు భావి తరాలకు ఉపయుక్తములు అనుటలో సందేహం లేదు.

**ఉపయుక్త గ్రంథసూచి**

1. అన్నమాచార్య సంకీర్తన సుధ - తి.తి.దే.-1995.
2. ఆచార్య సాళ్వకృష్ణమూర్తి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ చెన్నై తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనలు
3. తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనలు 2-469.
4. తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనలు 3-555.
5. తాళ్ళపాక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక సంకీర్తనలు 4-434.
6. లక్ష్మణయ్య సముద్రాల, అన్నమాచార్య సంకీర్తనామృతం, తి.తి.దే. తిరుపతి-2000.
7. సంకీర్తనా లక్షణము - తాళ్ళపాక చిన తిరువేంగళ నాథుడు-1993.
8. వాణి కేశర్ల, శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్ర, తి.తి.దే.-తిరుపతి-2000.



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 

UGC CARE List Approved Journal
హైదరాబాద్ ఆగస్టు : 2024

# ఈ పాటకు యాభై ఏండ్లు

**ఆవాల హరిబాబు,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 98495 38813

ప్రజాకవి గూడ అంజన్న రాసిన **"ఊరు మనదిరా వాడ మనదిరా"** అనే పాట రాసి 50 ఏళ్లు దాటింది. అయినా కూడా ఈ పాటకు ప్రజలలో ఆదరణ ఇంకా తగ్గలేదు. ఆదరణతో పాటు సందర్భం వచ్చినప్పుడల్లా ఈ పాటను పాడుకుంటున్నారు. ఒక పాట ఇంతకాలం ప్రజల్లో సజీవంగా ఉండడానికి కారణం ఆ పాట ప్రజల జీవితానికి దగ్గరగా ఉన్నది. ఈ పాట ప్రజల వాడుక భాషలో రాయబడింది. మనకు ఊరు అంటే అనేకమంది గుర్తు వస్తారు. అనేక వృత్తులు గుర్తుకు వస్తాయి. వృత్తి పనిముట్లు గుర్తుకు వస్తాయి. వాటి ప్రయోజనం, గొప్పదనం మనకు తెలుసు. వృత్తికి, పనిముట్లకు, వృత్తికారునికి మధ్య ఉండే సంబంధాన్ని తెల్పడంలో రచయిత చాలా శిల్ప ప్రావీణ్యం ప్రదర్శించారు.

గూడ అంజన్నది ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, లక్సెట్టిపల్లి మండలం, లింగాపురం గ్రామం. ఈయన 1955లో లక్ష్మమ్మ, లక్ష్మయ్య దంపతులకు జన్మించారు. వీరికి ఆరుగురు సంతానం. గూడ అంజన్న ఐదవవాడు. గూడ అంజయ్య బి.ఫార్మసీ పూర్తి చేసి ఫార్మసిస్ట్ ఉద్యోగిగా కొనసాగారు. ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు ప్రభావితం అయిన పాటను ఆయుధంగా ఎంచుకున్నారు. ఈయన పాటల్లో ఉత్తర తెలంగాణ యాస కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఈయన బతికినంత కాలం తెలంగాణ కోసం, తెలంగాణ ప్రజల కోసం బతికారు. వారి సమస్యల మీద పాటలు రాశారు.

**"ఊరు మనదిరా ఈ వాడ మనదిరా"**
**పల్లె మనదిరా ప్రతి పనికి మనమురా**
**దొర ఏందిరో వాని పీకుడేందిరో"...**

ఈ పాట విన్న తరువాత నిలువెల్లా చలించని మనిషుండడు. విన్న వారిని తన ఊరి గురించి ఆలోచించే విధంగా చేస్తుంది. ఇది ప్రజలను కదిలించడమే కాదు దొరలను కూడా కంపింపజేసింది. దొర అనగానే మనకు ఒక భయం, పెత్తనం గుర్తుకు వస్తది. ఆ పెత్తనం తరతరాలుగా ఊరిని వేధిస్తున్నది. పీడీస్తున్నది. ఆ వేదన నుంచి, పీడన నుంచి విముక్తి రాగం ప్రజలకు అందించింది. ఈ పాట వినగలిగిన వారికి బాగా అర్థమవుతుంది. రచయిత ఊరు మనదిరా అంటూ వెంటనే వాడ మనదిరా అంటున్నారు. మన దేశంలోని ఊర్లు వాడలుగా విభజించబడ్డాయి. ఊరు అనగా మొత్తం గుర్తు వస్తే, వాడ అనగానే కులం విభజన గుర్తు వస్తది. కాని రచయిత మొత్తం ఊరును ఒక పీడిత సమూహంగా గుర్తించి వారికి జరిగే అన్యాయాన్ని తెలియజేస్తున్నారు. సమస్త వృత్తులు చేసే ప్రజల మీద




దొర పెత్తనం ఏంది అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసే ప్రజాశక్తి మీద దొర జులుం ఏంది అని ప్రశ్నిస్తున్నారు.

**"అరుక బట్టె మనం! అసెలుక దున్నె మనం**
**ఈ కంచె కాడ మనం! ఆ మంచె కాడ మనం**
**ఈ పాడి కాడ మనం! ఆ పశుల కాడ మనం – హొయ్**
**దొడ్డి కాడ మనమే! గడ్డాము కాడ మనమే**
**దోపిడేందిరో? దొర పోకడేందిరో? నడుమ**
**దోపిడేందిరో! దొర పోకడేందిరో?"** **॥ఊరు॥**

ఈ పాదంలో కూలి రైతు గురించి రచయిత చెపుతున్నారు. అరుక మనదే, దున్నే సెలుక మనదే అంటున్నారు. కంచె మనదే, మంచె మనదే, పాడి పంట మనదే, పశువులు కాసేది మనమే, ఆ పశువులు మనవే అంటున్నారు. దొడ్డికాడ మనమే, గడ్డాము దగ్గర మనమే అంటూ మన మధ్యన దొర ఏంది? దొర పెత్తనం ఏంది అని మన ముందు ప్రశ్నలు వేస్తున్నారు. ఇక్కడ రచయిత పాటలో ప్రతి వాక్యంలో మనం, మనం అనే పదాన్ని పదే పదే ఉపయోగించారు. మనకు ఊరు అనగానే ఒక నిర్మాణం గుర్తుకు వస్తది. ఆ నిర్మాణంలో కులపరంగా, వృత్తిపరంగా మనకు కనిపిస్తుంది. ఈ సమూహమంతా దొర కింద కూలిజనంగా బతుకుతారు. వీరికి కూడుండదు. నీడుండదు. శ్రమ చేసే ప్రజలకు ఫలితం లేదని అంటున్నారు. ఈ పాట ద్వారా ప్రజలకు వాస్తవ విషయాలను తన కలం ద్వారా వ్యక్తపరుస్తున్నారు. ఈ పాటలో రచయిత ఒక ప్రాంతానికి, ఒక ఊరికి అంకితం చేసి రాయలేదు. యావత్ ప్రపంచానికి చెందిన విధంగా రాశారు. మనదేశంలో ఏ ఊరి ప్రజలైన ఈ పాటను అనువదించుకొని పాడుకోవచ్చు. రచయిత ఈ పాట ప్రాపంచిక దృక్పథంలో రాశారు.

రచయిత పాట కాలాన్ని ఒకసారి పరిశీలిస్తే, 1972లో సిరిసిల్ల, జగిత్యాల రైతాంగ పోరాటం కాలం. అప్పుడు ఉత్తర తెలంగాణ


పల్లెలు ఉద్యమాల బాట పట్టాయి. ప్రజలకు ఉద్యమాలు తప్ప వేరే ధ్యాసే లేదని చెప్పవచ్చు. అలాంటి పరిస్థితుల నుంచి ఈ పాట పుట్టింది. అంటే దున్నేవాడిదే భూమి నినాదంతో పుట్టిందని చెప్పవచ్చు. దున్నేవానిదే భూమి అంటే వ్యవసాయానికి సంబంధించిన ప్రతి పనిముట్టు మనదే దున్నేవానిదే అని చెప్పవచ్చు. రచయిత పల్లెల్లో ఉండే ప్రతి పనిముట్లు మీద శ్రమజీవులదే హక్కు అని తెలుపుతున్నారు. రచయిత ఈ పాటను చాలా సామాజిక చైతన్యంతో ఈ పాట రాశారు.

ఊరి మీద అనేక పాటలు వచ్చాయి. అవి ఒక ఊరికి, ఒక ప్రాంతానికి పరిమితమైనవిగా ఉన్నాయి. కాని ఈ పాట మాత్రం యావత్ భారతదేశానికి చెందిన పాట చెప్పవచ్చు. **"ఈ పాట సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో నిజంగా భూకంపాన్ని సృష్టించింది"** అంటారు విప్లవ రచయిత వరవరరావు. (గూడ అంజయ్య – ఊరు మనదిరా పాటలు; 1999 : 6) అలాగే ప్రతి శ్రమజీవి ఈ పాట గురించి ఆలోచించవల్సిన విషయం. నాగరిక సమాజం వేసుకోవాల్సిన ప్రశ్న. గ్రామాల్లో దొరతనాలు వారు సాగించే పెత్తందారీతనాలు కళ్లుండి చూసే ప్రతీవారికి కనిపిస్తాయి. **"ఎవరి చెమట చుక్కలతో భూమిని తడిపి పంట పండిస్తున్నారో ఎవరు పండించిన పంటకు నోచుకోకుండా పోతున్నారో ఏ అమాయక శ్రమజీవుల మీద దొరతనాలు చెలాయిస్తున్నారో అక్కడి అట్టడుగు వర్గాలు ప్రశ్నించారు. నడుమ దొర ఏమిటని, దొరతనమేమిటని ఆనాటి ప్రజలు నిలదీశారు"**. జూలూరి గౌరిశంకర్ (గూడ అంజయ్య– ఊరుమనదిరా పాటలు; 1999 : 7)

తెలంగాణలో కొన్ని సంవత్సరాల నుంచి ఉవ్వెత్తున లేస్తున్న ఉద్యమాల వలన, దొరను, దొరతనాన్ని ప్రశ్నిస్తున్న ఇలాంటి పాటల వలన మార్పులు గణనీయం. ఫ్యూడల్ సంస్కృతికి ముద్దుబిడ్డ అయిన దొరపదం తిట్టు పదం అనే అంత వ్యతిరేక భావం కలిగించింది ఈ పాట. తెలుగునేలలోనే కొన్ని గ్రామాల్లో ఈ పాట శ్రమజీవుల్లో ఎంతో నైతిక స్థైర్యాన్ని కలిగించింది. తమవి కాకుండా పోతున్న తమవైన ఊరు వాడ అన్ని శ్రమజీవులవేనని ఈ పాట చెప్పింది. నొక్కి పదే పదే చెప్పింది. ఈ పాట ఊరూరు ఇప్పటికి తిరుగుతూనే ఉంది. ప్రతివాడ మనదేనంటూ చెబుతూనే ఉన్నది. గత అర్ధ శతాబ్దం నుంచి పాట తన పని తాను చేస్తూనే ఉన్నది. ఈ పాటకు ఉన్న బలం శ్రమజీవుల ఆనవాళ్లు, అస్తిత్వాలు ఈ పాటలో ఉన్నాయి. అందుకే నేటికీ ఈ పాట ప్రజల నోళ్లల్లో నానుతూనే ఉన్నది. ఎన్ని సంవత్సరాలయినా ప్రజల నోళ్లలో నానుతూనే ఉంటది. ఇలాంటి పాటలకు ఎప్పటికీ మరణం అనేది ఉండదని చెప్పవచ్చు. ప్రతిపనికి తామే సృష్టికర్తలమైన ప్రజలకు ఈ వ్యవస్థలో ఏమి ఒరగడం లేదు. అలాంటి సృష్టికర్తలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఈ పాట ప్రభావాన్ని అనుభవిస్తున్న శ్రమజీవులకే ఈ పాట రాసిన రచయిత గూడా అంజయ్య చాలామందికి తెలియకపోవచ్చు. కానీ పాట మాత్రం కోట్లాది మందికి తెలుసు. ఆ పాట ప్రజల్లో కలిగించిన చలనం తెలుసు. ఊరు సర్వ సంపదలకు నిలయం. ఆ సంపద మీద ప్రజలకు హక్కు నామమాత్రమే. ఆ నామమాత్రాన్ని పటాపంచలు చేసింది ఈ పాట. ఇక ఊరు ప్రజలదేనని గొంతు ఎత్తి పాడింది. పాడుతూనే ఉంటది.

ఉపయుక్త గ్రంథం

1. గూడ అంజయ్య – ఊరు మనదిరా పాటలు; ప్రచురణ : హేమ సాహితి ప్రచురణలు, హైదరాబాద్, 1999.

శిలాక్షరం
(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం – సమాలోచన)
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.
సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-


సంప్రదించండి.
మూసీ మాసపత్రిక
ఫోన్ : 934 7971177

మూసీ
సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక
పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177

# తెలుగు సాహిత్యభాషా విప్లవయోధుడు – గిడుగు

**డా. కె.వి.ఎన్.డి. వరప్రసాద్,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమండ్రి,
ఫోన్ : 90105 36555

అభ్యుదయ యుగకర్త శ్రీశ్రీతో **"ఇటీవల మా ఇన్స్పిరేషన్"** అని ప్రశంసలు పొందిన గిడుగు వేంకటరామమూర్తి శ్రీకాకుళం జిల్లా పర్వతాలపేటలో వీర్రాజు, వెంకమ్మ దంపతులకు ఆగష్టు 29, 1863వ సంవత్సరంలో జన్మించారు. విజయనగరం మహారాజావారి పాఠశాలలో గురజాడ, ఆదిభట్ల మొదలగువారు సహాధ్యాయులుగా తన విద్యాభ్యాసం పూర్తిచేశారు.

చిలుకూరి నారాయణరావులాంటి శిష్యబృందాన్ని కలిగిన గిడుగు ఎరుపు చాయ కలిగి, సామాన్యమైన ఎత్తు కలిగి, ఆయనకున్న పట్టుదల అంతా మొహంలోనే కనిపించేలా బింకమైన మొహాన్ని కలిగి ఉండేవారు. తెల్లటి తలపాగా, కోటు, పంచ ధరించిన ఆహార్యంతో గంభీరంగా కనిపించేవారు.

తెలుగు వ్యవహారిక భాషోద్యమానికి ఆద్యుడు, పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు. నాటి ఆయన ప్రయత్నాలు ఫలించి విద్యావిధానంలో నేడు మనం చూస్తున్న మార్పులు చోటుచేసుకున్నాయి. లేకపోతే నన్నయ కాలం నాటి గ్రంథస్థమైన భాషారూపమే నేటికీ కొనసాగుతుండేదనడంలో అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఆయనలా పట్టుదలతో ఆయన తరువాత వ్యవహారిక భాషోద్యమానికి కంకణం కట్టుకున్నవారు ఎవరూ లేకపోవడాన్ని కారణంగా చెప్పవచ్చు. చిన్నయసూరి 1853లో రాసిన 'నీతిచంద్రిక' 1855లో రాసిన 'బాలవ్యాకరణం' గ్రంథాలు ఆధునిక సాహిత్య ప్రక్రియలైన నవల, కథానిక వంటి వాటిలో కూడా గ్రాంథిక భాషావాడకం పెరగడానికి కారణమయ్యాయి. దీనివల్ల సాహిత్యం పండితులకే పరిమితమై సామాన్యులకు దూరమయ్యే పరిస్థితి దాపురించింది.

ఈ పరిస్థితుల్లో లక్షణ విరుద్ధమైన భాష అంటే నన్నయాదుల కావ్య భాషాలక్షణానికి, ఆ లక్షణాలను సూచిస్తూ రాసిన **'బాలవ్యాకరణం'**లోని సూత్రాలకు విరుద్ధమైన భాషను **'గ్రామ్యము'** అనే పేరుతో పిలిచి, అది సాహిత్యంలో ప్రయోగనార్హమనే పండితుల వాదాన్ని ఎదిరిస్తూ సాగిన ఉద్యమమే **"వ్యవహారిక భాషోద్యమం".** ఈ ఉద్యమాన్ని ప్రారంభించి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, ధైర్యంగా నిలబడి చివరకు విజయం సాధించి **'గిడుగు అంటే పిడుగులాంటి వాదని'** విమర్శకులతో ప్రశంసలు పొందారు గిడుగు రామ్మూర్తి పంతులు.

విద్యాబోధనలో విజ్ఞాన సముపార్జనకు, పురాతన కావ్యభాష కాకుండా ఆధునిక శిష్ట వ్యవహారికమే మంచిదని గిడుగు విస్తృతంగా ప్రచారం ప్రారంభించారు. గ్రాంథిక భాషలో నిష్ణాతులమనుకున్నవారికే గ్రాంథిక భాష సరిగారాదని గిడుగువారు **"ఆంధ్రపండిత భిషక్కుల భాషాభేషజం"** అనే ఖండన గ్రంథంలో సప్రమాణికంగా నిరూపించారు. తనది గ్రాంథికం రాక చేసే వాదన కాదని నిరూపిస్తూ తన ఆంధ్రభాషా పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ గ్రాంథిక భాషలో **"ప్రాఁదెనుగుకమ్మ"** అనే వ్యాసం ద్వారా నిరూపించుకున్నారు. దీంతో గిడుగువారి వాదానికి ప్రాచుర్యం పెరగడం ప్రారంభమైంది. దీనికి గురజాడ అప్పారావులాంటి వారు మద్దత్తు తెలుపుతూ **"గ్రామ్యశబ్ద విచారము, వాడుక భాష – గ్రామ్యము"** వంటి వ్యాసాలను రచించారు. అలాగే వ్యవహారిక భాషావాదులంతా కలసి **'ఆంధ్రసారస్వత సంఘాన్ని'** ఏర్పరిచారు. దీంతో మరికొంత మంది గిడుగు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు.

వ్యావహారిక భాషోద్యమం విజవంతమైతే తెలుగు భాషా సాహిత్యాలు అవస్థలో పడిపోతాయని, వ్యావహారికమంటే గ్రామ్యమేనని నమ్మిన పండితులు జయంతి రామయ్య పంతులుగారి ఆధ్వర్యంలో **'ఆంధ్రసాహిత్య పరిషత్తు'** ను స్థాపించారు. తమ ఆశయాలను ప్రచారం చేయడానికి **'ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక'**ను ప్రారంభించారు.

ఇరువర్గాల మధ్య పోటాపోటీగా విమర్శపర్వం కొనసాగింది. ఇరువర్గాలు తమ తమ వాదాలను సమర్థిస్తూ పోటాపోటీగా కరపత్రాలు, వ్యాసాలను వెలువరించాయి. ఈ వాదోపవాదాలకు ప్రతిభ, తెలుగు, ప్రబుద్ధాంధ్ర, ఆంధ్రపత్రిక, హిందూ పత్రికలు ప్రాతినిధ్యం వహించాయి. 1919లో గిడుగు 'తెలుగు' అనే పత్రికను ఆంగ్లభాషలో స్థాపించి తనవాదం ప్రచారం కోసం కృషిచేశారు. గిడుగువాదనలోని ఔచిత్యాన్ని గమనించి, గ్రాంథిక భాషావాదులుగా ఉన్న కందుకూరి, వేదం వేంకటరాయశాస్త్రి వంటివారు కూడా వ్యవహారిక భాషవైపు మొగ్గుచూపడంతో ఈ వాదం మరింత బలం పుంజుకుంది. 'జనవాణి' సంపాదకునిగా తాపీ ధర్మారావు మొదటిసారి వ్యవహారికాన్ని పత్రికాభాషగా చేశారు. ఈ విధంగా గిడుగు చేసిన అన్ని రకాల ప్రయత్నాలు ఫలించి ఆయన వాదనవైపు నాటి ప్రముఖ సాహితీవేత్తలు ఆకర్షితులు కావడంతో ఒక్క విశ్వవిద్యాలయాలు, పద్యకావ్యాల్లో తప్ప మిగిలిన అన్నిచోట్లా వ్యవహారిక భాషకు ప్రాధాన్యం పెరిగింది. వ్యవహార భాషలోనే రచనలు ప్రారంభమయ్యాయి. తరువాత ప్రజల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు రావడంతో 1968లో ప్రభుత్వం 'తెలుగు అకాడమి'ని స్థాపించి వ్యవహారిక భాషలో పాఠ్యపుస్తక రచనను ప్రోత్సహించింది. తరువాత కాలంలో విశ్వవిద్యాలయాల్లో కూడా వ్యవహార భాషకు ప్రాధాన్యం ఇవ్వక తప్పలేదు. 1969లో శ్రీ

వేంకటేశ్వర విశ్వవిద్యాలయ తెలుగుశాఖ పిహెచ్.డి. పట్టానికి రాసే పరిశోధనా గ్రంథాల్లో శిష్ట వ్యవహారికాన్ని అంగీకరించింది. తరువాత ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్శిటీవారు వ్యవహారిక భాషలో చేసిన పాఠ్యగ్రంథ ప్రచురణలు కూడ విశేషమైన ఆదరణ పొందాయి.

ఈ విధంగా అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో గ్రాంథిక భాషాస్థానాన్ని వ్యవహారిక భాష ఆక్రమించింది. ఫలితంగా ప్రతి ఒక్కరూ కలం పట్టడానికి అవకాశమేర్పడింది. రచనలో సౌలభ్యం ఏర్పడడంతోపాటు, ఛందోబంధాలకు విముక్తి కూడా కలగడంతో నన్నయ నుంచి వ్యవహారిక భాషోద్యమం వచ్చేవరకు వచ్చిన సాహిత్యం కంటే సుమారు వందరెట్ల సాహిత్యం అప్పట్నుంచి, ఇప్పటివరకు వచ్చిందని విమర్శకుల అభిప్రాయం.

గ్రంథస్థమైన గ్రాంథిక భాష సామాన్యులకు అందుబాటులో లేదని భావించి, దానిని నివారించడానికి, వ్యవహార భాషే గ్రంథాల్లోనూ ఉండాలనే ఉద్దేశ్యంతో పాటు, సాహిత్యం అందరికి అందుబాటులో ఉండాలనే దృష్టితో గిడుగు వ్యవహారభాషోద్యమాన్ని ప్రారంభించి విజయులైయ్యారు. అయితే ఆయన కేవలం తెలుగు భాషాభివృద్ధికి పాటుపడడం మాత్రమే కాకుండా, అడవి బిడ్డలుగా, కొండకోనల్లో నాగరికత అంటే ఎంటో తెలియకుండా జీవనాన్ని సాగిస్తున్న **"సవర"** జాతికోసం కూడా గిడుగు తన కాలంతోపాటు ధనాన్ని వినియోగించారు. "సవర" భాషకు ప్రామాణికతను కల్పిస్తూ నిఘంటువులను రచించారు. ఈ విధంగా తన జీవితాన్ని వ్యవహారిక భాషనే గ్రంథస్థ భాషగా మార్చడానికి తెలుగు విషయంలో కృషి చేయడమే కాకుండా "సవర" భాషకు స్థిరత్వాన్ని చేకూర్చారు శ్రీ గిడుగు.

**"బహుముఖ ప్రజ్ఞావంతుడు విభిన్న రంగాలలో విశిష్ట విజయాలను సాధిస్తారు. ఇతరులకు అసాధ్యాలుగా తోచేవాటిని, తన దీక్షతో, దక్షతతో ప్రజలకోసం పాటుపడి సఫలం చేసినవారు ఆకార్య సాధనకోసమే పుట్టారని లోకులు భావించడం మన పూర్వాచారం. అలాంటి ప్రసిద్ధులను కారణజన్ములని లోకం కొనియాడుతుంది"** అని ఆరుద్ర అన్న మాటలు, వ్యవహార భాష గ్రంథస్థ భాషగా మారడంతో తెలుగు సాహిత్యం విస్తృతంగా రావడానికి, ఎక్కువమంది ప్రజలకు చేరువ కావడానికి కారకుడైన శ్రీ గిడుగు రామ్మూర్తి పంతులు విషయంలో అక్షర సత్యమని అంగీకరించ తప్పదు.

## ఏకీకరణం!

ప్రియా! నీ మీద నా మనసు మళ్లింది.
నిజానికి నీవు నేను అవిభక్త కవలలమే.
నీలో నేను, నాలో నీవు
ఒకేసారి జీవం పోసుకున్నాం.
కాదు, కాదు ఒక రవ్వ ముందే నీవున్నావు.
నేను ఎదిగాను –
నీవు అప్పుడప్పుడు సైదోడుగా ఉండి తలపుల్లో మెదిలావు.
అయినా నీవు నా పట్ల ఆసక్తి కనపరచలేదు.
నేను నిన్ను మరిచిపోలేదు.
కానీ, గుర్తుంచుకోవడానికి తీరికే దొరకలేదు.

దశాబ్దాల కాలచక్రం గిర్రున తిరిగింది.
రెండోవలయంలోకి తీగ సాగింది.
ఎన్నో, ఎన్నెన్నో మార్పులు, కీర్తి ప్రతిష్ఠలు,
హెచ్చుతగ్గులు, మంచి చెడ్డలు,
మానావమానాలు, సుఖదుఃఖాలు
అన్నీ అనుభవించాను.
ఆనంద విషాదాల సహజీవనం చేశాను.

నా తలపుల అట్టడుగు పొరల్లో సుషుప్తంగా ఉన్న
నీవే నన్ను మేల్కొలిపావో;
నేనే నిన్ను మేలుకొలిపానో;
మళ్లీ నీతో మనసారా సంగమించాలన్న
ఆకాంక్ష చివురులెత్తింది.
నాలోంచి నేను విడిపోయి బాగా పండిన దోసకాయలా,
అనాయాసంగా నీలో సంలీనం కావాలనీ
ఆత్మలో ఆత్మనై నిద్రించాలనీ,
శాంతి కుసుమాలు పూయించాలనీ,
ఆవలితీరం అందాలవనంలో విహరించాలనీ
మనస్సు ఉవ్విళ్ళూరుతుంది..




**ఆచార్య వెలుదండ నిత్యానందరావు**
ఫోన్ : 9441 666881

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 (51) హైదరాబాద్ ఆగస్టు : 2024

# బహుజన మంగళోపనిషత్

**డా. ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్: 79817 23375




దశాబ్దం క్రితం ఉద్యమాల ఒల్లెడ నుంచి ఉద్భవించిన కవి శతాబ్దాల మానవాళి వేదనను తాత్వీకరించేస్థాయికి ఎదిగాడు. కనిపించని కాలం లోతుల్లో దాగిన తరతరాల అస్పృస్యతా దు:ఖాన్ని పైకి తోడుతున్నాడు. ప్రాంతీయ అస్తిత్వమే కాదు ప్రతి ప్రాణి అస్తిత్వస్వరాన్ని అక్షరీకరిస్తున్న సహజ ఉద్వేగ కవి. వృత్తి పనిముట్లను ఆత్మగౌరవ పతాకంగా ఎగుర వేస్తున్నాడు. ఆధిపత్యవర్గాల గొంతులు మూగబోయేలా నూరురాయి మీద కత్తిని నూరినట్లుగా వాక్యాన్ని పదును పెడుతున్న దీర్ఘకవితాకర్త వనపట్ల సుబ్బయ్య, అశోకుడి చేతిలోని ఖడ్గం కంటే శక్తివంతమైన మంగలిబాలయ్య సంకలోని అసిపెలో దాగున్న చారిత్రక గాథలను ఉత్తేజ భరితంగా వనపట్ల ఈ కావ్యగానం చేస్తున్నాడు.

'అసిపె' ఒక సామాజిక వర్గస్పృహతో రాసిన కావ్యమైనా అనేక అవమానాలకు గురై, బతుకుపోరులో అలసిపోయి సంక్షోభంలో మునిగిపోయిన బహుజన సామాజిక వర్గాల ఆవేదనకు, ఆగ్రహానికి, ధిక్కారానికి సామూహిక ప్రాతినిధ్యం వహిస్తుంది. వనపట్ల వృత్తిగత జీవనయానంలో ఎదురైన ఎన్నో అనుభవాలు, వివక్షలు, ఛీత్కారాలు, ఆకలి, నిత్య అవమానాలు, అమర్యాదలు, చేదు జ్ఞాపకాల అంతర్మథనంతో ఊటలా ఉబికివచ్చిన ఆత్మగౌరవ కవితా స్వరం ఈ అసిపెలో ప్రతిధ్వనిస్తుంది. సుబ్బయ్య నాయిన చేతిలోని క్షవరపు కత్తి నాందీ వాక్యంగా మొదలై మంగలి వృత్తికారుడిగా మిగిలిపోకుండా ఆధునిక మౌర్యులమై చరిత్రను తిరగరాసే పోరాట శక్తిని అందించే ఆశయంతో ముగుస్తుంది. కావ్యం ముగిసినా కవి కంఠస్వరం బహుజన ఉద్యమగీతమై ఉరక లెత్తిస్తుంది.

వనపట్ల ఈ దీర్ఘకావ్యాన్ని ఇరవై ఐదు అధ్యాయాల్లో ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో తన సామాజికవర్గ సంవేదనలను లోకానికి బలంగా చెప్పే ప్రయత్నం చేశాడు. తన చిన్న నాటి ముచ్చట్లనుండి మొదలైన ఈ కవిత బహుజన రాజ్యాధికార దిశగా పయనించింది.

***"అసిపెనే / మా ఇంటికి బువ్వ***
***బతుకు బండి / మా జాతి జీవగర్ర, వెనుగర్ర***
***కులవృత్తికి కూరాడు***
***అసిపె లేకపోతే బువ్వెవక్కడిది?***
***అసిపె మాగుండెపెట్టె / అసిపె మా ఇంట్ల దీపం"*** అంటూ అసిపె చుట్టూ అలముకున్న జీవనాధార వస్తువులన్నీ ఉండే పెట్టెతో గల అనుబంధాన్ని, దాని విలువను అమిత గౌరవంతో స్తుతిస్తాడు. **'మా అయ్య చేతుల అసిపె ఉంటే / ఆశోకుడి మగధ సామ్రాజ్యం చేతుల ఉన్నట్లే'** అని ఉన్నతస్థాయిలో అసిపెను ప్రతిష్టించుకుంటాడు.

ఒక వృత్తి జీవితాన్ని, ఒక కులం ఎదుర్కొన్న సంక్షోభ పరిస్థితులను ఒక కవితలో వ్యక్త పరచడం సామాన్యమైన విషయమే. ప్రతి కవి అనివార్యంగా తన మూలాల్లోకి వెళ్ళి అనాటి విషయాలన్నింటిని వ్యక్త పరుస్తాడు. ఈ క్రమంలో తను అనుభవించిన బాధలను, వ్యధలను లేదా మధురమైన జ్ఞాపకాలను తలపోసుకుంటూ తనకు తానే సాంత్వన పొందుతాడు. తెలుగు కవిత్వం విభిన్నమైన కులాల జీవన చిత్రణను చేస్తూనే వైవిధ్యమైన సామాజిక పరిణామాలను, అంతరాలను, సాంస్కృతిక విశేషాలను పరిచయం చేసింది. అస్తిత్వ ఉద్యమాలు ఉధృతంగా వ్యాపించిన వేళ సాహిత్యం అనేక వాదాలుగా విడిపోయింది. వీటి మధ్య ఎవరి మనసులు ఎంత లోతుగా గాయపడ్డాయో ఎవరు ఎంత దారుణంగా అవమానించబడి అణచి వేయబడ్డారో, ఎవరి నెత్తురు కన్నీళ్ళు ఎక్కువగా ఈ నేలను తడిపిందో, ఎవరు అంటరాని వారుగా వెలివేయబడ్డారో, ఎందరు ఆకలిమంటల్లో కాలిపోయారో అనే చర్చకూడా తీవ్రంగానే జరిగింది. ఈ నేపథ్యం లోంచే తెలుగు కవితలో తాత్విక అన్వేషణ ఆరంభమైంది. అందులో భాగంగానే వర్తమాన కవిత్వంలో బహుజన అస్తిత్వం బలమైన సిద్ధాంత పునాదులతో వెలువడటం అరంభమైంది. వెనుకబడి కులాలుగా వ్యవహరించబడుతున్న అనేక కులాల సమాహారం సామూహిక సమరానికి సిద్ధం కావాలనే ఆకాంక్ష గాఢంగా ప్రబలుతున్న వేళ వనపట్ల సుబ్బయ్య ఒక స్పష్టమైన దిశా నిర్దేశాన్ని అందించాడు.

**"గ్రూపు లెన్నైనా వుండనీ / తీరొక్క చెట్లు రంగురంగుల పూలు / దారమొక్కటే దండొక్కటే మనదంతా ఒకటే కుటుంబం / మంగలి బంధువులం"** అంటూ స్పష్టంగా వెచ్చని స్నేహస్పర్శతో చేయవలసిన పోరాటానికి ఒక రూపాన్ని అందిస్తాడు.

***"సంకుచిత తత్వాలు ఏమీ సాధించలేవు***
***ఏ ఒక్కకులం ఒంటరిగా ఏమి సాధించలేదు***
***ఏ కులానికి ఆ కులం విడివిడిగా***
***మేమెంత మందిమో మాకంత వాటా!***

*సకల సామాజిక రంగాల్లో మన వాటా*
*మా బీసీలకు జనాభాదామాషా కోటా*
*బి.సీ కులాలన్నీ ఒకే కుల్లరైలు బోగిలై*
*కదులాలి ఆత్మగౌరవపోరాటంతో"*

కవి తన కులానికే పరిమితం కాలేదు. ఒక విశాలమైన తాత్విక దృక్పథంతో తన పొదిలో నుండి పలు ప్రయోజనాలు కలిగే అమ్ముల పొదిని అసిపెలో సమకూర్చుకున్నాడు. ఇంత విస్తృతితో నూటాపది పేజీల్లో తన కుల వృత్తి జీవన చరిత్రను ఒక కావ్యంగా మలచుకోవడం ఒక వనపట్లకే సాధ్యమయింది. మరోకోణంలోంచి చూస్తే మానవ చరిత్రలో మంగలి వృత్తికున్న ప్రాధాన్యం ఎంతో కీలకమైంది. మనిషి నాగరికతను తీర్చిదిద్దిన వారిలో మంగలుల పాత్ర విస్మరించలేనిది. అందుకే **"పల్లెకు వెలుగు / ఊరుకు అందం / గ్రామానికి నాగరికత"** నేర్పిన వృత్తి నైపుణ్యాన్ని, కుల వైశిష్ట్యాన్ని సుబ్బయ్య సగర్వంగా ప్రకటిస్తాడు.

వృత్తికులాల కవిత్వం సాధారణంగా తమ వృత్తి నైపుణ్యాలను, ప్రాధాన్యతలను వర్ణిస్తూ స్వీయాత్మక అనుభూతిని వ్యక్త పరుస్తుంది. మరో పార్శ్వంలో ఉపాధికరువై వృత్తికి పట్టిన దుస్థితిని, తక్కువవారనే చిన్న చూపు, అవమానాలు, అనాదరణ, దారిద్ర్యం మొ॥న అంశాలు చిత్రితమవుతాయి. ఆర్థికంగా ఎదగలేని వృత్తికారుల పరాయింకరణ, అస్తిత్వవేదన అలుముకున్న వాతావరణాన్ని వర్ణింస్తాయి. ఈ అసిపెలోను సకల జీవన కోణాలు ఆవిష్కృత మయ్యాయి. **'సవురం కత్తులు నూరి నూరి, రాయి అరగడంతో పాటు బతుకు కరిగిపోయిన'** వాస్తవిక స్థితిని ఏ మాత్రం దాచుకోకుండా చెప్పాడు. ఒక వైపు యథార్థాన్ని చెపుతూనే ఏ మాత్రం మనోధైర్యం కోల్పోకుండా నడిసొచ్చిన దారిలోని అవరోధాలన్నింటికి అధిగమించే ప్రయత్నం ఈ కావ్యంలో ప్రతి వాక్యంలో ప్రతిఫలిస్తుంది. గతం, వర్తమానాల మధ్య కదులుతూ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తాడు కవి.

*"కోల్పోయిన కోల్పోతున్న / మంగలిహక్కులకై*
*సంఘటితంగా ఒకే కులంగా*
*సామాజిక హక్కులకై రణం చేద్దాం*
*ఆధునికాభివృద్ధి / మంగలికుల వృత్తిదార్లుకే దక్కేటట్లు*
*సంఘీయులమేకమై సంఘటితంగా పోరాడుదాం"* అనే పిలుపునిస్తాడు. ఇటీవలి రాస్తున్న బీసీ కవులలో ఈనాటి రాజకీయ సమీకరణాలకు అనుగుణమైన చైతన్యం కనిపిస్తుంది. తమ కుల ప్రత్యేకతలను కవిత్వీకరిస్తూనే మిగతా బీసీ కులాలవారంతా సంఘటితమై పోరాటం చేసి సామాజిక న్యాయాన్ని సాధించుకోవాలనే స్పృహ అధికమైంది. అంబేద్కర్, పూలే తాత్విక ఆలోచనల్లోంచి అందుకున్న సైద్ధాంతిక శక్తితో ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. ఈ వరుసలో వనపట్ల సుబ్బయ్య కవిత్వంలో ఆ తీవ్రత కొత్త బ్లేడ్ అంత పదునుగా ఉంటుంది.

గ్రామీణ ప్రాంతాలలో బహుజన కులాల వృత్తులన్నీ ఒకదానిమీద ఒకటి ఆధారపడుతూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతాయి. శ్రామిక వృత్తిపనుల కులం వారు ఉత్పత్తికులాల వారికి అవసరమైన పనిముట్ల తయారీలో కీలకపాత్ర పోషిస్తారు. అనేక తరాలుగా వస్తున్న సహజమైన నైతిక బాధ్యతగా భావిస్తారు. ఈ అసిపెలోనూ కవి సమస్తవృత్తుల సహకర సమైక్యతను గాఢంగా కవిత్వీకరించాడు.

*"ఊపిరితిత్తుల్నే / తోలుతిత్తులుగా తాల్చి*
*దేహాన్ని కొలిమి చేసి / సబ్బండ వృత్తుల పనిముట్లను*
*పొదిగే విశ్వకర్మలు / కమ్మరి కొలిమి లేకపోతే*
*మా చేతుల కత్తులు కత్తెర్లులేవు.*
*పశువుల చర్మాన్ని శుద్ధిచేసి*
*తోలు సంచిని అందించిన చర్మకారులు*
*క్షౌర వృత్తికి తోలు సంచి / తోలు పెట్టేనందించిన*
*మాదిగ పెద్దయ్యలు / మాదిగ తాతలకు మహావందనాలు"*

అంటూ బహుజనుల మధ్య మానవ సంబంధాలు ఏవరూ విడదీయరానంత బలంగా ముడిపడివున్నాయనే చారిత్రక సత్యాన్ని, సామాజిక ఐక్యతా భావనను సుబ్బయ్య ఆర్ద్రంగా, ఆత్మీయంగా ఆవిష్కరించాడు.

ఈ అసిపె కావ్యం మంగలి కుల సాంస్కృతిక విశేషాలను, సామాజిక సేవను, పేగుబంధం లాంటి అనుబంధాలు అల్లుకున్న తీరును కాలం మూలాల్లోంచి వెలికితీసి వ్యాఖ్యానిస్తాడు. మనిషి బతుకులో కీలకమైన మలుపులో మంగలి చేసే శ్రామిక పనుల్లో ఎంత ఔన్నత్యపు సేవలు వున్నాయో కార్పోరేట్ తరానికి తెలియపరుస్తాడు.

*"అమ్మ / లోకానికి పుట్టుకనిస్తే*
*మంగలి మంత్రసాని*
*అమ్మల లోకానికి / పురుడు పోస్తాది"* అనడంలో ఎంతో విలువైన ప్రజా చికిత్సా సేవలు గుర్తుకు వస్తాయి. ప్రజా సమూహం అంటురోగాల బారిన పడకుండా, రసికారే రాచపుండు గాయాలకూ సైతం ప్రాథమిక వైద్యం చేసే సామాజిక వైద్యులైన మంగలి మౌలిక జ్ఞానాన్ని కవి మరోసారి లోకానికి గుర్తు చేస్తాడు. మరోవైపు **"సులువైన పని సుతారమైన పని, పెట్టుబడిలేని సంపాదనంటూ"** అనేక విధాలుగా ఎత్తిపొడుస్తూ ఎగతాళి చేసేవారికి ఘాటైన సమాధానమూ ఇస్తాడు సుబ్బయ్య.

**"సులువైన పనే, సుతారమైన పనే**
**మా కత్తులు మీకిస్తం / మీ భూములు మాకిస్తరా?**
**క్షౌరాలు మీరు చేయండి / ఉద్యోగాలు మేం చేస్తం**
**అధికారాలు మేమేలుతం**
**పొట్టలు కోసే మాటలు, గొంతులు కోసే కత్తులు మీవి"** అంటూ అధిపత్య కులాలు, ఆర్థికంగా ఎదిగిన బహుజన కులవాదుల అహంకారాన్ని నిర్భయంగా ఎదుర్కొంటాడు. మంగలికులాన్ని అవమానించే సామెతలను సైతం వదిలిపెట్టలేదు. **'సామెతల నోళ్ళను**

**ఫినాయిల్‌తో కడగాలనుంది'** అంటూ సామెతలతో అవమానించే మనుషుల స్వభావాన్ని యాసిడ్ మాటలతో కడిగిపారేస్తాడు. ప్రపంచీకరణ ప్రభావంతో తమ కుల వృత్తి సైతం కార్పొరేట్ పెట్టుబడి దారుల చేతుల్లోకి వెళ్ళి పోవడం చూసి అగ్రహోదగ్ధుడవుతాడు.

***"నావృత్తే / నా చావుదప్పు కొడుతున్నది***
***మా కత్తులు పట్టుకున్నట్లుగానే***
***మాతో వియ్యాలందుకుంటారా"*** అని ప్రశ్నిస్తాడు.

వనపట్ల కవిత్వంలో రాజకీయ స్పృహ పెరిగిపోయింది. పూలే ప్రవచించిన బహుజనం తత్వం ఒంటపట్టింది. ఆర్థికంగా బలోపేతులై భద్రజీవులైన కులాల వారు. అగ్రకుల అహంకార స్వభావాన్ని సంతరించుకుని చేస్తున్న ఆధిపత్యాన్ని సహించలేకపోతున్నాడు. డెబ్బై ఐదెండ్ల స్వతంత్ర రాజ్యంలో రాజ్యం చేస్తున్న అరాచకాన్ని భరించ లేకపోతున్నాడు. **'అంటరానితనం అంటగట్టిన / శాస్త్రాల గొంతులను కోయాలనుకుంటున్నాడు. కత్తికి సైతం మైలంటుగట్టిన / మనువాదుల భరతం పడుదాం'** అని ప్రతిన చేస్తాడు **"నిచ్చెన మెట్ల సమాజంలో / మనలోని మెట్లను / ముందుగా మనమే కూల్చుదాం"** అనే ఆత్మ విమర్శకు పురిగొల్పుతాడు. బహుజనులలో నెలకొన్న ఆత్మన్యూనతా గోడల్ని బద్దలు కొడుతాడు.

***"భూరికార్డులలో సెంట్‌భూమి లేనోళ్ళ***
***చట్టసభల్లో చరిత్ర లేనోళ్ళ...***
***చట్టాలు చేసేకాడ రాసేకాడ, కాసేకాడ, కూసేకాడ***
***మేం లేనప్పుడు మా బతుకులు***
***తాగేసిన బీడీ పీకలే గదా!"***

తన సామాజిక స్వరంలోంచి బాణంలా దూసుకొచ్చిన ఈ ప్రశ్నలు, ఈ నగ్నసత్యాలు ప్రజాస్వామ్య ఫలాలు దక్కని అన్ని కులాల వారికి సంబంధించినవే. ముఖ్యంగా బహుజనులకు బహుళంగా అభివృద్ధి జరగాలంటే బీసీలంతా నిర్దిష్టమైన రాజకీయ అస్తిత్వాన్ని స్థిరీకరించుకోవాలి. మనమెంత? మన వాటా ఎంత? అనేది తేలవలసిన తక్షణ పోరాట సందర్భంలో వున్నాం! ఆదిశగా అసిపెలో సుబ్బయ్య సృష్టమైన పిలుపునే ఇచ్చాడు.

ఈ దీర్ఘకావ్యంలో 'కత్తి' అనే పదం పలుమార్లు పునరావృత మవుతుంది. 'కత్తి' అనే పరికరం మంగలి వృత్తి జీవనంలో ప్రధానమైంది. వెంట్రుకను సైతం రెండుగా చీల్చగల పదునైన కత్తిని తయారు చేసుకున్నది మంగలులే. రాజు చేతిలోని కత్తిది సామ్రాజ్య వాదమయితే మంగళ్ళ చేతలో కత్తి ఆరోగ్య శాస్త్రంతో ముడిపడిన సౌందర్యవాదం. రాతియుగంనాటి నియాండెర్తాల్ మానవుడిని నాగరికుడిగా మార్చిన సాధనం. ఏ శాస్త్ర అధ్యయనం లేకుండానే శాస్త్రీయ పద్ధతులను రూపొందించిన మంగళ్ళ మేధస్సును సుబ్బయ్య సాధికారంగా ప్రకటిస్తాడు. స్వీయ వృత్తి జీవితాల ప్రాధాన్యతను, ప్రాశస్త్యాన్ని వర్ణించే క్రమంలో స్వోత్కర్షగా మారే ప్రమాదం కూడా ఉంది. ఇతర సామాజిక వర్గాలవారు కూడా సహానుభూతి చెందేలా నిజమే కదా అనే ఆలోచనలో పడాలి. ఈ దృష్టితో వీరిని మనమెందుకు చూడలేదనే పశ్చాతాప భావన కలగాలి. అసిపెలో సుబ్బయ్య సంయమనాత్మకంగా వర్ణిస్తూనే అందరిని స్వీయాత్మక చింతనలోకి తీసుకెళ్ళాడు.

దీర్ఘకవిత అంటే ఒక విషయాన్ని విస్తృతంగా సుదీర్ఘంగా వర్ణించడమే కాదు. తను తీసుకున్న వస్తువు చుట్టూ ఆవరించిన సమస్త విశేషాలను, అనేక సామాజిక కోణాలను, కవితా సాంద్రతతో వ్యక్తీకరించాలి. కవిత ఆరంభపు ఎత్తుగడ స్వరం ఎంత ఉన్నత స్థాయిలో కొనసాగిందో ముగింపు వాక్యం అదే స్థాయిని నిలుపుకోవాలి. అసిపెలోనూ, కవి స్వరం భావోద్విగ్నత కిందికి జారలేదు. వస్తువు తన వృత్తి కాబట్టి అందులో సంలీనమైపోయాడు. తన వాళ్ళ కోసం కలవరించాడు. కలలోను తమలాంటి వాళ్ళ వేదనను పలవరించాడు. చరిత్రపొదవునా విస్మరణకు గురైన సామాజిక సత్యాలను వెల్లడించాడు. నాగరికత పరిణామ వికాసంలో మంగలి వృత్తి అందించిన మౌలిక విషయాలన్నింటిని చర్చించింది. చరిత్రలో తమకు దక్కవలసిన స్థాయిని, కోల్పోయిన ఆత్మగౌరవాన్ని, ఔన్నత్యాన్ని పునర్మూల్యాంకనం చేసింది.

అసిపె ఊహల్లోంచి ఉబికివచ్చిన కాల్పనిక కావ్యం కాదు. శరీరం మీది సూక్ష్మరంధ్రాల్లోంచి స్వేదం వచ్చినంత సహజంగా ఉద్భవించిన కావ్యం. చెమట చుక్కలో ఎంత శ్రామిక వ్యథ వుంటుందో అసిపెలోని ప్రతి వాక్యంలో అంతటి చారిత్రక దుఃఖ గాథ దాగి వుంది. కత్తి పట్టిన మంగలి తన జీవితాన్ని నిత్యం గడుపుతూ నెత్తురోడుతున్నా ఎవరి గాయపరచలేదు. ఇది సమాజంలోని మలినాన్ని కడిగేసే కావ్యం. ఇది మైలపడని కవిత్వం. కొందరు సాహిత్యకులు తమ అస్తిత్వం కోల్పోయేంత విధేయతతో ఇతర వాదాల ప్రశస్తి పశంసల ప్రచారకీర్తిలో కూరుకపోయి బహుజన సాహిత్యాన్ని విస్మరిస్తున్నారు. ఈ సందర్భంలో సుబ్బయ్య మైలపోలు తీసేలా తన ఆగ్రహ ధిక్కార స్వరాన్ని బిగ్గరగా వినిపించాడు.

సుబ్బయ్య పనిలేని మంగలి కాదు. కత్తెర కదలకపోతే కంచంలో మెతుకులు రావనే స్పృహ ఉన్నవాడు. చేతినిండా పని వున్నా తన ఆకలిని సైతం పక్కన పెట్టి బహుజన సాహితోద్యమాలకు రాజ్యాధికార రక్తాన్ని ఎక్కిస్తున్నాడు. అసిపె బహుజనుల అస్తిత్వ సాధికారికతను నిలబెట్టే మంగళోపనిషత్తు!

**ఆధార గ్రంథాలు :**

1. వెంటాడే కలాలు – సం. జూలూరు గౌరీశంకర్
2. సమూహం (బిసి అస్తిత్వవాద యువ కవిత్వం) – సం. చింతం ప్రవీణ్ కుమార్
3. తెలంగాణ బిసివాద సాహిత్యం – అట్టెం దత్తయ్య
4. అసిపె (దీర్ఘకావ్యం) – వనపట్ల సుబ్బయ్య
5. మన తత్త్వం (దళిత బహుజన తాత్త్వికత) – ప్రొ. కంచ ఐలయ్య
6. ఉత్పత్తి – తెలుగు సాహిత్య వారసత్వం – – ప్రొ. కంచ ఐలయ్య

❖ ❖ ❖ ❖ ❖

# కవిత్వపు కొత్త కాలమానం – 'అనిర్వచనం' కవితా సంపుటి

**డా. పి. విజయకుమార్,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 9063702546

మనిషిని ఆధునిక వ్యామోహావేశం ఆవహించినపుడు, డిజిటల్ కాలుష్యం టవర్ల కొద్దీ కమ్ముకున్నప్పుడు, మట్టి మనుగడ కోసం ఆక్రోశించినపుడు, మనశ్శరీరాలు అదుపు తప్పినప్పుడు, జీవితం నిస్సారంగా మారినపుడు, ప్రతి సంక్లిష్ట సందర్భంలో మోహాన్ని జయించాలన్న తపన ఎమ్వీ రామిరెడ్డి 'అనిర్వచనం' కవితాసంపుటిలో ప్రతి అక్షరంలో ప్రతిధ్వనిస్తుంది.

**సమాజం – నవ్యత – మానవీయత**

మట్టికి మనిషికి విడదీయరాని అనుబంధం; మనిషికేనా రోదన మట్టికి కూడా రోదన ఉందని మర్మమెరిగిన మనీషిగా మానవీయ కోణంలో కవిత్వాన్ని సృజించాడు. మట్టిని మించిన ముడిపదార్థం లేదని మట్టిలోనే తొలకరి అయ్యేదని, కరువు కన్నెర్రజేసిన కాలంలోనూ కడుపు నింపేదని, మట్టిపేగులు మనుషుల్ని కలిపి ఉంచిన కాలానికి ప్రత్యక్షసాక్షిని నేనంటాడు. కాలం మారింది. మట్టిలోంచి ఇప్పుడు అత్యాధునిక తంత్రాలొచ్చాయి. మట్టిలో పరిమళం మాయమయ్యిందని, సున్నంగళ్లు కళ్లు విప్పి, గజాలు డాలర్ల ట్యాగులు తొడుక్కొని కుశల ప్రశ్నలు సైతం డబ్బు కంపు కొట్టి మట్టి వింతగా నవ్వింది అంటాడు. మావూరి మట్టిప్పుడు మూగగా రోదిస్తుందని కాలంతో పాటు వేగంగా వస్తున్న మార్పుల్ని కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించాడు. దైనందిన దైవాలుగా, అనివార్య ఆయుధాలుగా డిజిటల్ శక్తులు మన మీదికి మూకుమ్మడి దాడి చేస్తున్నాయంటాడు. కనిపించే వస్తువులు, కనిపించని కత్తులు దూస్తూ రెండు ప్రపంచాలు ఎప్పటికీ ఏకం కాకుండా నిరంతరం మత్తు కోర్కెను ఎగదోస్తున్నాయంటాడు. వీటిని ప్రతిఘటించడానికి సిద్ధం కండి అంటూ పిలుపునిచ్చాడు. సమాజ, సాహిత్య పరిణామాలను లోతుగా అన్వేషించినవాడు కావడం వల్ల సమాజంలో అనేక పార్శ్వాలలో సమస్యల స్వరూపాన్ని సమదృష్టితో సృజించిన సవ్యసాచి ఎమ్వీ రామిరెడ్డి.

నేల నాదేనని విర్రవీగినప్పుడు, కాంక్షాజ్వాలతో అడవికి నిప్పంటించినప్పుడో, ప్లాస్టిక్ దేగల కళేబరాలను నదీతీరాల వెంట గుట్టలుగా వదిలేసినప్పుడో, దేహం నిండా మురికి కాల్వల హోరు వినిపించినపుడైనా, జన్మరహస్యాన్ని పునశ్చరణ చేసుకొని, కాలుష్య కారక మూలకాలను పసిగట్టి దేహానికి ప్రకృతి చికిత్స అందించాలి అంటూ 'జన్మరహస్యం' కవితలో నినదిస్తాడు.

ప్రతి మాటను మంత్రాక్షరంగా, సజీవ చైతన్యంగా రూపుదిద్దడం రామిరెడ్డికి వెన్నతో పెట్టిన విద్య. మాటలన్నీ రక్తం పంచుకొని పుట్టవు. కొన్ని రంగులు పులుముకుని, ఇంకొన్ని ఈకలు తొడుక్కుని మరికొన్ని మంత్రాలు నేర్చుకొనీ మరీ పుడతాయంటాడు. కానీ మాటలన్నీ ముసుగులు ధరించి జన్మించవు; కొన్ని రెక్కలు విప్పుకొంటూ ఇంకొన్ని నగ్నదేహాలతో నర్తిస్తూ మరికొన్ని రక్తరాగ రంజితాలై పరిమళిస్తాయంటాడు.

సాంకేతికతను సరికొత్త కోణంలో ప్రశ్నిస్తారు. మన నిలువెల్లా మొలుచుకొచ్చిన సరికొత్త సాంకేతికావయవాలు స్పైవేర్ జ్వరంతో వణుకుతుంటాయి. అత్యాధునిక సమాచార స్వర్గధామాలు మరుగుతున్న నూనెలో వేగుతుంటాయి. గేట్లు బార్లా తెరిచి రక్తపరీక్షల ఫలితాలను బహిరంగ మార్కెట్లో ప్రదర్శనకు పెడుతుంటాయి. అన్నీ సమస్త గుట్టుమట్టుల్నీ మట్టుబెట్టడమే, రట్టు చేయడమే అనాది వారసత్వంగా భావిస్తాడు.

**దగ్ధాంతరంగం**

చూసే చూపును బట్టి కవి దార్శనికత స్పష్టమవుతుంది. విత్తులో బ్రహ్మాండం ఉందంటుంది సమాజం. నాకేమో మొలకెత్తని ప్రతిగింజా మృతశిశువే అంటారు. మొక్క ప్రపంచాన్ని నిలబెడుతుందంటావు నువ్వు. మొక్కై వంగకూడదని మొక్కుకుంటాన్నేను అంటాడు కవి. **'ప్రతి చేను, నూతన వస్త్రంలా కనిపిస్తుందంటావు, అది కలలో కూడా ఉరితాడులా కనిపించకూడదని ప్రార్థిస్తుంటాన్నేను'.** దృక్కోణంలో ఎంత విలక్షణత ఉందో పై కవితోక్తులను చూస్తే స్పష్టమవుతుంది. పత్తిరైతుల ఆత్మహత్యలను ఎంత హృద్యంగా సంభాషణాత్మకంగా దగ్ధాంతరంగాన్ని ఆవిష్కరించడం కవి సున్నిత మనస్తత్వానికి నిదర్శనం. కాలి బూడిదవుతున్న సందర్భాలను లెక్కించడం కష్టమే. అశరీరంగా విస్తరిస్తున్న గాయాలను పసిగట్టడం అసాధ్యమేనంటాడు. మార్మిక రహస్యాల రణభేరీ తప్ప మారణాయుధాల ఆచూకీ ఉండదని, జీవన వాణిజ్య మరణదండన తప్ప ఉరితాళ్ల ఉనికి కనిపించడం లేదంటూ ఆవేదన వెలిబుచ్చుతాడు.

**స్మార్ట్ యుగం – సార్వజనీనత**

**'ప్రేమంటే' / బహుమతుల ఎర / కానుకల కొలమానం / నీటి మీద శిలాఫలకాల ప్రతిష్ఠ / ముళ్ల లోపలికి ముడిచి కౌగిలింతకు ఆహ్వానం పలకటం** అని 'అనిర్వచనం' పేరిట భాష్యం చెప్తారు. భూగోళం నీ చేతిలో బందీ అయిందని గాలిలో తేలిపోతుంటావు. ఎర్ర రక్తకణాలు నీ శరీరాన్ని ఖాళీ చేస్తున్న నగ్నసత్యం నీకు లీలగానైనా

తెలిసే అవకాశం లేదంటాడు. విజయగర్వం వైఫైలా నిరంతరం నీ చుట్టూ పరిభ్రమిస్తుంటుందంటాడు.

**ముఖపుస్తకంలో మునకలేసి**
**ఊపిరాడక ఉసురు తీసుకునే**
**గడియారాల సంఖ్య ఎప్పటికి లెక్కతేలదు**
**పంచదార గోళీల ట్వీట్లు**
**దేహంలో మధుమేహంలా విస్తరిస్తున్న సంగతి**
**ఎక్కడా స్కానింగ్‌కు దొరకదు**
**రంగులు పులిమిన చిత్రాల నగ్నత్వాన్ని**
**నీ ఇన్‌స్టాగ్రామ్ నాసిక పసిగట్టలేదు**
**నిమిషానికోసారి నువ్వు**
**వాట్సాప్ వాగులో కొట్టుకుపోతున్న విషయం**
**నడిరూము దాటినా వెలుగులీనే అవకాశం లేదు.**

స్మార్ట్ యుగం సెలైన్‌లా నీ నరనరాల్లోకి ఇంకిపోతున్న ప్రక్రియ ఖండాంతరాల కనుసన్నల్లో రికార్డవుతూ ఉంటుంది. ఇలా అనేక కోణాల్లో ఖాళీ అవుతున్న మనిషితనాన్ని చెప్పి మేల్కొల్పుతున్నాడు. కాబట్టి మిత్రమా **రా! గుప్పిట పట్టి ఆకాశాన్ని విడుదల చేద్దాం / భూగోళాన్ని బొంగరాలాట ఆడుకోనిద్దాం / మూడోపాదపు పాస్‌వర్డ్‌ని హ్యాక్ చేసి / మనిషికి మళ్ళీ రెక్కలు మొలిపిద్దాం / ధూళి కణాలకు వెబ్ సంకెళ్లు విడిపించి / చారెడు నేలను సాగు చేసుకుందాం / వేళ్ళకొసల మీద జీవన సూర్యుళ్లను మేల్కొలుపుదాం / ఖాళీ అవుతున్న మనిషిని రక్తమాంసాలతో నింపేద్దాం** అని పిలుపునిస్తున్నాడు.

**అంతరాలయం**

మనుషుల మధ్య అంతరాలు అంతకంతకు పెరుగుతున్న నేపథ్యం సమాజంలో కన్పిస్తుంది. మనుషుల మధ్య దూరాలను కొలవటానికి వినూత్న కొలమానాలు కనిపెట్టాల్సిన సమయంలో నేలంతా ఆక్రమించటానికి సిద్ధమైన సంధి కాలంలో కాలం కన్నెర్రజేసి భూగోళాన్ని గద్దిస్తుంది. కొత్తగా కోల్పోయిందేమీ లేదు అది మిడిసిపడిన అహంభావాలూ, తెగిపడిన అహంకారాలూ తప్ప అంటాడు.

జ్యోతిర్లింగాలూ, కలియుగదైవాలు, పుణ్యధామాలు, సన్నిధానాలు సరేగాని నీ లోపలి ఆలయం గురించి తెలుసా అంటూ అంతరాలయం గురించి వివేచించమంటాడు.

**"అంతరాలయ సందర్శనకు సుప్రభాతాలక్కర్లేదు**
**అంతర్విరాట్టును మేల్కొల్పేందుకు మేళతాళాలక్కర్లేదు**
**మనసు ద్వారాలు మౌనంగా తెరవాలి**
**ఒక ప్రక్షాళన గోపురమై ఎదగాలి**
**సాచిన చేయి ధ్వజస్తంభమై నిలవాలి**
**నగ్న హృదయం గర్భగుడిలో నిక్షిప్తం కావాలి"**

అంతశ్చేతనతో అంతరాలయం దర్శించి, వివేచన చేసుకోవాలని పిలుపునిస్తాడు. జీవితం ఒక మహా నిర్మాణం అని, నిరంతరం మరమ్మతులకు అది కేంద్రకం అంటాడు.

**"బోధివృక్షం నీడలోంచి బయటికొచ్చాను**
**మంటల తొడుగులు మాయమయ్యాయి**
**గాయాల పొక్కులు రాలిపోయాయి**
**ఎడారిలో వర్షం మొదలయింది**
**ఖండిత విభాగాలన్నీ జట్టు కట్టాయి**
**నా దేహ పునర్నిర్మాణం మొదలైంది"** అంటాడు. కవి ఆలోచనల వారధిని అంతుబట్టలేం. అత్యద్భుత ఊహాశిల్పంలో విహరించి సామాజిక శ్రేయస్సు కోసం పరితపించే తత్త్వం స్పష్టంగా కన్పిస్తుంది.

**పంచభూతాలే పెట్టుబడులు / ప్రకృతి వనరులే సేంద్రియ సేద్యసాధనాలు / నాలుగు ఋతువులు ఆలస్యం అయితే కావచ్చు / ఈ చారెడు పంట సహజాతి సహజంగా / నేల నలుచెరగులా పచ్చపచ్చగా కమ్ముకుపోవాలని** ప్రకృతి వ్యవసాయంలో పునీతమవుతున్న వారిని గూర్చి తరించడం జరిగింది.

**"తల/ పాదాలను బతిమాలింది / స్థానభ్రంశం సాధ్యమైంది / మెదడు / మోకాళ్లను వేడుకొంది / విధులు విలోమమయ్యాయి / కళ్లు / నడినెత్తికి వల వేశాయి / చూపులు ఆకాశానికి దఖలు పడ్డాయి / నాలుక / నరాలతో కూడబలుక్కొని నీలుక్కుపోయింది / మాటలు రంగు రుచి వాసనా కోల్పోయాయి / గొంతు / స్వరపేటికతో విడాకులు తీసుకుంది / నినాదాలు నీరసించి నిద్రలో జోగుతున్నాయి".** మనిషిప్పుడు అవయవాతీతమైన అశాంతితో రగిలిపోతున్నాడు అని సరికొత్త వ్యాఖ్యానం వెలిబుచ్చారు.

**కార్యశీలి**

**"నాగేటి చాళ్లలో నాటిన విత్తనాలు / నా పాఠ్యపుస్తకాలై మొలకెత్తాయి / పత్తి చేల కలుపు తీతల్లో నలిగిన నరాలు / నా బతుకు గుండెకు రక్తం సరఫరా చేశాయి / మిర్చికోతల్లో మినపకళ్లాల్లో కమిలిన ఊపిరితిత్తులు / నా ఉచ్ఛ్వాస విశ్వాసల్లో గాలిమరలు అమర్చాయి / ప్రతి పొద్దూ పశులపాకలో చిందిన శ్వేత బిందువులు / నా గమ్యమర్మాలను తేటతెల్లం చేశాయి. అవసరం దాడి చేసినప్పుడల్లా తప్పని చేబదుళ్లు / నా స్వప్న సౌధాలను రంగులతో అలంకరించాయి".** ఇలా తన జీవన గమనంలో ఎదుర్కొన్న కష్టాల కడగండ్లను చక్కగా ప్రేరణాత్మకంగా, పదిమందికి మార్గదర్శకంగా అక్షరబద్ధం చేశారు. అయితే ఈ చెమట కావ్యాలు, గురుతర వేదాలు రాసింది నాన్న కాదు 'అమ్మ' అంటారు. అమ్మను కార్యశీలిగా అభివర్ణించిన తీరు అనిర్వచనీయం.

ప్రకృతిని ఆస్వాదించడం, సృష్టిలో ప్రతి ఒక్కటి చెప్పకనే చెప్పే తాత్త్వికత తప్పని సరిగా ఉంటుంది. ఆ రహస్యాన్ని ఛేదించే ప్రయత్నం

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 (56) హైదరాబాద్ ఆగస్టు : 2024

ప్రకృతి పట్ల ప్రియత్వం, తన 'కొండల దారిలో' స్పష్టమవుతోంది.

**అడవి / అప్పుడే మంచు దుప్పటి తొలగించి / ఒళ్లు విరుచుకుంటూ / వ్యాయామానికి సిద్ధమవుతోంది / చెట్లు / రాత్రి వానలో తలారా స్నానం చేసి / నీరెండలో / కురులార బెట్టుకుంటున్నాయి. / మేఘాలు / వలపు వలలు విసిరి / వాగుల్ని / ముగ్గులోకి దించుతున్నాయి / పక్షులు స్వేచ్ఛగా గానం చేస్తూ, సంకెళ్లను పుటుక్కున తెంచేస్తున్నాయి. అల్లరి పిల్లగాలి జీడిమామిడి తోటల్లో దూరి బుగ్గ తుడుచుకుంటూ బయటికి పరుగులు తీస్తోంది.** ఇలాంటి భావుకత ప్రకృతితో మమేకమైతేనే ఊహాశిల్పం అక్షరాకృతి రూపుదిద్దుకుంటుంది. భూమిలో పాతిన విత్తనం భూమిలోనే సమాధి అయినపుడు ఎందుకలాగ అని విత్తన సృష్టికర్తను రైతు ప్రశ్నించలేదు. ఎన్ని మందులు కొట్టినా పురుగు చేసిన గాయాలు మానిపోనప్పుడు ఎందుకలాగ అని పెస్టిసైడ్ దుకాణాన్ని రైతు ప్రశ్నించలేదు. కళ్లాల మీద విశ్రమించిన ధాన్యం రాత్రికి రాత్రే పెనుతుపానులో లీనమైపోయినప్పుడు ఎందుకలాగా అని ఏనాడు రైతు ప్రకృతిని ప్రశ్నించలేదు. మార్కెట్టు యార్డులో రోజులతరబడి విసిగివేసారి, అయినకాడికి తెగ నమ్ముకున్నప్పుడు కూడా ఎందుకలాగ అని బేరగాళ్లను ప్రశ్నించలేదు.

**"గింజల్ని ముస్తాబు చేసి**
**దేశంలో ఎక్కడైనా అమ్మకానికి పెట్టొచ్చని చెప్పి**
**గిట్టుబాటు గొంతుపై ఇనపపాదం మోపినప్పుడు మాత్రం**
**అతడు గొంతు విప్పాడు, ఎందుకలాగ అని ప్రశ్నించాడు"**

రైతు దైన్యాన్ని సహనాన్ని, త్యాగగుణాన్ని ఆవేదనని 'నాగళ్లఘోష' కవిత ద్వారా దృశ్యాన్ని కళ్ళకి కట్టినట్లు చిత్రించాడు.

**కవిత్వపు కొత్త కొలమానాలు**

గంటలు మోగుతుంటాయి కాని మాటలు వినబడవు. గునపాలు దిగుతుంటాయి కాని గాయాలు కనబడవు. నిర్జీవ చైతన్యంతో నిలువీతలు తలకిందులవుతుంటాయి అంటాడు. అయితే సమయం ఆసన్నమైందని కొత్త కొలమానాలు కనిపెట్టాలంటాడు. కాలాన్ని ఛిద్రం చేస్తున్న అవిశ్రాంత అసందర్భ ధ్వనులను, అనివార్య వలయాల కవతల వ్యర్థాల బుట్టలో తొక్కిపెట్టాలి అంటాడు. మంచిగంధం లాగా పరిమళించే మానవత్వం రామిరెడ్డి గారికి సహజ అలంకారం. తనకు జన్మనిచ్చిన జన్మభూమి ఋణం తీర్చుకోవడానికి తండ్రి పేరిట స్మారక 'భవన బోధి'ని నిర్మించి వృద్ధాశ్రమం నెలకొల్పి వృద్ధుల సేవలో తరించి, అక్కడే ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న జ్ఞానప్రదాత ఎమ్వీ రామిరెడ్డి.


**"ఏ క్షణాన ఓ సంకల్పం**
**మదిలోనూ మట్టిలోనూ విత్తనమై మొలకెత్తిందో**
**ఇంతలోనే నీడనిచ్చే మహావృక్షమై నిలబడింది**
**ఇప్పుడా చెట్టు కింద**
**బాలబుద్ధులు జ్ఞానోపదేశం పొందుతున్నారు**
**వందలాది పక్షులు**
**ఉపాధి హామీ మంత్రాలు పఠిస్తున్నాయి**
**పెద్దలు రెండో బాల్యంలో మునకలేస్తున్నారు"**

ఆదిమ గురుపీఠంగా, సత్స్వప్నాలను సాకారం చేసే మహిమాన్విత దీపం భవనబోధిని నిర్మించి, జన్మభూమిలో జన్మసార్థక్యం చేసుకున్న మహోన్నతమైన మనీషి ఎమ్వీ రామిరెడ్డి.

ఎమ్వీ రామిరెడ్డి 'అనిర్వచనం' కవితా సంపుటి సమకాలీన సమస్యలకు స్పర్శవేదిగా భావించాలి. ప్రతి కవితాఖండిక నవీన సమాజంలో సమస్యలకు దర్పణంగా పేర్కొనాలి. విశేషమైన పదసంపద కల్గిన జ్ఞాన భాండాగారం రామిరెడ్డి సొత్తు. వీరి ఊహాశిల్పాన్ని అందుకోవడం అంత సులభం కాదు. సమస్యను చూసే చూపులో విలక్షణత, కొత్తకొలమానాల ఎంపిక, సమస్యకు సొల్యూషన్ చెప్పడంలో నవీనత 'అనిర్వచనం' కవితా సంపుటిలో గమ్యమానమయ్యాయి. కాలం కంటిచూపు మందగించినప్పుడల్లా నేత్రద్వయమై విచ్చుకునే విజ్ఞాన కాంతిపుంజంగా ఎమ్వీ రామిరెడ్డి కవిత్వం చిరస్మరణీయంగా సాహితీలోకంలో నిలిచిపోతుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. అనిర్వచనం – ఎమ్వీ రామిరెడ్డి
2. అనేక – అఫ్సర్, వంశీకృష్ణ
3. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు, ప్రయోగాలు – డా॥ సి. నారాయణరెడ్డి
4. ఇరవై శతాబ్దపు తెలుగు కవిత్వం – డా॥ కడియాల రామమోహన్‌రాయ్
5. కవిత్వం ఓ సామాజిక చైతన్యం – డా॥ రాధేయ
6. తెలుగు కవితా వికాసం – డా॥ కడియాల రామమోహన్‌రాయ్
7. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – వెల్చేరు నారాయణరావు
8. దశాబ్ది కవిత – డా॥ ఎస్వీ సత్యనారాయణ, డా॥ పెన్నా శివరామకృష్ణ



'చరిత్ర' అంటే గతమని కొట్టిపారేసేది కాదు. అవసరం లేదంటూ మరచిపోయేది అంతకంటే కాదు. మన మనుగడకు పథ నిర్దేశం చేసే వెలుగే చరిత్ర. అలనాటి ప్రజా జీవన మాధుర్యాన్ని, సంస్కృతీ వైభవాలను, ఆచార వ్యవహారాల అనుభూతులను, పాలనా దక్షతలను, కళాపోషణలను, పాండితీ గరిమలను, వ్యావసాయిక, వృత్తిపరమైన పనులను మొదలగు అనేక అంశాలను కూర్చి అనుభవ సారాన్ని మన ఎడదల్లోకి నింపే అపూర్వ భాండాగారమే చరిత్ర. గతంలో జరిగిన అనేక వైఫల్యాలు కూడా మనకు గుణపాఠాలను నేర్పుతాయి. తద్వారా మంచి చెడుల విచక్షణా జ్ఞానం కూడా మనకు ఏర్పడుతుంది. అటువంటి చరిత్రను తెలుసుకోవాలంటే శాసనాలే మనకు ఆధారం. శాసనం అంటే ఒక ప్రకటన, ఒక చట్టం.

పూర్వకాలంలో తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన రాజవంశీయులు వెలువరించిన శాసనాలు తెలంగాణ వైభవానికి ఆధారంగా మనకు లభిస్తున్నాయి. తెలంగాణలో శాసనాలను వెలికితీసినవారు బి.ఎన్.శాస్త్రి గారు. బాల్యం నుండీ పరిశోధన పట్ల ఆసక్తులైన శాస్త్రిగారు, కొమర్రాజు లక్ష్మణరావు గారు, మల్లంపల్లి సోమశేఖర శర్మ గారి తర్వాత అంతటి పరిశోధనా వాఙ్మయాన్ని తెలుగు వారికి అందించి **'శాసనాల శాస్త్రి'**గా పేరు పొంది జీవితాన్ని సార్థకం చేసుకున్నారు.

ఆయన కూతురు భిన్నూరి మనోహరి గారు తండ్రి పరిశోధనలను నిశితంగా చూస్తూ, తన వంతు సహకారం చేస్తూ ఎదిగారు. ఆ వారసత్వాన్ని తనదిగా చేసుకొని తండ్రి ఆశయాన్ని నెరవేర్చడంలో ప్రత్యేకతను నిల్పుకుంటూ అదే దిశగా ముందుకు సాగుతున్నారు. శాసనాల పట్ల ఆమె ఏర్పరచుకున్న ఆసక్తి **"ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు"** అనే అంశం పట్ల ఆమెను పి హెచ్ డి చేయడానికి పురికొల్పి, పట్టాను అందుకునేలా చేసింది.

ఆమె ఎంతగానో శ్రమించి, పరిశీలించి నూరు ప్రముఖ శాసనాలను గురించి రాసిన వ్యాసాలు 'నమస్తే తెలంగాణ' పత్రికలో **'శాసనపర్వం'** అనే ప్రత్యేక కాలమ్ క్రింద రెండు సంవత్సరాలు వరుసగా వెలువడ్డాయి. వాటన్నింటినీ 'శాసనపర్వం' పేరుతో సంకలనంగా వేయడం చరిత్రను ఒక్క రాశిగా కూర్చి పాఠకులకు అందించడమే. సరళరీతిలో రచయిత్రి వాటిని వివరించిన తీరు ఎటువంటి వారికైనా శాసనాల పట్ల ఆకర్షితులను చేస్తుందనడంలో సందేహమక్కరలేదు.

5, 6 శతాబ్దాల క్రితం విష్ణుకుండినుల నుండి కుతుబ్‌షాహీ వంశస్తుల వరకు క్రమానుగతంగా రచయిత్రి శాసనాలను ఉటంకించిన రీతి ఆమె ప్రతిభకు తార్కాణంగా నిలుస్తుంది. తెలంగాణా ప్రాంతాన్ని పాలించిన అనేక రాజవంశాల్లో తొంభై శాతం వరకు దాన శాసనాలుండడం ఆయా రాజవంశీయుల దానశీలతకు సాక్ష్యాలు. ధర్మశాసనాలు, ఒప్పంద శాసనాలు, ఆర్థిక పరమైన, యుద్ధపరమైన, ప్రజోపయోగ నిర్మాణపరమైన శాసనాలు మనకు లభ్యమవుతున్నాయి. ఇవన్నీ చరిత్రమూలాలుగా మనం గమనించవచ్చు.

# శాసన మరందము

**ధూళిపాళ అరుణ,** ఫోన్ : 87123 42323


తెలంగాణా ప్రాంతంలోని శాసనాల్లో సిముకుని నాణాలు, వాటి మీద ఉన్న లిపి మొదటి శాసనాలుగా పరిగణించవచ్చు. మొదటి సంస్కృత శాసనంగా విష్ణుకుండిన గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనం, మొదటి ప్రాకృత శాసనంగా వర్ధమానుకోట ఉపాసికాయ బుద్ధర క్షిత్రాయదాన శాసనం, మొదటి పద్య శాసనంగా జినవల్లభుని కుర్క్యాల శాసనం, మొదటి గద్యశాసనంగా కొరవి శాసనం వెలువడ్డాయి. బి.ఎన్.శాస్త్రిగారు నల్లగొండ జిల్లా రామన్నపేట తాలూకాలోని తుమ్మలగూడెంలో గోవిందవర్మ ఇంద్రపాల నగర శాసనాన్ని, విక్రమేంద్ర భట్టారక వర్మ ఇంద్రపాలనగర శాసనాన్ని మొదటగా వెలుగులోకి తెచ్చారు. ఇవి రెండూ తామ్ర శాసనాలు. వీటివల్ల విష్ణు కుండినులు మొదటగా బౌద్ధ మతాన్ని ఆదరించారని, ఆ తర్వాతే వైదిక మతానురక్తులు అయినట్టు తెలుస్తుంది. ఈ రెండు శాసనాలు ఆంధ్రదేశ శాసన చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందాయి.

నేటి హైదరాబాద్‌లో చైతన్యపురిగా పిలువబడే ప్రాంతంలో ఉన్నటువంటి కొండపై కొసగుండ్ల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఉంది. అక్కడ ప్రాకృతభాషలో ఉన్న శాసన భాషను బట్టి అది క్రీ.శ. 4 వ శతాబ్ది చివరి ముప్పయి సంవత్సరాలకు చెందినదిగా శాస్త్రిగారు భావించారు. ఈ శాసనాన్ని బట్టి ఆ ప్రాంతంలో గొప్ప బౌద్ధ విహారం ఉన్నట్టు తెలుస్తుంది. ఇంతటి మహోన్నత చరితగల హైదరాబాదు నగర ప్రాచీనతను పురావస్తు శాఖ వారు అందరూ గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్ష వెలిబుచ్చారు.

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో లభ్యమైనది 'కుర్క్యాల' శాసనం. దీన్ని కన్నడ ఆదికవి పంప మహాకవి తమ్ముడు జినవల్లభుడు వేయించాడని తెలుస్తున్నది. తెలుగు భాష క్రీ.శ. 9,10 శతాబ్దాలలోనే విస్తరించిందనడానికి పూర్తి ఆధారితమైన శాసనం. కందపద్యాల్లో ఉన్న మొట్టమొదటి పద్య శాసనం. ఈ శాసనం ఇటు తెలుగు, అటు కన్నడ వారికి అత్యంత ముఖ్యమైనది.

పశ్చిమ చాళుక్య రాజైన జగదేకమల్ల జయసింహుడు వేయించిన శాసనం సైదాపూర్ శాసనం. ఇందులో ముఖ్యంగా అగ్గలయ్య అనే వైద్యుని ప్రత్యేకతలు తెలుపబడ్డాయి. అగ్గలయ్య ఆయుర్వేద విద్య, శస్త్రవిద్యలోను ప్రావీణ్యం కలవాడు. జైన మత గురువు. ఇతని చేతిలో నయం కాని వ్యాధి లేదన్నంత కీర్తి గడించాడు. తెలంగాణ ప్రాంతంలో ప్రాచీన, మధ్య యుగ చరిత్రలో ఎంతోమంది వైద్యవిద్యలో ఆరితేరిన వారున్నారని ఫణిగిరి, ఏలేశ్వరం, నాగార్జునకొండ శాసనాల్లో ఈ ప్రస్తావన ఉందని తెలుపుతూ ఇంకా పరిశోధనలు కొనసాగితే ఇలాంటివెన్నో వెలుగులోకి రాగలవని మనోహరి గారు అభిప్రాయం వ్యక్తం చేస్తారు.

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10 (58) హైదరాబాద్ ఆగస్టు : 2024




శాసన పర్వం
(తెలంగాణ శతశాసనాల పరిచయం)
డా. భిన్నూరి మనోహరి
వెల : 300/-
మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె/ ఎల్ఐజి 10, బతుకమ్మ కుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 934 797 1133

పశ్చిమ కల్యాణి చాళుక్యులలో త్రిభువన మల్ల ఆరవ విక్రమాదిత్యుని పట్టపురాణి మన్నాదేవి. ఈమె వేయించిన శాసనాలు అలంపురంలో లభ్యమవుతున్నాయి. ఈ శాసనాల్లో ఆమె అభినవ సరస్వతిగా కీర్తించబడిందని తెలుస్తోంది. అంతేకాదు ఉభయ మార్గ నృత్య విద్యా సరస్వతి అనికూడా పేర్కొనబడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆమె నిజంగానే అంతటి పాండిత్యం సంపాదించిందా అనే విషయంలో ఇంకా స్పష్టత రావాలని, దీనిపై పరిశోధన జరగాల్సి ఉందని అంటారు మనోహరి గారు.

జనగామ జిల్లాలోని గూడూరు శాసనం సైన్యాధ్యక్షుని భార్య మిరియాల కామసానికి సంబంధించిన వివరాలను తెలుపుతుంది. కాకతీయ సామ్రాజ్యం గొప్పగా వెలుగొందడానికి ఆమె కారకురాలైంది. ఈ శాసనం కామసాని శాసనంగానే చెప్పబడుతోంది. ఆమే ఈ శాసనం వేయించిందని, ఆమె కవయిత్రి అని భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఈ శాసనం చివర సూత్రధారి కొమ్మోజు అని ఉండడం వల్ల ఇది కొమ్మోజు లిఖించాడని చెప్పవచ్చు.

పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో లభిస్తున్న మైలాంబిక పానగల్లు శాసనం వ్యాపార సంస్థలు చెల్లించాల్సిన సుంకాలను తెలియజేసేదిగా ఉండడం గమనార్హం. తొండరసచోళుని భార్య మైలాంబిక వేయించిన శాసనమిది. వీరి శిల్పకళ కాకతీయుల శిల్పకళకు బాటలు వేసింది.

కాకతీయ మహారాజు రుద్రదేవుడు వేయించిన అనుమకొండ శాసనం ప్రసిద్ధి చెందింది. దీన్ని రచించిన అచింతేంద్రయతి కావ్యలక్షణాలతో కూడిన శాసన కావ్యంగా రచించడం విశేషం. మధురమైన కవిత్వంతో కావ్యరసాన్ని పండించి, కాకతీయుల వైభవాన్ని చాటిన ఈ శాసనకర్తను రచయిత్రి ప్రశంసిస్తారు.

విరియాల వంశంలో పుట్టిన మైలమ ప్రతిభావంతురాలైన స్త్రీ. ఆమె వేయించిన శాసనం కటుకూరు శాసనం. అపర దానశీలి మైలమ. ఆమె భర్త చౌండసేనాని ఆమెను పురాణ స్త్రీల కంటే గొప్పదిగా, సకల సద్గుణవంతురాలిగా ఆయన వేయించిన కొండిపర్తి శాసనంలో అద్భుతంగా వర్ణించాడు.

కాకతి మహాదేవుని కుమార్తె కుందమాంబ. ఈమె వేయించిన ఆదిలాబాద్ జిల్లాలోని కుందవరం శాసనం, జనగామ జిల్లాలోని నిడిగొండ, కుందవరం శాసనాలు ప్రసిద్ధి పొందాయి. ఈ మూడు శాసనాలను రచించిన బాలభారతి కవి ఆమె గుణగణాలను, కీర్తిని వర్ణించారు. ఈమె గణపతి దేవుని సోదరి. ఈ శాసనాలు కాకతీయుల కాలంలో పండితుల ప్రజ్ఞ, రాజులు వారిపట్ల చూపిన ఆదరాభిమానాలను తెలుపుతాయని రచయిత్రి తెలుపుతారు.

ఇక కరీంనగర్ జిల్లాలో దొరికిన ఉప్పలపల్లి శాసనం అచ్చమైన తెలుగు శాసనం. ఇది పద్య గద్యాత్మకంగా ఉంటుంది. రాజనాయకుని కొడుకు కాటయ ఈ శాసనకర్త. కాకతీయులం కాలం నాటి శాసనం. ఒక్క అరసున్న వాడడం మినహాయించి ఏ లోపం లేకుండా పరిపుష్టమైన తెలుగు భాషాస్వరూపంగా కావ్యభాషలో ఈ శాసనం రాయబడిందని వివరించారు మనోహరిగారు.

కొలనుపాకలో సోమనాథాలయంలో క్రీ.శ. 13వ శతాబ్దం నాటి చాళుక్య ఇందు శేఖరుని కొలనుపాక శాసనం లభ్యమైంది. ఇందులో రుద్రమదేవి భర్త చాళుక్య వీరభద్రుడని స్పష్టంగా పేర్కొనబడింది. పూర్తి గా సంస్కృతంలో ఉన్న ఈ శాసనంలో కాకతి, చాళుక్య వంశ వర్ణనలు చేయబడ్డాయి. ఇందుశేఖరుడు చాళుక్య వీరభద్రుని కొడుకు అని, అతని అన్న కొడుకు అని భిన్నాభిప్రాయాలున్నాయి. నల్లగొండ జిల్లా నకిరేకల్లు మండలం చందుపట్ల గ్రామంలో లభించిన చందుపట్ల శాసనం కాకతీయ చరిత్రతో పాటు రుద్రమదేవి మరణాన్ని ధ్రువీకరిస్తుంది.

కాకతీయుల తదనంతరం తెలంగాణాను పరిపాలించినవారిలో పద్మనాయక వంశం పేరొందినది. వీరు అనేక దుర్గాలు నిర్మించారు. అంతకుముందున్న దుర్గాలను శత్రుదుర్భేద్యంగా పటిష్టం చేశారు. వీరు వేయించిన శాసనాల్లో అనపోతా నాయకుని రాచకొండ, అయినవోలు శాసనాలు ముఖ్యమైనవి.

అనపోతానాయకుని మనుమని భార్య రాణి నాగాంబిక. ఈమె నాగసముద్రం అనే పెద్ద తటాకాన్ని తవ్వి శాసనం వేయించింది. ఈ శాసనం రామచంద్రుని వర్ణనతో ప్రారంభం అవుతుంది. ఈ చెరువు ఓడలు తిరుగగలిగేంత పెద్దదిగా ఉండడం విశేషం. కాకతీయులు అనేక చెరువులను తవ్వించి, వ్యవసాయాన్ని, వాణిజ్యాన్ని విశేషంగా అభివృద్ధి చేసినట్లు తెలుస్తుంది. తర్వాతి రాజులు కూడా అదే మార్గంలో నడిచారు. వీటికి సంబంధించిన శాసనాలు తెలంగాణలో ఇంకా ఉన్నాయని వాటిని వెలికితీయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రచయిత్రి అభిప్రాయపడ్డారు.

మనోహరి గారి ఈ 'శాసనపర్వం' లో ఆలయ నిర్వహణకు గ్రామాల ప్రజలు సహకరించడం, పాలకుల క్షేమం కొరకు నైవేద్యాలను సమర్పించడం, సమానత్వాన్ని కాంక్షించడం, దైవం

కోసం భూదానం చేయడం, పితరులకు దానం చేయడం, వృత్తులను సమర్పించడం లాంటి ఎన్నో శాసనాలు పేర్కొనబడి చరిత్రను మనముందు నిలుపుతున్నాయి.

ఈ శాసనాలను నిశితంగా పరిశీలిస్తే రాజులు ప్రజా సంక్షేమం కోసం ఎంతో పాటుపడ్డారని, విద్య, వైద్యం, కళలు, వ్యవసాయం, వ్యాపారాలకు ప్రాధాన్యత నిచ్చారని, పాలనా పటిష్టత కోసం దుర్గాలను నిర్మించారని తెలుస్తోంది. రాణులు కూడా పాండితీ ప్రకర్ష కలిగి ఉండడమే కాక వితరణ శీలురై ప్రజల క్షేమం కొరకు కృషి చేశారని తెలుస్తున్నది.


కాలానుగతంగా ఎన్నో మార్పులు వస్తునప్పటికీ చారిత్రక సత్యాలను తెలుసుకోవడానికి శాసనాల వంటి లిఖిత ఆధారాలు ఎంతగానో ఉపయోగపడతాయని వాటిని తరువాతి తరాలకు అందించే ప్రయత్నంలో మనోహరి గారు కృతకృత్యులయ్యారు. దీనికోసం ఆమె చేసిన కృషి బహుధా ప్రశంసనీయం. ఆమె ఆకాంక్ష మేరకు కనుమరుగైన శాసనాలు వెలికితీయబడి చరిత్రను మనకు దృశ్యమానం చేస్తాయని ఆశిద్దాం.

❖ ❖ ❖ ❖ ❖

## వైభవంగా ఆవిష్కృతమైన 'గురుతరం'

**ప్రవీణ్‌కుమార్ బోళ్ళ**, తెలుగు అధ్యాపకులు, తెలంగాణ మైనారిటీస్ గురుకుల కళాశాల, కామారెడ్డి.
ఫోన్ : 99894 75899

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేళ్ల తెలుగుశాఖ ప్రాంగణం ఆచార్యుల సాహితీ సేవను మరొక్కమారు తలచుకుంది. 1919 నుండి 2024 వరకు ఈశాఖలో ఆచార్యులుగా పాఠాలు బోధిస్తూనే సాహితీ సృజనచేస్తూ లోకాన్ని వెలిగించిన గురువుల సాహిత్యాన్ని గ్రంథస్థం చేసే మహత్తర యాగం జరిగింది. ఆచార్య సాగి కమలాకర శర్మ ప్రధాన సంపాదకులుగా, డా.అట్టెం దత్తయ్య, శ్రీ బోళ్ళ ప్రవీణ్ కుమార్ సహసంపాదకులుగా తెలుగుశాఖ ప్రచురణలో "గురుతరం" అనే గ్రంథంగా పురుడుపోసుకుంది.




తెలుగుశాఖ శతాబ్ది సంబరాల సందర్భంగా జరిగిన కార్యక్రమాలలో భాగంగా **"ఉస్మానియా తెలుగు శాఖ ఆచార్యుల సాహిత్యం – సమాలోచన"** అన్న పేర జాతీయ సదస్సు నిర్వహించడం జరిగింది. ఆ సదస్సు పత్రాలన్నింటి క్రోడీకరణనే ఈ గ్రంథం. అరవై ఒక్క మంది ఆచార్యుల సాహిత్యంపై రాసిన ఈ అపురూప గ్రంథం ఆవిష్కరణ జులై 20 తేదీన, ఆర్ట్స్ కళాశాలలోని రూమ్ నెంబర్ 57లో అంగరంగ వైభవంగా జరిగింది. తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ అధ్యక్షులుగా ఈ సంబరం సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్. లింబాద్రి ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆరు వందలకు పైగా పేజీలలో ఆకాశమంత సాహిత్యాన్ని అక్షరబద్ధం చేసిన గ్రంథంగా ఈ సంకలనాన్ని కొనియాడారు. ఇటువంటి సంకలనాలు అరుదుగా జరుగుతుంటాయని, ఈ గ్రంథం భావి పరిశోధకులకే కాకుండా విశ్వవిద్యాలయంలోని వేరు వేరు శాఖలకు దారిదీపంలా నిలుస్తుందన్నారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సైద తలాత్ సుల్తాన ప్రసంగిస్తూ తెలుగుశాఖ నిత్య చైతన్యానికి ఈ గ్రంథం నిదర్శనమన్నారు. అరవై ఒక్క మంది అపూర్వాచార్యుల సాహిత్యాన్ని ఒడిసిపట్టడమంటే మాటలు కాదన్నారు. గౌరవ అతిథి, ధ్రువ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ దుండె మల్లేశం తన స్పందనను వినిపిస్తూ, ప్రజా సేవకే కాదు సాహిత్య గ్రంథాలను లోకానికి పంచడానికి రచయితలకు సహాయకారిగా ధ్రువ ఫౌండేషన్ ఎప్పుడూ ముందుంటుందని, ఇటువంటి బహుమూల్య గ్రంథ నిర్మాణంలో తమ సంస్థకు స్థానాన్ని కల్పించి తెలుగుశాఖకు తమ సేవలు అందేలా చేసిన అధ్యక్షుల వారికి, ఆచార్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

సభాధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ సభనుద్దేశించి మాట్లాడుతూ తమ బోధనలతో తెలుగుశాఖ విద్యార్థులను తీర్చిదిద్దుతూనే సాహిత్య సృష్టి చేసిన అరవై ఒక్కమంది అపూర్వ, ప్రస్తుత ఆచార్యుల సాహిత్య వ్యాసాల సంకలనమిదన్నారు. తెలుగుశాఖ నిత్య చైతన్యంతో క్రియాశీలకంగా ఉంటూ సాహిత్య చరిత్రను నిక్షిప్తం చేస్తున్నదని, ఈ శాఖ కృషి రాయప్రోలు, ఖండవల్లి నుండి నిరంతరం కొనసాగుతున్నదని ఈ క్రమంలో 'గురుతరం' పేరుతో ఇక్కడ పనిచేసిన, పనిచేస్తున్న ఆచార్యుల సాహిత్యాన్ని ఆరు వందల అరవై ఎనిమిది పుటలతో బృహద్గ్రంథంగా తీసుకురావడంపట్ల శాఖ ఎంతో గర్విస్తున్నదన్నారు.

ఈ కార్యక్రమానికి ఆత్మీయ వాక్యాలు పలుకుతూ తెలుగుశాఖ సీనియర్ ప్రొఫెసర్ డా.సూర్యాధనంజయ్ మాట్లాడుతూ ఆచార్యుల తెలుగుశాఖ విద్యార్థులుగా ఉండి ఇదే శాఖలో విద్యాబోధన చేసే అవకాశం కలగడం, గురువుల మార్గంలో సాహితీ సృజన చేయడం వారి సమక్షంలో ఈ 'గురుతరం' గ్రంథం ఆవిష్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆచార్య రాయప్రోలు, ఖండవల్లి, దివాకర్ల, అమరేశం రాజేశ్వర శర్మ, సి. నారాయణ రెడ్డి, ఎన్. గోపి, ఎస్వీ. రామారావు, కసిరెడ్డి వెంకట్ రెడ్డి సాహిత్య వారసత్వంలో తెలుగుశాఖ ప్రయాణం చేస్తున్నదన్నారు.

మరొక ఆత్మీయ వాక్యకారులు ఆచార్య సి. కాశీం మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం, నిరంతర సాహితీ సృజనకు తెలుగుశాఖ కేంద్రమన్నారు. బోధన, పరిశోధన, సాహితీ సృజనలతో తెలుగుశాఖ మొదటి నుండి గొప్పగా సాహిత్య సృజన చేసిందని తెలియజేశారు.

గ్రంథ సమన్వితమైన అరవై ఒక్క ఆచార్యుల సాహిత్య వ్యాసాల సారాన్ని సహాయాచార్యులు డా.ఎస్. రఘు సభకు పరిచయం చేశారు. ఈ గ్రంథంలో ఎన్నో ప్రత్యేకతలున్నాయని, తెలుగుశాఖకు వెలుగులుగా, తెలుగుశాఖను వెలిగించిన ప్రముఖులుగా ఉన్న ఆచార్యుల విశేషాల సమాహారమీ గ్రంథమని తెలియజేశారు.

ఈ సందర్భంగా అపూర్వాచార్యులను, ప్రస్తుత ఆచార్యులను ఘనంగా సత్కరించుకుంది తెలుగుశాఖ. ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ అపూర్వాచార్యులు ఎస్వీ రామారావు, సురేంద్ర కుమార్, కసిరెడ్డి వెంకట్ రెడ్డి, సుమతీ నరేంద్ర, కుసుమారెడ్డి, ఎస్వీ. సత్య నారాయణ, మసన చెన్నప్ప, ఎం. అండమ్మ, వెలుదండ నిత్యానందరావు, గోనా నాయక్, పి. వారిజారాణి, ఎన్.ఆర్ వెంకటేశం తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ ఆర్ట్స్ కళాశాల, నిజాం కళాశాల, కోఠి మహిళా విశ్వ విద్యాలయం నుండి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఎంతో సంబరంగా సాగిన ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ సహాయాచార్యులు, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డా.ఏలె విజయలక్ష్మి స్వాగతం పలుకగా ధ్రువ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి హోదాలో ముగింపు వాక్యాలు పలికే అవకాశం నాకు రావడం ఎంతో ఆనందదాయకం.


## ఆలోకనం


**(తెలంగాణ 31 జిల్లాల**
**చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.
తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.
330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.
అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.
**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

## 'కదంబం'


**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**
**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**
**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**
(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే
ఉత్తమ గ్రంథం 'కదంబం'.
**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

# స్వ'కృతి'






**ఆచార్య అనుమాండ్ల భూమయ్య సమగ్ర సాహిత్యం విమర్శ (సిద్ధాంత ద్వయం)**
ఆచార్య అనుమాండ్ల భూమయ్య
వెల : 250/-
**ప్రతులకు :** మనస్వినీ దేవి, అయోధ్య, ఫ్లాట్. 519, బ్లాక్ - ఏ, అపురూప జగతి హైట్స్, ఆదర్శ నగర్, ఉప్పల్, హైదరాబాద్ - 500 029.
ఫోన్: 889 707 3999




**వేమన సంపూర్ణ జీవిత చరిత్రము, బోధనలు**
వంగూరి సుబ్బారావు
సంపా. డా. డి. చంద్రశేఖర రెడ్డి
వెల : 150/-
**ప్రతులకు :** ఎమెస్కో బుక్స్ ప్రై.లిమిటెడ్. 1-2-7, బానూ కాలనీ, గగన్‌మహల్ రోడ్, దోమల్ గూడ, హైదరాబాద్ - 500 029.



**పుత్తూరు పిల'గోడు' (..సరదా కతలు..)**
ఆర్.సి. కృష్ణస్వామి రాజు
వెల : 160/-
**ప్రతులకు :** రచయిత, 22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ, మాంగలం రోడ్, తిరుపతి - 517 507.
ఫోన్ : 939 3662821



**సంగీత సౌరభాలు**
సామల రాజవర్ధన్
వెల : 300/-
**ప్రతులకు :** రచయిత,
ఇం.నెం. 7-7-44/21, సులోచనా నిలయం, విద్యానగర్, ఆదిలాబాద్ - 504 001.
ఫోన్ : 9652950959



**రావినూతల శ్రీరాములుగారి సాహిత్యావలోకనం**
రచన : డా. గంధం సుబ్బారావు
వెల : 100/-
**ప్రతులకు :** వై. భరద్వాజ, కార్యదర్శి, శ్రీ ఎరగుడిపాటి రామయోగి మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, 12-13-414/11, సరస్వతి నిలయం, స్ట్రీట్ నెం.1, తార్నాక, సికింద్రాబాద్.
ఫోన్ : 939 138 1131


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com



**శ్రీ శోభనాచలపతి సుప్రభాత స్తోత్రమ్**
శ్రీ వేమూరి వేంకట్రామ సుబ్రహ్మణ్యం
సం. వేమూరి శ్రీనివాస మూర్తి
వెల : అమూల్యం.
ప్రతులకు : హరిత సదనం, 5-2-13/1, ఎపిహెచ్‌బి కాలనీ, మీర్‌పేట, మౌలాలి, సికిందరాబాద్
ఫోన్ : 9490124414



**గంగెద్దు (కథలు)**
శీలం భద్రయ్య
వెల : 120 /-
ప్రతులకు : శీలం కరుణ, 8-1-150, ఫ్లాట్ నెం. 25, పద్మావతి కాలనీ, నల్గొండ - 508 001
ఫోన్ : 988583 8288



**ఇంద్రధనుస్సు (పద్యకావ్యం)**
ఎస్.ఆర్. పృథ్వి
వెల : 100/-
ప్రతులకు : పి. ఉషారాణి, 104-6-140, ఎం.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమహేంద్రవరం - 533101
ఫోన్ : 99892 23245

ISSN 2457-0796
UGC CARE List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -27 : సంచిక - 10  హైదరాబాద్ ఆగస్టు : 2024

# స్వార్థం ఉంటే బాగుండు

**ధూళిపాళ్ళ మాధవీ కిశోర్**


గుంటూరు, ఫోన్ : 994973 5253



బిడ్డకు జన్మనివ్వాలనే స్వార్థంతో తన రక్తాన్ని పంచి పునర్జన్మ పొందుతుంది తల్లి
తల్లిని బిడ్డలా చూసుకునే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు
బిడ్డ ఏడవకూడదనే స్వార్థంతో స్తన్యం అమృతంగా మారుస్తుంది తల్లి.
తల్లి మనస్సు చెమ్మగిల్ల కూడదనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు
బిడ్డ బుడి బుడి అడుగులతో మురిసి పోవాలనే స్వార్థంతో చెయ్యిపట్టి అడుగులు నేర్పుతుంది తల్లి.



తల్లి నడవలేని స్థితిలో తనకు ఊతమవ్వాలనే స్వార్థం బిడ్డకు ఉంటే బాగుండు
బిడ్డ కడుపు నింపాలనే స్వార్థంతో ఆకలి మరచిపోతుంది తల్లి.
తల్లి ఆకలితో ఉండకూడదనే స్వార్థం బిడ్డకు ఉంటే బాగుండు
బిడ్డ అన్నింటా ముందుండాలనే స్వార్థం తో సమయాన్ని వెచ్చిస్తుంది తల్లి
తల్లి కోసం కొంత సమయం కేటాయించాలనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు
బిడ్డ అవసరాలు తీర్చాలనే స్వార్థంతో తనకేమవసరమో మర్చిపోతుంది తల్లి
తల్లికి ఆసరాగా నిలబడి తన అవసరం గుర్తించే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు.
బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే స్వార్థంతో కనిపించని దైవాన్ని వేడుకుంటుంది తల్లి.
కనిపించే తల్లిలోని దైవత్వాన్ని చూడగలిగే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు
బిడ్డ కలలను నెరవేర్చాలనే స్వార్థంతో బిడ్డ కలనే తన కలగా మార్చుకుంటుంది తల్లి.
తల్లి చిరకాల స్వప్నాన్ని నిజం చేయాలనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు.
బిడ్డ నడిచే దారిలో వెలుగునింపాలనే స్వార్థంతో కొవ్వొత్తిలా కరుగుతూ వెలుగునిస్తుంది తల్లి.
తల్లికళ్ళలో వెలుగు చెదరనివ్వకూడదనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు



బిడ్డకి బంగారు భవిష్యత్తును ఇవ్వాలనే స్వార్థంతో తలకు మించిన భారాన్ని మోస్తుంది తల్లి.
తల్లి భారం కాదనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు ..
బిడ్డ తప్పులను సరిదిద్దాలనే స్వార్థంతో మృదువుగా దండిస్తుంది తల్లి
తల్లి దండన దీవెనగా భావించే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు.
బిడ్డకు ఏ కీడు వాటిల్లకూడదనే స్వార్థంతో తల్లి కల్మషంలేని ప్రేమను రక్షగా కడుతుంది
తల్లి గొప్పతనాన్ని ఎరిగి రక్షణ గా ఉండాలనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు .
బిడ్డ దీర్ఘాయువు పొందాలనే స్వార్థంతో తన ఆయుష్షు ను కూడా పోసుకోమంటుంది తల్లి .
తల్లి పై తను చూపించే ప్రేమకు దీర్ఘాయువు ఉండాలనే స్వార్థం బిడ్డకి ఉంటే బాగుండు.

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

State Bank of India, Nallakunta Branch,
A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083

రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

## వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma

Scanned with OKEN Scanner